అనుదినం... జనస్వరం

# నవతెలంగాణ

ఆదివారం 6-10-2019

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 280 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి | వెల : 8.00






# సమ్మె సక్సెస్

## ఆగిన ఆర్టీసీ చక్రాలు

## ప్రభుత్వ బెదిరింపులు బేఖాతర్


ముషీరాబాద్ డిపోలో నిలిచిపోయిన బస్సులు..

- ఒక్క ఉద్యోగీ విధుల్లో చేరని వైనం
- డిపోల ఎదుట ధర్నాలు- అరెస్టులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో సర్కారు బిజీ
- కార్మికులతో మైండ్‌గేమ్
- దండుకున్న ప్రయివేట్ ట్రావెల్స్
- బస్సుకు రూ.5వేలు తేవాలంటూ అధికారుల బెదిరింపులు
- టికెట్ లేకుండానే దోపిడీ
- మహబూబాబాద్‌లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- నేడు సీఎం కేసీఆర్ రివ్యూ
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిన జేఏసీ


నినదిస్తున్న కార్మిక సంఘాల నేతలు

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ప్రభుత్వం కార్మికుల పైకి పోలీసుల్ని ఉసిగొల్పింది. ఆందోళనలు చేస్తున్న ఆర్టీసీ కార్మికుల్ని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. ఎంతమందిపై పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ కార్మికులు ఎక్కడా వెనక్కి తగ్గకుండా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. తొలిరోజు ఆర్టీసీలోని 50 వేల మంది కార్మికులు, ఉద్యోగులు సంపూర్ణంగా సమ్మెలో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల్లోపు విధుల్లో చేరకుంటే ఆర్టీసీ ఉద్యోగులుగా గుర్తించేది లేదని సీఎం కేసీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన హెచ్చరికల్ని సర్కారు బెదిరింపుల్ని ఆర్టీసీ కార్మికులు పట్టించుకోలేదు. సంస్థ పరిరక్షణ, తమ సమస్య పరిష్కారం కోసం కార్మికులు చేపట్టిన సమ్మె మొదటి రోజు విజయవంతమైంది. విధుల్లోనుంచి డిస్మిస్ చేస్తామని స్వయంగా సీఎం కేసీఆర్ హెచ్చరించినా...ఎందుకు దిగిరావో చూస్తాం అంటూ సర్కారుపై సమరానికి సై అన్నారు. బస్సులు డిపోల నుంచి కదల్లేదు. కొన్ని చోట్ల భారీ పోలీసు బందోబస్తు మధ్య మధ్యాహ్నం కొన్ని బస్సులను నడిపించారు. వాటిని కార్మికులు అడ్డుకోవడంతో అరెస్టులు చేశారు. వారి ఆందోళనకు టీఆర్ఎస్ మినహా అన్ని రాజకీయపార్టీలు, యువజన, విద్యార్థి, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఆర్టీసీ కార్మికులు ఒంటరి కాదని, వారివెంట తామున్నామని ఆయా సంఘాల నేతలు ప్రకటించారు. మహబూబాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. మరోవైపు ప్రభుత్వం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల నియామకం చేపట్టినా సత్ఫలితాలను ఇవ్వలేదు. ఆర్టీసీ జేఏసీ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాయి. దీంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. ఆర్టీసీపై ఆదివారం సీఎం కేసీఆర్ సమీక్ష చేయాలని నిర్ణయించారు.

...9లో


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల రద్దీ




# ఆప్షన్ల ప్రకారమే నియామకాలు

**544 మంది తెలంగాణకు..**

- 613 మంది ఏపీకి...
- విద్యుత్ ఉద్యోగుల విభజనపై జస్టిస్ ధర్మాధికారి కమిటీ
- వచ్చేనెల 2,3 తేదీల్లో విజయవాడలో మళ్లీ భేటీ

**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని విద్యుత్ ఉద్యోగుల విభజన చిక్కుముడిని జస్టిస్ ధర్మాధికారి కమిటీ విప్పేందుకు ప్రయత్నించింది. రెండురోజులుగా ఇక్కడ జరుగుతున్న ఇరు రాష్ట్రాల విద్యుత్ సంస్థల అధికారుల సమావేశంలో కమిటీ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నవంబర్ 2,3 తేదీల్లో విజయవాడలో జరిగే కమిటీ సమావేశంలో పరిష్కరించుకోవచ్చని సూచించింది. ధర్మాధికారి గైడ్‌లైన్స్ ప్రకారం ఏపీ విద్యుత్ సంస్థల రాష్ట్ర కేడర్ ఉద్యోగులు ఇప్పటికే ఆప్షన్లు ఇచ్చారు. తెలంగాణలో మాత్రం ఆప్షన్లు లేకుండా స్థానికత ఆధారంగా 1,157 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారని, వారిని తొలగిస్తూ యాజమాన్యాలు ఉత్తర్వులు ఇచ్చాయి. దీనిపై సదరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు జస్టిస్ ధర్మాధికారి కమిటీని నియమించింది. ఇప్పటికే పలు దఫాలుగా ఇరు రాష్ట్రాల అధికారులతో కమిటీ భేటీ అయ్యింది. చివరకు కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యోగులు కూడా ఆప్షన్లు ఇవ్వక తప్పలేదు. తొలగించిన 1,157 మందితోనే పేచీ వస్తుండటంతో వారి ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోకుండా తెలంగాణ విద్యుత్ సంస్థలు స్థానికత పేరుతో గతంలోని మాదిరే నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం జరిగిన సమావేశంలో దీన్ని జస్టిస్ ధర్మాధికారి తప్పుపట్టారు. 1,157 మంది

...9లో




## కాశ్మీర్‌లో 'మానవీయ సంక్షోభం'

**సమాచార వ్యవస్థపై నిషేధం, పౌర హక్కులపై ఆంక్షలు తొలగించాలి**

- భారత్‌కు అమెరికా సెనేట్ కమిటీ సూచన

వివరాలు 9లో

## ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో..

**ప్రధానికి 71మంది రిటైర్డ్ ఉన్నతాధికారుల లేఖ**

వివరాలు 9లో

# హుజూర్‌నగర్‌లో ప్రజానాయకున్ని బలపరుస్తాం

**ఆర్టీసీ సమ్మెకు సంపూర్ణ మద్దతు**

- పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ బాధాకరం: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ ఉప ఎన్నికలో తమ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురవ్వడం బాధాకరమని, అయితే, పార్టీలకతీతంగా ఉన్న ప్రజానాయకున్ని ఓటు ద్వారా బలపరుస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర

...9లో


మాట్లాడుతున్న తమ్మినేని..

# దొంగఖాతాలతో రుణాలు

**పంజాబ్, మహారాష్ట్ర కో-ఆపరేటివ్ బ్యాంకులో భారీ కుంభకోణం**

- ఆర్థికమోసం విలువ రూ.6500 కోట్లు
- మాజీ ఎండీ, రుణాలు తీసుకున్న రియల్‌ఎస్టేట్ ప్రమోటర్లు అరెస్టు

**ముంబయి :** పంజాబ్, మహారాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంకు మాజీ ఎండీ జోయ్ థామస్‌ను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. రూ.6500కోట్ల ఆర్థిక కుంభకోణంలో ఆయనపై పలు ఆరోపణలు నమోదయ్యాయి. హౌజింగ్ డెవలప్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌డీఐఎల్) సంస్థ ప్రమోటర్లు రాకేశ్, సారంగ్ వాద్వాన్‌లను ఆర్థిక నేరాల విభాగం ముంబయి పోలీసులు అరెస్టు చేసిన మరుసటి రోజే బ్యాంకు మాజీ ఉన్నతాధికారి అరెస్టు కావటం సర్వత్రా చర్చనీయాంశమైంది. పీఎంసీ బ్యాంకు మాజీ చైర్మెన్ ఎస్. వార్యాం సింగ్, జోయ్ థామస్, వాద్వాన్‌లపై ఎన్‌ఫోర్స్‌మేంట్

...9లో




# ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం

**4.9 కిలోలు స్వాధీనం**

**నవతెలంగాణ - శంషాబాద్**

విదేశాల నుంచి అక్రమంగా తీసుకొస్తున్న 4.9కిలోల బంగారాన్ని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఆర్జీఐ ఎయిర్‌పోర్టులో శుక్రవారం అర్ధరాత్రి డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. డీఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయి నుంచి ఇద్దరు ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చారు. వారిద్దరినీ అధికారులు తనిఖీ చేయగా 42 బంగారం బిస్కెట్లు (4.9కిలోలు) ఉన్నట్టు గుర్తించారు. బంగారానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ.1.84 కోట్లకు పైగా ఉంటుంది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.


స్వాదీనంచేసుకున్న బంగారం

# బడికి రాని పంతుళ్లపై వేటు?

**106 మంది ఉన్నట్టు విద్యాశాఖ గుర్తింపు**

- ఐదేండ్లకుపైగా సమాచారమివ్వని 22 మంది తొలగింపు
- మిగిలిన 84 మందికి షోకాజ్ నోటీసులు
- సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రభుత్వ బడులకు హాజరుకాని ఉపాధ్యాయులపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైంది. డుమ్మా కొట్టే ఉపాధ్యాయులను ఉపేక్షించకుండా చర్యలు తీసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ సమాయత్తమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా డుమ్మా కొట్టే ఉపాధ్యాయులు 106 మంది ఉన్నట్టు ఆ శాఖ గుర్తించింది. వనపర్తి, నారాయణపేట, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి మినహా మిగతా 29 జిల్లాల ఉపాధ్యాయులు ఉన్నట్టు విద్యాశాఖ సర్కారుకు నివేదించింది. ఇందులో ఐదేండ్లకుపైగా సమాచారం ఇవ్వకుండా 22 మంది ఉపాధ్యాయులున్నారు. హైదరాబాద్‌లో నలుగురు, రంగారెడ్డిలో ఐదుగురు చొప్పున ఈ రెండు జిల్లాల నుంచే తొమ్మిది మంది ఉన్నారు. క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్ (సీసీఏ) నిబంధనల ప్రకారం ఐదేండ్లకుపైగా సమాచారం ఇవ్వకుండా ఉంటే వారిని ఉద్యోగం నుంచి తొలగించొచ్చు. సీసీఏ నిబంధనలను అనుసరించి 22 మందిని తొలగించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు న్యాయసలహా తీసుకుంటున్నారు. ఇక సమాచారం ఇవ్వకుండా 84 మంది ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరవుతున్నారు. సమాచారం ఇవ్వకుండా ఏడాదిలోపు ఉన్న వారు పది మంది, ఏడాదికిపైగా 20 మంది, రెండేండ్లకుపైగా 24 మంది, మూడేండ్లకు పైగా 14 మంది, నాలుగేండ్లకుపైగా 16 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వారికి ముందు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆ ఉపాధ్యాయుల చిరునామాకు ఆ నోటిసులు పంపిస్తారు. వారి సమాధానం ఆధారంగా సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం విద్యాశాఖకు ఉందని అధికారులు చెబుతున్నారు.

**డుమ్మాకు కారణాలనేకం**

ప్రభుత్వ ఉద్యోగమంటే ఎంతో బాధ్యత ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వారికి సమాజంలో గౌరవం లభిస్తుంది. అందులోనూ ప్రభుత్వ ఉపాధ్యాయులంటే ఆ ప్రత్యేకతే వేరు. అలాంటిది ప్రభుత్వ టీచర్‌గా ఉండి బడికి డుమ్మా కొట్టే పరిస్థితి వచ్చిందంటే అనేక కారణాలుండొచ్చు. ఇతర ఉద్యోగం రావడం వల్ల కొందరు ఉపాధ్యాయులు సమాచారం ఇవ్వకపోవవచ్చు. విదేశాలకు వెళ్లిన వారికి ఆర్నెళ్ల వరకే అనుమతి ఉంటుంది. ఐదేండ్ల వరకు అనుమతి పొందాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. సరైన కారణాలు చెప్పకపోవడం, ఇంతకంటే ఎక్కువ వేతనం వచ్చే ఉద్యోగం దొరకడం వంటి కారణాలతో మరికొందరు సమాచారం ఇవ్వడం లేదు. ఇక భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేసే వారూ

...9లో




## స్థానిక ప్రజాప్రతినిధుల వేతనాలు విడుదల

**రూ.32 కోట్లకు జీవో జారీ**

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

స్థానిక ప్రజాప్రతినిధులకు సంబంధించిన పెండింగ్ వేతనాల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 32 కోట్ల 19 లక్షలా 45 వేల రూపాయలను విడుదల చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్ జీవో నెంబర్ 527ను శనివారం విడుదల చేశారు. ఈ నిధుల ద్వారా సర్పంచ్‌లకు, జెడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు పెండింగ్ వేతన బకాయిలను చెల్లించనున్నారు.

## పౌరతస్వ బిల్లుకు మేం వ్యతిరేకం..!

- మిజోరాం ముఖ్యమంత్రి జోరంతాంగ



**ఐజ్వాల్ :** కేంద్రం తీసుకురావాలనుకుంటున్న పౌరసత్వ సవరణ బిల్లుకు తాము వ్యతిరేకమని మిజోరాం ముఖ్యమంత్రి జోరంతాంగ కేంద్రం హోంమంత్రి అమిత్‌షాకు స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదనను తమ రాష్ట్ర ప్రజలు అంగీకరించరని అన్నారు. ఈ బిల్లు గనుక పార్లమెంట్‌లో ఆమోదం పొందితే మిజోరాంలో అక్రమ వలసదారులకు గేట్లు ఎత్తినట్టుగా ఉంటుందని తెలిపారు. శనివారం మిజోరాం పర్యటనకు వచ్చిన అమిత్‌షాను జోరంతాంగ ఐజ్వాల్‌లోని రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అమిత్‌షా మిజోరాం పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అంతకుముందు ఆయన్ను రాష్ట్రంలోని పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నేతలు కలిసి పౌరసత్వ సవరణ బిల్లుపై వినతిపత్రం సమర్పించారు. బిల్లును విరమించుకోవాలని వారు కోరారు. ఒకవేళ ఈ బిల్లును ఆమోదిస్తే మిజోరాంతో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలను ఆ బిల్లు పరిధి నుంచి తొలగించాలని స్వచ్ఛంద సంస్థల సమన్వయ కమిటీ పేర్కొంది. ఈ బిల్లుపై అమిత్‌షా ఈనెల 1వ తేదీన మాట్లాడుతూ 'బిల్లు పార్లమెంట్‌లో అమోదం పొందితే ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చే హిందూ, సిక్కు, బుద్ధ, జైన్, పార్సీ, క్రిస్టియన్ మతాలను చెందిన వారు దేశంలో ఏడు సంవత్సరాల పాటు నివసిస్తే వారికి పౌరసత్వం లభిస్తుంది. ఇందుకు ఎటువంటి పత్రాలను కూడా సమర్పించాల్సిన అవసరం లేదు' అని అన్నారు. అయితే ఈ ప్రతిపాదిత బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో పెద్దఎత్తున వ్యతిరేకత వస్తోంది.

## ఫరూక్, ఒమర్‌లతో నేడు ఎన్‌సీ బృందం భేటీ

- జమ్మూ గవర్నర్ సత్యపాల్ అనుమతి

**శ్రీనగర్ :** గృహ నిర్బంధంలో ఉన్న జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు, నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనాయకులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లాలతో ఆ పార్టీ ప్రతినిధి బృందం నేడు సమావేశం కానున్నది. ఫరూక్, ఒమర్‌లను కలుసుకోడం కోసం 15 మంది సభ్యులతో కూడిన ఎన్‌సీ బృందానికి జమ్మూకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ అనుమతినిచ్చారు. దీంతో ఎన్‌సీ ప్రాంతీయ అధ్యక్షుడు దేవేందర్ సింగ్ రానా నేతృత్వంలోని బృందం శ్రీనగర్‌లో ఆ ఇద్దరు నాయకులను కలిసి సమావేశం కానున్నది. పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కూడిన బృందం నేడు ఉదయం ఇండిగో విమానంలో జమ్మూ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరుతుందని ఎన్‌సీ అధికార ప్రతినిధి మదన్ మాంటూ తెలిపారు. అగ్రనాయకత్వంతో సమావేశం అనంతరం పార్టీ తదుపరి కార్యాచరణను రూపొందించనున్నట్టు వెల్లడించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో హక్కుల కార్యకర్త అరెస్ట్

### జైల్లో ఉన్న అమాయక గిరిజనుల విడుదలకు డిమాండ్



**రాయ్‌పూర్:** ఆదివాసీ హక్కుల కార్యకర్త సోని సోరిని దంతేవాడ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. జైళ్లలో మగ్గుతున్న అనేకమంది అమాయక గిరిజనులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. సమ్మె చేయడానికి యత్నించారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని బిజాపూర్, సుక్మా, దంతెవాడకు చెందిన సుమారు 6వేల మంది గిరిజనులతో పాటు 'ఆదివాసీ మహాసభ' అధ్యక్షుడు మనీశ్ కుంజం, ఇతర నాయకులు జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. దీంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్న నేపథ్యంలో వారందరినీ చెదరగొట్టి సోనిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. కాగా, సమ్మెకు అనుమతి కోరుతూ.. దంతెవాడ కలెక్టర్‌కు, జిల్లా మెజిస్ట్రేట్‌కు ముందే సమాచారమిచ్చామనీ, అయినప్పటికీ పోలీసులు దౌర్జన్యంగా సోనీని అరెస్ట్ చేశారని గిరిజన సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు.

## వరద బాధితులను వణికిస్తున్న విషజ్వరాలు

- 60 గంటల్లో 400 డెంగ్యూ కేసుల నమోదు

**పాట్నా:** బీహార్‌లో రెండువారాలుగా కురుసున్న భారీవర్షాలు బీభత్సం సృష్టించాయి. జనజీవాన్ని స్థంభింపజేసింది. వందలాది మంది మృతిచెందారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇదిలా ఉంటే మరోవైపు సహాయక కేంద్రాల్లో అనేకమంది విషజ్వరాల బారిన పడుతున్నారు. గత 60 గంటల్లో 400 పైగా డెంగ్యూ కేసులు నమోదు కావడంతో మరింత భయభ్రాంతులకు గురిచేస్తున్నది. పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (పీఎంసీహెచ్), నలంద మెడికల్ ఆస్పత్రి, ప్రయివేట్ ఆస్పత్రుల్లో, ఇతర క్లినిక్‌లలో డెంగ్యూ పాజిటివ్ కేసులు గుర్తించారు. ఇతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన ఆరోగ్య శిబిరాల్లోనూ డెంగ్యూ పాజిటివ్‌గా తేలినట్టు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో డెంగ్యూతో పాటు, చికెన్‌గునియా, డయేరియాలు కూడా వ్యాప్తి చెందుతున్నాయని అధికార నివేదికలు తెలిపాయి. ఈ పరిస్థితిపై డాక్టర్ రూపేశ్ మాట్లాడుతూ..“ భారీవర్షాలతో చాలా ప్రాంతాలు నీట మునిగాయి. ఆ వరదనీటలో అనేక చోట్ల జంతువుల మృతదేహాలు తేలియాడుతున్నాయి. దీంతో అనేక వ్యాధికారక సూక్ష్మ జీవులు వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నీరు కాలుష్యమైంది. ప్రజలు జాగ్రతగా ఉండాలి. దోమల వ్యాప్తి జరగకుండా చర్యలు తీసుకోవాలి. వీలైనంత వరకూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.” అని సూచించారు నివారణ చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లుకోవటానికి, రోడ్లను శుభ్రం చేయడానికి, జంతువుల మృతదేహాలను తొలగించడానికి సుమారు 75 బృందాలను మోహరించినట్టు పాట్నా జిల్లా కలెక్టర్ రవికుమార్ తెలిపారు.

## అడిగింది రూ.3వేల కోట్లు, కేంద్రం ఇచ్చింది రూ.1200కోట్లే

### కర్నాటకకు వరద సహాయం..

**బెంగళూరు:** కర్నాటకను రెండు నెలల క్రితం భారీ వర్షాలు ముంచెత్తాయి. వర్షాల ధాటికి రాష్ట్రమంతా అతలాకుతలమైంది. సుమారు వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 6.9 లక్షల హెక్టార్లకు పైగా పంటపొలాలు మునిగిపోయాయి. 75,317 ఇండ్లు దెబ్బతిన్నాయి. సుమారు రూ.50వేల కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో ముఖ్యమంత్రి బి.ఎస్ యడియూరప్ప తక్షణం సహాయం కింద రూ.3వేల కోట్లు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

కానీ కేంద్రప్రభుత్వం వరదల సమయంలో కేవలం జాతీయ విపత్తు నిర్వహణ బృందం (ఎన్డీఆర్ఎఫ్), వైమానిక దళం, ఆర్మీ ద్వారా మాత్రమే సహాయం అందించి చేతులు దులుపుకున్నది. కేంద్రం నుంచి తక్షణ ఆర్థికసాయం కోసం వేచి చూసిన కర్నాటకకు భంగపాటే ఎదురైంది. దీంతో చేసేదేమీలేక సీఎం యడియూరప్ప.. ప్రయివేటు సంస్థలను సాయం చేయాల్సిందిగా కోరారు. అంతేకాకుండా సాయం చేసిన వారి పేర్లను ఊర్లకు పెడతానని తెలిపారు. అయినా కేంద్రం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

## పోలీసులతో యడియూరప్ప మేనల్లుడు గొడవ

- సోషల్ మీడియాలో హల్‌చల్

**బెంగళూరు :** కర్నాటక ముఖ్యమంత్రి బిఎస్ యడియూరప్ప మేనల్లుడు విరూపాక్ష యమకనమరాది స్థానిక పోలీసులతో ఘర్షణ పడిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. ఈ ఘటన బెళగావి సర్క్యూట్ హౌస్ వెలుపల చోటుచేసుకుంది. విరూపాక్ష సర్క్యూట్ హౌస్ నుంచి వస్తుండగా, నెమ్మదిగా వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో ఒక్కసారి వారిపై విరూపాక్ష అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో పోలీసులు కూడా వాగ్వాదానికి దిగడంతో అది ఘర్షణకు దారి తీసిందని స్థానికులు చెబుతున్నారు.

# విలేకరుల వేషంలో ఖాకీలు.. బీజేపీ లీడర్లు

### అసలు ఎవరు.. నకిలీ ఎవరో తెలీక ప్రజల సతమతం

- వాస్తవాలు వెల్లడిస్తే బలగాల నుంచి వేధింపులు
- లోయలో మీడియాపై అపనమ్మకం

**శ్రీనగర్ :** ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకాశ్మీర్ విభజన నిర్ణయం జరిగి దాదాపు రెండు నెలల గడుస్తున్నా.. లోయలో మాత్రం పరిస్థితులు సాధారణ స్థితికి చేరడంలేదు. సమాచార వ్యవస్థ ఇప్పటికీ పునరుద్ధరణ కాలేదు. టెలిఫోన్ లైన్లు కలవడం లేదు. రవాణా వ్యవస్థకు ఆటంకం ఏర్పడింది. మరీ ముఖ్యంగా అక్కడి సమాచారాన్ని బయటి ప్రపంచానికి చేరవేసే స్థానిక మీడియాపై దీని ప్రభావం మరింతగా పడింది. దీంతో అక్కడి జర్నలిస్టులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఇక ఇక్కడి పోలీసు అధికారులు, బీజేపీ నేతలు విలేకరుల వేషంలో వెళ్లి ప్రజల నుంచి సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. ఎవరైనా అక్కడి నిజాలు తెలిపితే ఇక అంతే సంగతులు. అక్కడి భద్రతా బలగాలు వారిని వేధింపులకు, చిత్రహింసలకు గురిచేస్తున్నాయి. ఇటు అసలు మీడియా విలేకరులు ఎవరో తెలీక.. అటు సైనిక బలగాల వేధింపులకు భయపడి సాధారణ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో మీడియాపై వారికి విశ్వాసం సన్నగిల్లింది. ఇక జాతీయ మీడియా ఇక్కడి వాస్తవాలను, దుర్భర పరిస్థితులను తొక్కిపెట్టి 'అంతా సాధారణంగా' ఉన్నదని అవాస్తవాలను ప్రసారం చేయడం గమనార్హం.



దిగ్బంధంలో ఉన్న కాశ్మీర్‌లో ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ కాశ్మీర్ ప్రెస్ క్లబ్ వద్ద దాదాపు 300 మందికి పైగా జర్నలిస్టులు ఇటీవలే నిరసనకు దిగారు. అధికార బలంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి ప్రజల గొంతును నొక్కుతున్నాయని వారు ఆరోపించారు. “సైనిక బలగాలు మమ్మల్ని భయకంపితుల్ని చేస్తున్నాయి. ఒకవేళ మేము మీడియాతో మాట్లాడినట్టు తెలిస్తే వారు(సైనికులు) మా ఇండ్లకు చేరుకొని కుటుంబసభ్యులందరినీ శిక్షిస్తారు” అని దక్షిణ కాశ్మీర్‌లోని షోపియాన్‌కు చెందిన బాధిత టీనేజర్ ఒకరు వాపోయాడు. భద్రతా బలగాల టార్చర్‌కు భయపడి సదరు బాధితుడు గతంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం గమనార్హం. “ లోయలోని పరిస్థితుల గురించి మేము వాస్తవాలు తెలిపినప్పటికీ.. జాతీయ మీడియా మాత్రం పూర్తిగా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నది. ఇక్కడ(కాశ్మీర్) అంతా సవ్యంగానే ఉన్నదని చూపిస్తున్నది” అని మరొక బాధితుడు వివరించారు.

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కాశ్మీర్‌లో జర్నలిజం అంత సులువు కాదనీ, ఆంక్షల కారణంగా జర్నలిస్టులందరూ ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానిక విలేకరి ఒకరు వాపోయారు. “భద్రతా బలగాలు దాడితో ఒక ఇళ్లు ధ్వంసంమైంది. అయితే అక్కడికి తాను వెళ్లినప్పటికీ ప్రజలు నాతో మాట్లాడటానికి తిరస్కరించారు. ఒక వేళ మాట్లాడితే తర్వాతి ఎలాంటి పరిణామాలు ఉంటాయోనన్న భయం వారిలో ఉన్నది” అని మరొక జర్నలిస్టు వివరించారు.

కాగా, అక్కడిపోలీసు అధికారులు, బీజేపీ నేతలు నకిలీ విలేకరుల అవతారం ఎత్తి మారి స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారనీ, అనంతరం మళ్లీ వచ్చి తమను శిక్షిస్తున్నారని బాధితులు వాపోయారు. ఇందుకు తగిన సాక్ష్యాధారాలను సైతం స్థానికులు పొందుపరిచారు. పోలీసులు, బీజేపీ నేతల చర్యలతో స్థానిక మీడియాపై ఉన్న నమ్మకం లోయలో చాలా తగ్గిపోయింది. దీంతో వార్తలు, వాస్తవాల కోసం లోయలోని ప్రజలు అంతర్జాతీయ మీడియాపై ఆధారపడుతుండటం గమనార్హం.

## మహారాష్ట్రలో 8 స్థానాల్లో సీపీఐ(ఎం) పోటీ

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎం) 8 స్థానాల్లో పోటీచేస్తున్నది. ఈ మేరకు ఆ పార్టీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర శాసనసభకు ఈ నెల 21న ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తాము పోటీ చేస్తున్న నియోజకవర్గాలు, అభ్యర్థుల పేర్లను సీపీఐ(ఎం) శనివారం అధికారికంగా ప్రకటించింది. షోలాపూర్ స్థానంలో నరసయ్య ఆదం, కల్వాన్‌లో జెపి గవిట్, పశ్చిమ నాసిన్‌లో డాక్టర్ డిఎల్ కరాడ్, ధహానులో వినోద్ నిఖోలే, సహాదాలో జైసింగ్ మాలి, పర్తూర్‌లో సరిత ఖండారే, షాహాపూర్‌లో క్రిష్ణ భవార్, పశ్చిమ అంధేరి నియోజకవర్గంలో కె.నారాయణన్ బరిలో నిలిచారు. ఎన్నికల్లో పోటీకి సంబంధించి సీపీఐ(ఎం) మహారాష్ట్ర శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీ–శివసేన కూటమి ఓటమే లక్ష్యంగా తాము ఈ ఎన్నికల్లో ముందుకు సాగుతామని తెలిపింది. దీంతో పాటు రాష్ట్రంలో వామపక్షాల బలాన్ని పెంచుకునేందుకు ప్రయత్నిస్తామని తన ప్రకటనలో పేర్కొంది. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన సీపీఐ(ఎం) 5.76 శాతం ఓట్లను సాధించింది.

## హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్



**న్యూఢిల్లీ :** హర్యానా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అశోక్ తన్వర్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తన రాజకీయ ప్రత్యర్థులు టికెట్లను అమ్ముతున్నారని ఆరోపిస్తూ పార్టీ ఎలక్షన్ కమిటీ నుంచి వైదొలిగిన రెండు రోజుల అనంతరం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కార్యకర్తలతో సుదీర్ఘ:ంగా చర్చలు జరిపిన తర్వాత, ప్రజలకు, పార్టీ సభ్యులందరికీ తెలిసిన కారణాలతో కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీకి పంపిన నాలుగు పేజీల లేఖలో కాంగ్రెస్ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, దానికి రాజకీయ ప్రత్యర్థులు కారణం కాదని, తీవ్రమైన అంతర్గత వైరుధ్యాలే కారణాలని పేర్కొంది.

# న్యాయం కావాలి




### 15న అమిత్‌షా ఇంటికి నిరసన ప్రదర్శన

- హిందూత్వ సంస్థల దాడుల బాధితుల పిలుపు
- నజీబ్ తల్లి ఫాతిమానఫీజ్, సుబోధ్‌సింగ్ భార్య రజినీసింగ్, సాహిల్‌సింగ్ తల్లి సంగీతాసింగ్

**న్యూఢిల్లీ:** హిందూత్వ సంస్థల ఉన్మాద దాడులకు గురైన బాధితుల కుటుంబసభ్యులు అక్టోబర్ 15న హోంమంత్రి అమిత్‌షా ఇంటికి ప్రదర్శనగా వెళ్లాలని నిర్ణయించారు. మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవం నుంచి దీనికి సంబంధించిన ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో జేఎన్‌యూ విద్యార్థి నజీబ్ అహ్మద్ తల్లి ఫాతిమానఫీజ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో మూకదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఇన్‌స్పెక్టర్ సుబోధ్‌సింగ్ భార్య రజినీసింగ్, నార్త్‌ఢిల్లీలోని జఫ్రాబాద్‌లో హత్యకు గురైన సాహిల్‌సింగ్(23) తల్లి సంగీతాసింగ్ పాల్గొంటారు. వీరికి సంఘీభావంగా జేఎన్‌యూ ప్రొఫెసర్ ఘజాలా జమీల్‌తోపాటు పలు పౌర సంఘాల సభ్యులు కూడా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొననున్నట్టు తెలిపారు. నజీబ్ మిస్సింగ్ జరిగి మూడేండ్లు పూర్తయిన సందర్భంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నారు.

జేఎన్‌యూలోని ఓ హాస్టల్ నుంచి నజీబ్ అహ్మద్ 2016, అక్టోబర్ 15 నుంచి కనిపించకుండా పోయిన విషయం తెలిసిందే. నజీబ్ ఆచూకీ ఇప్పటికీ తెలియకపోవడంతో ఆయన కుటుంబసభ్యులు ఆవేదన చెందుతున్నారు. నజీబ్ మిస్సింగ్‌కు ముందు జేఎన్‌యూలోని ఏబీవీపీ విద్యార్థులు ఆయనతో గొడవ పడినట్టు తోటి విద్యార్థులు చెబుతున్నారు. ఇన్‌స్పెక్టర్ సుబోధ్‌సింగ్ బులంద్‌షహర్‌లోని శ్యానా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింగ్రావతి గ్రామ సమీపాన 2018, డిసెంబర్ 2న అర్ధరాత్రి హిందూత్వ సంస్థల మూకదాడిలో హత్యకు గురయ్యారు. ఆ ప్రాంతంలో గోవధ ఆరోపణలతో హిందూత్వ సంస్థలు ఆందోళనకు దిగగా, విధి నిర్వహణలో భాగంగా అక్కడికి వెళ్లినపుడు దుండగులు ఆయనపై రాళ్లదాడి చేయగా స్పృహ కోల్పోయిన స్థితిలో ఆయన్ని హతమార్చారు. ఈ కేసులో బజరంగదళ్, వీహెచ్‌పీ, బీజేపీ నేతలు, కార్యకర్తలు నిందితులు. ఈ ఏడాది మార్చిలో నిందితులపై సిట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. మరో కేసులో.. ఈ ఏడాది ఆగస్టు 30న తన స్నేహితులతో జఫ్రాబాద్ ప్రాంతానికెళ్లిన సాహిల్‌ను ముస్లింగా భావించి స్థానిక అగ్రకుల దురహంకారులు అతన్ని హతమార్చారు.

నిరసన ప్రదర్శనపై సామాజిక కార్యకర్త నదీమ్‌ఖాన్ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ నుంచి కొందరు రానున్నట్టు ఖాన్ తెలిపారు. గౌరీలంకేశ్, తబ్రేజ్ అన్సారీ కుటుంబసభ్యులు కూడా రానున్నట్టు ఖాన్ తెలిపారు. తమ డిమాండ్లకు అంగీకరిస్తే నిరసన ప్రదర్శన ఆలోచన విరమించుకుంటామని ఆయన తెలిపారు. హోంమంత్రని మూడు డిమాండ్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. నజీబ్ అహ్మద్ కేసులో దర్యాప్తును పున:ప్రారంభించాలి, సుబోధ్‌సింగ్ కేసులో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలి, సాహిల్ కేసులోనూ నిందితుల బెయిల్ రద్దు చేసి, పారదర్శక దర్యాప్తు జరిపించాలనేవి తమ డిమాండ్లని ఆయన తెలిపారు. 'యునైటెడ్ ఎగెనెస్ట్ హేట్' ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఖాన్ ఈ వివరాలు వెల్లడించారు. తీవ్ర ఆవేదనలో ఉన్న ఫాతిమానఫీజ్ మాట్లాడలేకపోయారు. నజీబ్ మిస్సింగ్ జరిగిననాటి నుంచి సంతకాల సేకరణ చేస్తున్నామని, న్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్నదని ఖాన్ తెలిపారు. సామాజిక స్పందన కూడా కీలకమని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పోలీసుల ముందే... కౌన్సిలర్ కొడుకుపై మూకదాడి

- వ్యక్తిని చంపేశాడన్న ఆరోపణలతో బీహార్‌లో ఘటన

**పాట్నా :** బీహార్‌లో ఓ మూక చట్టాన్ని చేతులోకి తీసుకుని హత్య చేశాడని ఆరోపణలున్న కౌన్సిలర్ కొడుకును చంపేయాలని వీరంగం సృష్టించింది. పట్టపగలే పోలీసుల ముందే 'జై శ్రీరాం' అంటూ నినాదాలు చేస్తూ అతనిపై దాడికి దిగింది. కైమూర్ జిల్లాలోని బాబువా వార్డులోని శివాజీ చౌక్ ఏరియాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బాబువా వార్డు కౌన్సిలర్ కొడుకు ఓ వ్యక్తిపై కాల్పులు జరపగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే మరణించాడు. దీని అనంతరం కౌన్సిలర్ కొడుకుపై ఓ మూక దాడికి పాల్పడింది. ఘటనకు సంబంధించిన వీడియోలో కొందరు వ్యక్తులు 'జై శ్రీరాం' అంటూ విచక్షణారహితంగా బాదుతూ కనిపించారు. కాగా, ఆస్పత్రిలో చేర్చిన కౌన్సిలర్ కొడుకు ఆరోగ్యం ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. కౌన్సిలర్ కొడుకు చేతిలో దాడికి గురైనట్టు చెబుతున్న వ్యక్తి మృతి చెందాడని తెలియగానే చికిత్స పొందుతున్న నిందితుడినీ



చంపేయాలని పోలీసులను మూక డిమాండ్ చేసింది. ఆగ్రహంతో ఊగిపోయిన ఆ మూక ఎమర్జెన్సీ గేట్‌ను ధ్వంసం చేసింది. ఆస్పత్రి కిటికీల వైపు రాళ్లు విసిరింది. ఆస్పత్రి ఎదుట వీరంగం సృష్టించింది. అక్కడి దుకాణాలను ధ్వంసం చేసింది. దుకాణాల దగ్గరున్నవారిపై, పాదాచారులపైనా దాడికి దిగింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కైమూర్ ఎస్పీ హెచ్చరించినా.. ఆ మూక చెవికెక్కించుకోలేదు. చివరికి పోలీసులు లాఠీచార్జ్ చేయాల్సి వచ్చింది.

## ఆరే కాలనీ వృక్షాల నరికివేత

- అడ్డుకున్న 29మంది కార్యకర్తల అరెస్టు
- ముంబయిలో 144 సెక్షన్

**ముంబయి :** మహారాష్ట్రలో ముంబయిలోని ఆరే కాలనీలో మెట్రో ప్రాజెక్టు కోసం చెట్లను నరికివేయవద్దని కార్యకర్తలు చేపట్టిన ఆందోళన శనివారం తీవ్రమైంది. వృక్షాలను నరకడాన్ని సవాలు చేస్తూ దాఖలైన నాలుగు పిటిషన్లను బాంబే హైకోర్టు శుక్రవారం కొట్టేయడంతో గంటల వ్యవధిలోనే చెట్లను నేలమట్టం చేసే కార్యక్రమం మొదలైంది. దీన్ని అడ్డుకునేందుకు కార్యకర్తలు వందల సంఖ్యలో కదిలివచ్చారు. శనివారం దాదాపు 29 మంది కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ 29మందిని జుడిషియల్ కస్టడీలోకి తీసుకోగా.. ఇంకొందరు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ముంబయి మెట్రోకు సంబంధించి ఆరే కాలనీలో కారు పార్కింగ్ కోసం షెడ్ నిర్మించాలని సర్కారు భావించింది. ఈ షెడ్ కోసం 2,646 చెట్లను నేలమట్టం చేయాల్సి ఉంటుంది. దీన్ని వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన పిటిషన్లను బాంబే హైకోర్టు తోసిపుచ్చుతూ వృక్షాలను నేలమట్టం చేసేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబయి(ఎంసీజీఎం)కి అనుమతినిచ్చింది. దీంతో



పోలీసులు ఆ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు. దీంతో శుక్రవారం సాయంత్రమే చాలా మంది కార్యకర్తలు అక్కడికి చేరినా.. దూరంగానే నిలబడిపోయారు. రాత్రికి రాత్రే బుల్‌డోజర్లు చేరాయి. శుక్రవారం రాత్రి వృక్షాల నరికివేత ప్రారంభించారు. దసరా పండుగ సందర్భంగా కోర్టులకు సెలవు కావడంతో ఈ తీర్పును సవాలు చేసే అవకాశం లేకుండా పోయిందనీ, కోర్టు పున:ప్రారంభమయ్యే వరకు అన్ని చెట్లను నరికేస్తారని చెప్పారు. రాత్రికి రాత్రే నరికివేత మొదలుపెట్టేంత తొందరేమిటని ప్రశ్నించారు. ఓ వైపు సర్కారే మొక్కలు నాటాలని చెబుతూ మరోవైపు నరికేయడం శోచనీయమని అన్నారు.

# పడకేసిన వైద్యం

నిటి ఆయోగ్ రూపొందించిన 'హెల్త్ ఇండెక్స్' (ఆరోగ్య సూచిక)లో కేరళ, మరో మూడు రాష్ట్రాలు తప్ప మిగతావేవీ మెరుగైన ప్రదర్శన చూపలేకపోయాయి. ఆయా రాష్ట్రాల మధ్య స్కోరింగ్‌లోనూ చాలా తేడా కనపడుతోంది. కేవలం ఏడు రాష్ట్రాలు మాత్రమే ఆరోగ్య సేవల వృద్ధి సాధించినట్టు నివేదిక తెలిపింది. ఇలా ఎందుకు ఉందని పరిశీలించిన ఆరోగ్యరంగ నిపుణులకు కనపడిన ప్రధాన కారణం..'జాతీయ ఆరోగ్య మిషన్' నిధులు సమయానికి అందకపోవటం. నిధుల విడుదలలో కేంద్రం అనుసరిస్తున్న అత్యంత సంక్లిష్టమైన పద్ధతి. 1000మంది అధికారులు ఓకే చెబితేగానీ ఆ నిధులు రాష్ట్రాలకు చేరటం లేదని నిపుణులు చెబుతున్నారు.

### కేంద్ర నిధుల కోసం అష్టకష్టాలు

- రాష్ట్రాల్లో దెబ్బతింటున్న ప్రభుత్వ వైద్యసేవలు
- ఆరోగ్యసూచికలో మెరుగుపడని ఆయా రాష్ట్రాల ర్యాంకులు
- సమయానికి రాని 'జాతీయ ఆరోగ్య మిషన్' నిధులు
- నిటి ఆయోగ్ నివేదికపై ఆరోగ్యరంగ నిపుణులు

**న్యూఢిల్లీ :** నిటి ఆయోగ్ విడుదలచేసిన 'హెల్త్ స్టేట్స్, ప్రోగ్రెస్సివ్ ఇండియా' నివేదికలో రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ర్యాంకుల్ని విడుదలచేసింది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆరోగ్య సేవల పరిస్థితిని తెలియజేసే గణాంకాల్ని, గ్రాఫుల్ని ఇందులో పొందుపర్చారు. వివిధ విభాగాల్లో చూపిన ప్రదర్శన ఆధారంగా ఇచ్చిన ర్యాంకింగ్స్‌లో కేరళ (74.01) టాప్–1లో నిలబడింది. ఆఖరుస్థానంలో ఉత్తరప్రదేశ్ (28.61) ఉంది. నిటి ఆయోగ్ నివేదికను అధ్యయనం చేసిన ఆరోగ్యరంగ నిపుణులు ఏమన్నారంటే, ఆరోగ్య సేవల విషయంలో రాష్ట్రాల మధ్య ఎంతో తేడా కనపడిందనీ, రాష్ట్రాలకు 'జాతీయ ఆరోగ్య మిషన్' నిధులు సకాలంలో అందకపోవటం పెద్ద ప్రభావం చూపిందనీ చెప్పారు.



మనదేశంలో ప్రస్తుతం ప్రభుత్వ వైద్య సేవలు ఏ రాష్ట్రంలో మెరుగ్గా ఉన్నాయని ప్రశ్నిస్తే, వెంటనే వచ్చే సమాధానం 'కేరళ'. ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ (65.13), మహారాష్ట్ర (63.99), గుజరాత్ (63.52), పంజాబ్ (63.01) ఉన్నప్పటికీ, వివిధ విభాగాల్లో కేరళ చూపిన ప్రదర్శనకు ఈ రాష్ట్రాలకు చాలా తేడా కనపడుతోంది. పెద్ద ఎత్తున జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్ (32.11), ఒడిషా (35.97), మధ్యప్రదేశ్ (38.39), ఉత్తరాఖండ్(40.20) రాష్ట్రాల్లో నెలకొన్న వైద్య సేవలు కనీస స్థాయిలో కూడా లేవన్నది నివేదిక సారాంశం. అగ్రస్థానంలో ఉన్న కేరళకు, ఆ తర్వాత ఉన్న రాష్ట్రాలకు, చివరి వరుసలో ఉన్న రాష్ట్రాలకు మధ్య తేడా చాలా ఎక్కువగా ఉందని ఆరోగ్యరంగ నిపుణులు చెబుతున్నారు. ఇలా ఉండటానికి గల కారణాల్ని అన్వేషించి కేంద్రం సరిదిద్దితేనే మంచి ఫలితాలు వస్తాయని వారు గుర్తుచేస్తున్నారు.

**సమస్యంతా జాతీయ ఆరోగ్య మిషన్ నిధులతోనే**

- వివిధ రాష్ట్రాల ర్యాంకుల మధ్య తేడా, వైద్య సేవల వృద్ధి సాధించకపోవటానికి ప్రధాన కారణంగా 'జాతీయ ఆరోగ్య మిషన్' (ఎన్‌హెచ్‌ఎం)లో ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- కేంద్రం విడుదల చేసే ఎన్‌హెచ్‌ఎం నిధులు రాష్ట్రాలకు సకాలంలో అందటం లేదు. దీంతో ఆరోగ్య సేవలకు సంబంధించి మౌలిక వసతుల కల్పన ఎక్కడవేసిన గొంగళి మాదిరి అక్కడే ఉంది.
- నర్సులు, డాక్టర్లు, ఏఎన్‌ఎం వర్కర్లు, స్పెషలిస్టు వైద్యుల నియామకం జరగాలంటే, ఇతర సౌకర్యాలు ఏర్పడాలంటే 'ఎన్‌హెచ్‌ఎం' నిధులే దిక్కు.
- బీహార్‌లో హెల్త్ ఏజెన్సీలకు 'ఎన్‌హెచ్‌ఎం' నిధులు 191 రోజులు, జార్ఖండ్‌కు 187 రోజులు ఆలస్యంగా చేరాయి. ఒడిశా, మధ్యప్రదేశ్, తమిళనాడు, త్రిపుర, మేఘాలయ, మిజోరాం రాష్ట్రాలు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.
- గతంతో పోల్చితే ఏ రాష్ట్రాల్లో వైద్య సేవలు మెరుగుపడ్డాయి? అన్నదాన్ని కూడా నివేదికలో ప్రత్యేకంగా తెలిపారు. 'ఇంక్రిమెంటల్ ప్రొగ్రెస్'(వైద్య సేవల వృద్ధి) ఛార్ట్‌లో స్థానాన్ని మెరుగుపర్చుకున్నవి కొన్ని రాష్ట్రాలే.
- 'ఇంక్రిమెంట్ ప్రోగెస్'లో జీరోస్థాయిని దాటి మైనస్‌లోకి వెళ్లిపోయిన రాష్ట్రాలు ఎక్కువగా ఉన్నాయి.
- వైద్య సేవల వృద్ధి సూచికలో బీహార్‌కు మైనస్ మార్కులు పడ్డాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా మధ్యస్థాయి (2 నుంచి 4 పాయింట్ల మధ్య) ప్రదర్శన నమోదుచేశాయి.
- అన్ని విభాగాల్లో వృద్ధి ప్రదర్శించిన రాష్ట్రాలు ఏడు. సూచికలో ఇచ్చినదాని ప్రకారం హర్యానా హెల్త్ స్కోర్ చాలా మెరుగుపడింది.

సంపాదకీయం

# కర్తవ్యం

కూడు, గుడ్డ, గూడులకు మించి ఆశించడం మనో వైకల్యం అంటారు ప్రముఖ తత్వవేత్త యు.జి.కృష్ణమూర్తి. కానీ ఇవిగాక మించి బజార్లో దొరికే సకల వస్తు సముదాయాన్ని సమకూర్చుకోడమే బతుకు పరమార్ధమన్నట్టుగా మార్కెట్ చెబుతున్నది. అభివృద్ధి విధానాలకీ, నిజ అవసరాలకీ నడుమ అంతరం పెరుగుతున్నది. మౌలిక అవసరాలయిన కూడు, గుడ్డ, గూడుల్ని సమకూర్చడంలో వ్యవస్థలు విఫలమయ్యాయి. మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి, ధనిక వర్గాల సౌకర్యాల, విలాసాల కోసమే అభివృద్ధి మంత్రజపం ఎల్లెడలా వినిపిస్తున్నది. రెక్కల కష్టమ్మీద బతికే కోట్లమందికి కనీసావసరాలు కల్పించే దృష్టి ప్రభుత్వాలకు, ఆర్థికవ్యవస్థలకు లేదు. అందువల్లనే కార్ల అమ్మకాలు పడిపోయాయని, విల్లాలు కొనేవారు కరువయ్యారని పత్రికలు వాపోతున్నాయి. ఉల్లిగడ్డలు, టమాటాలు కూడా కొనలేని దుస్థితిలోకి నెట్టబడిన జనాల ఆకలిబాధలు వాటికి పట్టడం లేదు. చాలీచాలని వేతనాలతో బతుకులు ఈడ్వలేక సమ్మె కట్టిన కూలీల, కార్మికుల ఆందోళనలు కాస్త సౌకర్యంగా బతికేవారికి చికాకు తెప్పిస్తున్నాయి.

**కూడు, గుడ్డ, గూడుకు మించి ఆశించడం సరి కాదన్నారు. ఈ కనీసావరాల్ని కల్పించలేని వ్యవస్థ మీద విశ్వాసం కోల్పోతే ఏం జరుగుతుందో, జనం ఏం చేస్తారో చరిత్ర చెబుతున్నదే. ఆ చరిత్ర నుంచి నేర్చుకుంటూ పోరాడే ప్రజలపక్షాన నిలవడం ఆలోచనాపరుల కర్తవ్యం.**

పండగనాడయినా మూడుపూటలా తినే అవకాశం లేనివారు అనేకులు. అయినప్పటికీ కొత్త వాహనాలు, మొబైల్స్, టీవీలు, ఫ్రిజ్‌లు, ఫర్నిచర్, ఖరీదయిన నగలతో పండగ చేసుకోండంటూ మార్కెట్ మాయావలలు విసరుతున్నది. అప్పు చేసయినా మొబైల్ కొనమంటూ ఊరిస్తున్నది. పుస్తకాలు లేని ఇల్లు దయ్యాల కొంప వంటిదన్నాడు తత్వవేత్త సిసిరో. ఇవాళ టీవీ లేని ఇల్లు చీకటి గుయ్యారమని చెబుతోంది ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్. ఇంటినే హోమ్ థియేటర్ చేసుకోమంటూ రకరకాల టీవీల ప్రకటనలతో హోరెత్తిస్తున్నది. పెరిగిన ఉల్లిగడ్డ ధరతో ఉలిక్కిపడే జనాలున్న దేశంలోనే విలాసవస్తువుల్ని అమ్మి డబ్బు చేసుకోవాలనే మార్కెట్ తంత్రానికి దసరా, దీపావళిలు కలసి వచ్చాయి. మార్కెట్‌లో ఏదో ఒకటి కొనకపోతే పండగ లేనట్టు బెంగటిల్లే స్థితిలోకి జనాల్ని నెట్టివేసే మహామేయ కుట్రలో మనుషులు వినియోగ దారులుగా మిగిలారు.



ఒకవైపున ప్రగతి విలాసంలో పూలసజ్జల సందడి, మరోవైపున రెండేండ్లుగా ఉద్యోగాల కోసం అల్లాడే వారి ఆర్తనాదాల నడుమ బతుకమ్మ బిక్కటిల్లింది. ఇరవయ్యేండ్లు చదివి, పరీక్షలు రాసి పాసయినా ఉద్యోగం రాక తండ్లాడే వారికి పండగ ఉత్సాహం ఉంటుందా? కనీసం కొత్త గుడ్డలు తొడుక్కొని దసరానాడు జమ్మికోసం, పాలపిట్టను చూడటం కోసం వెళ్ళే మనసు వస్తుందా? ఆడంబరాలు అక్కర్లేదు. ధన, కనక, వస్తు సముదాయం అక్కర్లేదు. రేపోమాపో ఉద్యోగం వస్తుందన్న భరోసా కావాలి. ఆత్మగౌరవంతో జీవించడానికి అనువైన ఉపాధి కల్పించే వ్యవస్థ ఉందన్న ఆశ, విశ్వాసం ఉండాలి. ఈ రెండూ మృగ్యమైన నేపథ్యంలో నేతల దేశభక్తి ప్రబోధాలు, యుద్ధోన్మాదపు వీరావేశాల ప్రగల్భాలు ఒరగబెట్టేదేమిటి? ఈ ప్రశ్నలు సంధించాల్సిన మీడియా పాలకులకు మునుపెన్నడూ లేనంతగా ఒంగిపోయి లొంగిపోయింది. ఇక ప్రశ్నించినవారిని దేశద్రోహులంటూ ముద్ర వేస్తున్నది.

ప్రపంచం తమవైపు చూస్తుందంటూ ప్రభుత్వాధినేతల ప్రచారం పరమ హేయం. నిజమే, దేశదేశాలు భారత్‌వైపు చూస్తున్నాయి. ఒక రాష్ట్రాన్ని జైలుగా మార్చిన ఉదంతాన్ని విస్తుపోయి చూస్తున్నది. ఒక మతానికి చెందినవారని మనుషుల్ని కొట్టిచెప్పే మూకల అమానుష దురాగతాన్ని తిలకిస్తూనే ఉంది. తమ మీద అత్యాచారం జరిగిందన్న మహిళల్ని జైలులో పెట్టి, నిందితుల్ని విడుదల చేసే పాలకుల తీరును ముక్కున వేలేసుకొని చూస్తున్నది. లక్షలాది మంది ప్రజల్ని మీరు ఈ దేశస్థులే కాదంటూ ముద్రవేసిన ప్రభుత్వాల జూదక్రీడని ప్రపంచం కళ్ళు విప్పార్చుకొని గమనిస్తూనే ఉంది.

అయినప్పటికీ మన దేశం గొప్పతనాన్ని ఘనంగా చాటుదాం. ఇదివరలో ఎప్పుడూ లేనంతగా నిరుద్యోగిత రేటు పెరిగినందుకు గర్వపడదాం. అంతేకాదు, ప్రపంచంలో ఇతర దేశాలకు వలసపోతున్నవారిలో అత్యధికులు భారతీయులేనని ఐక్యరాజ్యసమితి తేల్చి చెప్పింది. ఇదీ మన పాలకుల ఘనతేనని మురిసిపోదాం. బతుకు లేక బతకడం కోసం వలసపోక తప్పనిస్థితిలోకి జనాల్ని నెట్టివేసినవారే జాతీయత, దేశభక్తి గురించి మాట్లాడటం విషాద పరిహాసం.

ముందు మనుషులు ఆకలితో చావకుండా బతకాలి. ఆ తర్వాతే దేశం, దేశభక్తి, జాతీయత గురించి ఆలోచిస్తారు. కానీ ఈ దేశంలో ఇరవైశాతం మందికి పైగా తీవ్రదారిద్ర్యంతో అల్లాడుతున్నారు. దాదాపు రెండు కోట్ల మంది ఆకలికేకలు పెడుతున్నారు. అయినప్పటికీ "మన తల్లి అన్నపూర్ణ మన అన్న దానకర్ణ మన భూమి వేదభూమిరా..." అని పాడుకోవాల్సిన దుస్థితి కాదనలేని వాస్తవం. ఈ నిజాలు ఇలా ఉండగా ప్రీమియం స్కైవిల్లాలు, బంగారు ఆభరణాలు, బట్టల ధగధగలు, అద్భుతమైన ఆఫర్లు, మెగా సంబరాలు అంటూ అన్నిరకాల మాధ్యమాల్లో వెల్లువెత్తే ప్రకటనల పరంపర విస్మయకరం.

సామాన్యులు బతకడానికి భరోసా ఇవ్వలేని వ్యవస్థలోనే కొందరు అత్యంత ఆడంబరంగా గడిపేందుకు విలాసాల్ని సమకూర్చడం విదూషకత్వం. ఈ పూర్వరంగంలోనే– కొందరు ఆడంబరంగా గడపటానికి ఇతరుల్ని నిరాడంబరంగా ఉండాలంటూ హితబోధలు చేస్తారంటూ యు.జి.కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. కూడు, గుడ్డ, గూడుకు మించి ఆశించడం సరి కాదన్నారు. ఈ కనీసావరాల్ని కల్పించలేని వ్యవస్థ మీద విశ్వాసం కోల్పోతే ఏం జరుగుతుందో, జనం ఏం చేస్తారో చరిత్ర చెబుతున్నదే. ఆ చరిత్ర నుంచి నేర్చుకుంటూ పోరాడే ప్రజలపక్షాన నిలవడం ఆలోచనాపరుల కర్తవ్యం.

# హిందూత్వశక్తులకు గిట్టని గాంధీజీ విలువలు



ప్రకాష్ కరత్

గాంధీజీ బతికుంటే గోహంతకుల మిషతో సాగుతున్న మూక హత్యలకు వ్యతిరేకంగా ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుని ఉండేవారు. ఒక్క మనిషికి వ్యతిరేకంగా హింసకు పాల్పడటం కూడా ఆయన సహించేవాడు కాదు. మహాత్ముడి 150 జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ తరుణంలో దేశ విదేశాల్లో కోట్లాదిమందికి ఆయన మహాత్ముడు ఎందుకయ్యాడో తెలుసుకోవటం అవసరం.

20వ శతాబ్దిలో ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన చారిత్రక పురుషుల్లో గాంధీ ఒకరు. భారత స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన పోరాటం ప్రపంచంలోనే అత్యంత విశాల జనబాహుళ్యాన్ని ఉద్యమ పథంలోకి తెచ్చింది. ఇఎంఎస్ నంబూద్రిపాద్ అభిప్రాయపడినట్టు గాంధీజీ సామాజికంగా మితవాద దృక్పథం కలిగిన వాడు. కానీ ఆయన ఉపయోగించే భాష జనసామాన్య భాష కావటంతో ప్రజల భాషలో మాట్లాడి విశాల రైతాంగాన్ని ఉద్యమంలోకి నడిపించగలిగాడు. మధ్యతరగతి స్వభావంతో ఉన్న కాంగ్రెస్‌ను జనసామాన్యపు పార్టీగా మలిచే ప్రక్రియ గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగి వచ్చాకనే మొదలైంది.

**గాంధీ ఆలోచనా విధానాన్ని ఆరెస్సెస్ నెత్తికెత్తుకోవటం అంటే గాంధీలో ఉన్న లౌకిక దృక్పథాన్ని పూర్తిగా మసకబార్చి ఆయన ధార్మిక భావాలను ముందుకు తెచ్చి హిందూత్వ నాయకుల సరసన నిలబెట్టే ప్రయత్నం తప్ప మరోటి కాదు. గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్న శక్తులు, గాంధీని ముస్లిం పక్షపాతిగా చూపించి ఆయన పట్ల శత్రుభావం పెంచుకున్న శక్తులు కూడా ఇవే.**

ఈ ప్రయత్నంలోనే గాంధీజీ తనవైన విలక్షణ ఆలోచనలను, దృక్పథాన్ని, నిరసనోద్యమంలో వినూత్న నైపుణ్యాలను జాతీయోద్యమంలోకి జొప్పించాడు. ఆయన దక్షిణాఫ్రికాలో ప్రారంభించిన సత్యాగ్రహం, అహింసా యుతమైన శాసనోల్లంఘనం విలక్షణ ప్రతిఘటనోద్యమంగా, జాతీయోద్యమంగా గుర్తింపు పొందింది.

భవిష్య స్వతంత్ర భారతం గురించి గాంధీజీకి లౌకిక దృక్పథాన్ని కలిగి ఉన్నాడు. స్వాతంత్ర్య పోరాటానికి హిందూ ముస్లిం ఐక్యతే ఇరుసు అని భావించాడు. 'హిందూస్థాన్ అనే అందమైన పెళ్లికూతురికి హిందువులు, ముస్లింలు రెండు కండ్లు" అన్న అభిప్రాయం కలిగినవాడు గాంధీజీ. ఈ అవగాహనతోనే 1920లో ఖిలాఫత్ ఉద్యమాన్ని ప్రారంభించాడు. ఈ ఖిలాఫత్ ఉద్యమం కూడా సహాయ నిరాకరణోద్యమంలో అంతర్భాగమే. కాలం గడిచిన ధార్మిక విషయాల ప్రాతిపదికన ఐక్యత సాధించాలన్న ఈ ప్రయత్నానికి గల పరిమితులు అనతి కాలంలోనే స్పష్టమయ్యాయి. ఏది ఏమైనప్పటికీ హిందూ ముస్లిం ఐక్యత, దాని ఆవశ్యకత గురించి గాంధీ వైఖరిని స్పష్టం చేయటానికి ఉపయోగపడ్డాయి.

అన్ని మతాలను సమానంగా చూడాలన్నది గాంధీజీ నికరంగా అనుసరిస్తూ వచ్చిన వైఖరి. అదేవిధంగా అన్ని కులాలను సమానంగా చూడాలన్నది కూడా ఆయన విధానంగా ఉంది. భారతదేశంలో లౌకిక రాజ్యస్థాపన అవసరాన్ని ఆయన పదేపదే ప్రస్తావించాడు. గుజరాత్‌లో సోమనాథ్ దేవాలయాన్ని పునరుద్ధరించటానికి ప్రభుత్వ నిధులు వెచ్చించాలన్న ఆలోచనను ఆయన వ్యతిరేకించాడు.

భారతదేశపు సామాజిక సంక్లిష్టతను, విశాలమైన వైవిధ్యాన్ని అర్థం చేసుకున్న అతి కొద్దిమందిలో గాంధీజీ ఒకరు. భాషా ప్రయుక్త ప్రాంతాల ప్రాతిపదికన కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు చేయాలని తొలిసారి ప్రతిపాదించింది కూడా గాంధీజీయే. తదనుగుణంగా 1920లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ వార్షిక సమావేశాల్లోనే భాషా ప్రాతిపదికన వేర్వేరు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేశారు. చంపారన్‌లో రైతాంగ పోరాటం, వైకోంలో దేవాలయ ప్రవేశం, దండి ఉప్పు సత్యాగ్రహం, లక్నోలో ప్రారంభించిన శాసనోల్లంఘనోద్యమం వంటి అనేక ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న గాంధీజీ దేశవ్యాప్తంగా పర్యటించాడు. అఖిలభారత స్థాయి గుర్తింపు పొందిన తొలి నాయకుడుగా గాంధీని చెప్పుకోవచ్చు.

1930 తర్వాత కమ్యూనిస్టు పార్టీగా ఏర్పడిన నాటి కాంగ్రెస్‌లోనే అంతర్భాగంగా పని చేసిన వామపక్ష శక్తులు కొన్ని విషయాల్లో గాంధీయిజాన్ని విమర్శించారు. గాంధీ అనుసరించిన ప్రజాఉద్యమం దాని పరిధి దాటి జనబాహుళ్యపు విప్లవోద్యమంగా మారకుండా నియంత్రిస్తూ వచ్చాడు. అదే సమయంలో రైతాంగ సమస్యలపై పోరాడినప్పటికీ ఆయన భూస్వామ్య విధానానికేమీ వ్యతిరేకం కాదు. జీవితాంతం ఆయన అంటరానితనంపై పోరాడినప్పటికీ వర్ణాశ్రమ ధర్మాలను ఆయన అంగీకరించాడు. ఈ ధోరణులన్నింటి కారణంగా వామపక్షం గాంధీయిజాన్ని విమర్శించింది. అదే సమయంలో వామపక్షం జాతీయోద్యమంలో ఆయన అద్వితీయ కృషిని, నాయకత్వపాత్రను కూడా గుర్తించింది. ఆయన ఆదర్శాలూ దేశభక్తి, ధైర్యాన్ని కొనియాడింది.

ఈ ధైర్య సాహసాలు గాంధీ జీవిత చరమాంకంలో మరింత కొట్టొచ్చినట్టు వ్యక్తమయ్యాయి. 1946లో స్వాతంత్ర్య సాధన సూచనలు దగ్గరపడినప్పటి నుంచీ గాంధీ ఒంటరిపాటయ్యాడు. నిరాశా నిస్పృహలకు లోనయ్యాడు.

దేశంలో అనేక ప్రాంతాల్లో మతోన్మాద ఘర్షణలు ప్రజ్వరిల్లినప్పుడు, ప్రత్యేకించి ఉత్తర భారతదేశం మతోన్మాద మంటల్లో ఆహుతవుతున్నప్పుడు బీటలు వారుతున్న హిందూ ముస్లిం ఐక్యత చూస్తూ దేశ విభజనను ఈసడించుకున్నాడు.

స్వాతంత్ర్యోద్యమ దినోత్సవ సంబరాల్లో పాల్గొనటానికి గాంధీ నిరాకరించాడు. ఆ సంబరాల్లో పాల్గొనటానికి బదులు గాంధీ కలకత్తాలో పేట్రేగిన మతోన్మాద జ్వాలలను చల్లార్చే పనిలో నిమగ్నమయ్యాడు. ఆగస్టు 14 రాత్రి ఆయన బెలిఘాటలోని హైదరి మంజిల్ అనే పేరున్న ఓ ముస్లిం నివాసంలో గడిపాడు. అప్పట్లో బెలిఘాటలో ఎక్కువమంది హిందువులు నివసించేవారు. ముస్లింలపై దాడికి దిగుతున్న హిందూ యువకులను నివారిస్తూ ఆ రాత్రి గడిపాడు.

దానికి మూడు నెలల ముందు నౌఖాలి వెళ్లాడు. ప్రస్తుతం ఈ ప్రాంతం నాటి తూర్పుపాకిస్థాన్ నేటి బంగ్లాదేశ్‌లో ఉంది. ఈ ప్రాంతంలో సంఖ్యాబలం ఉన్న ముస్లింలు అల్పసంఖ్యాకులుగా ఉన్న హిందువులపై జరుపుతున్న దాడులను ఖండిస్తూ నిరాహారదీక్ష చేపట్టాడు. మత సామరస్యం కోసం గ్రామ గ్రామాన పర్యటించాడు. ఆ ప్రాంతంలోని ముస్లిం ప్రజలు ఆయన్ను కూడా ఓ హిందూ నాయకుడిగా చూడటంతో స్థానిక ముస్లిం మతోన్మాదులు గాంధీపై దాడి చేశారు.

నౌఖాలి నుండి ఢిల్లీ చేరిన గాంధీ రాజధాని నగరంలో జరుగుతున్న మత కల్లోలాలు ముస్లింలపై సాగుతున్న హత్యాకాండ చూసి చలించిపోయాడు. దేశంలో మత సామరస్యం కాపాడాలి, భారతదేశం కొత్తగా ఏర్పడ్డ పాకిస్థాన్‌కు 55 కోట్ల స్టెర్లింగ్ నిధి ఇవ్వాలన్న డిమాండ్లతో




1948 జనవరి 12న ఆయన బిర్లా హౌస్‌లో నిరాహారదీక్ష చేపట్టాడు. నాటికి కాశ్మీర్‌లో పాకిస్థాన్ చొరబాటును కారణంగా చూపించి ఈ నిధి విడుదలను కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఆయన నిరాహారదీక్షకు స్పందించిన హిందూ ముస్లింలు మతోన్మాద కలహాలను నిలిపివేస్తామని స్వచ్ఛందంగా హామీ ఇచ్చారు. తర్వాత భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు 55 కోట్ల స్టెర్లింగ్‌లను విడుదల చేసింది.

గాంధీ అనుసరించిన ఈ 'ముస్లిం అనుకూల, పాకిస్థాన్ అనుకూల' వైఖరి కారణంగా ఆయన్ను హతమార్చాలని గాడ్సే మరికొందరు హిందూత్వ కార్యకర్తలు కుట్ర పన్నారు. ఈ పథకానికి అనుగుణంగానే గాంధీ హత్యగావించబడ్డాడు. ఈ దశలోనే గాంధీజీ జీవితంలోని హుందాతనం, ఔన్నత్యం, దుఃఖ:దాయకత ముప్పిరిగొన్నాయి. ఆయన దైనందిన జీవితంలో ఎదుర్కొన్న అన్ని వైరుధ్యాలను అధిగమించి గొప్ప నైతికత కలిగిన నేతగా ఎదిగాడు.

నేడు ఈ గొప్ప నేతను స్మరించుకుంటూ 150వ జయంతి జరుపుకుంటున్న ఈ సమయంలో గాంధీని హతమార్చిన సిద్ధాంతం– హిందూత్వ, దాని అనుయాయులు గాంధీ వారసత్వాన్ని కబ్జా చేయటానికి సిద్ధమవుతున్నారు.

గాంధీ జీవితాంతం కట్టుబడి ఉన్న లౌకికత ప్రజాతంత్ర విలువల వలువలూడ్చి నేడు బీజేపీ ఆరెస్సెస్‌లు ఆయన్ను నిలబెట్టాయి. తమ హిందూత్వ నేతల సరసన గాంధీజీకి కుర్చీ వేసినప్పటికీ వారి ఆలోచనల్లో ఆయన నమ్మిన విలువల పట్ల ఉన్న ద్వేషాన్ని ఈ శక్తులు ఏనాడూ దాచుకోలేదు.

వినాయక దామోదర సావర్కార్ ప్రతిపాదించిన హిందూత్వ సిద్ధాంతాన్నే ఆరెస్సెస్ పాటిస్తోంది. గాంధీ హత్యకు కుట్ర పన్నిన వారిలో సావర్కార్ ఒకడు. కానీ సాంకేతిక కారణాల రీత్యా దిగువ న్యాయస్థానం ఆయన్ను నిర్దోషిగా ప్రకటించింది. సావర్కార్ పాత్రను నిర్ధారించే సరైన సాక్ష్యం న్యాయస్థానం ముందుకు రాకపోవటమే దీనికి కారణం.

వివిధ సందర్భాల్లో గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సే పట్ల ఆరెస్సెస్, ఇతర హిందూత్వ నాయకులు తమ వైఖరిని స్పష్టంగానే ప్రకటిస్తూ వచ్చారు. గడచిన పదేండ్లల్లో ముగ్గురు ముఖ్యమైన బీజేపీ నేతలు గాడ్సేను పొగుడుతూ, గాంధీ హత్యను సమర్థిస్తూ ప్రకటనలిచ్చారు. అటువంటి కోవకు చెందిన ప్రకటనల్లో ఒకటి 2019 మేలో వచ్చింది. భోపాల్ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రగ్యా ఠాకూర్ గాడ్సేను దేశభక్తుడని కొనియాడింది. మాజీ కేంద్ర మంత్రి ఆనంద్ కుమార్ హెగ్డే గాడ్సే చర్యలను సమర్థిస్తూ సామాజిక మాధ్యమం ట్విటర్‌లో ప్రకటనలిచ్చాడు. దక్షిణ కన్నడ లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన నళినీ కుమార్ కటీల్ "గాడ్సే ఒక్కడినే చంపాడు. కసబ్ 74మందిని చంపాడు. రాజీవ్‌గాంధీ 17000 మందిని చంపాడు. వీళ్లల్లో ఎవరు క్రూరులో మీరే అంచనా వేసుకోండి" అంటూ ట్విటర్‌లో ప్రకటించాడు.

ఎన్నికల సమయంలో ఇటువంటి ప్రకటనల పట్ల కలవరం చెందిన బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఈ వ్యాఖ్యలకు, బీజేపీకి సంబంధం లేదని ప్రకటించాల్సి వచ్చింది. అంతేకాదు. "ఈ ప్రకటనలను బీజేపీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ ప్రకటనలను పరిశీలన నిమిత్తం క్రమశిక్షణా సంఘానికి పంపింది" అని కూడా చెప్పాడు. కానీ ఆ ప్రకటనలు చేసిన వారిపై ఎటువంటి చర్యా తీసుకోలేదు. కర్నాటక బీజేపీ అధ్యక్షుడిగా నళినీ కుమార్ కటీల్‌ను ఎంపిక చేయటం బీజేపీ నాయకత్వపు వంచనకు నిదర్శనం.

గాంధీ ఆలోచనా విధానాన్ని ఆరెస్సెస్ నెత్తికెత్తుకోవటం అంటే గాంధీలో ఉన్న లౌకిక దృక్పథాన్ని పూర్తిగా మసకబార్చి ఆయన ధార్మిక భావాలను ముందుకు తెచ్చి హిందూత్వ నాయకుల సరసన నిలబెట్టే ప్రయత్నం తప్ప మరోటి కాదు. గాంధీ నాయకత్వంలో సాగిన స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉన్న శక్తులు, గాంధీని ముస్లిం పక్షపాతిగా చూపించి ఆయన పట్ల శత్రుభావం పెంచుకున్న శక్తులు కూడా ఇవే.

గాంధీని ఒక్కడినే కాదు. వీరోచిత స్వాతంత్ర్య పోరాట వారసత్వాన్ని, ఈ పోరాటానికి ప్రాతినిధ్యం వహించిన విలువలను కూడా పరిరక్షించి ముందుకు తీసుకెళ్లాల్సిన తరుణం ఇది. బీజేపీ–ఆరెస్సెస్ సిద్ధాంతాలను రాజకీయాలను తుదికంటా వ్యతిరేకించి పోరాడటం ద్వారానే ఇది సాధ్యం.

**అనువాదం : కొండూరి వీరయ్య**
**సెల్: 9871794037**

# నడ్సేతందుకు గిది సర్కార్ గాదు



తెలిదేవర భానుమూర్తి

నారదుడు తంబూర దీస్కుండు. ఒకపారి టింగ్ టింగ్ మన్నడు. చిర్తలు దీస్కుండు. గవ్విటిని కొట్టి జూస్కుండు. గీపారి యాడ్కి బోవాలె. యాడ్కిబోతె బాగుంటదని జెరసేపు సోంచాయించిండు. యాడికో ఎందుకు ఎప్పటి తీర్గనే యాద్గిరి గుట్టకు బోతె బాగుంటదని అనుకున్నడు. చిర్తలు గొట్టుకుంట, నారాయన నారాయన అను కుంట గాయిన మొగులు మీదికెల్లి ఎల్లిండు.

నారదుడు యాద్గిరి గుట్ట దిక్కు రాబట్టిండు. నడ్మల నర్కందిక్కు బోతున్న యముని దున్నపోతు గాయినకు ఎదురొచ్చింది.

"యాడికి బోతున్నవు నారదా?" అని అడిగింది.

"యాద్గిరి గుట్టకు బోతున్న" అని నారదుడు అన్నడు.

"ఎందుకు బోతున్నవు"

"నర్సిమ్మసామితోని ముచ్చట బెట్టెతందుకు. గాయినతోని ముచ్చటబెడ్తె గీ దేసంల ఏమైతున్నదో ఎర్కైతది"

"గీయింత దాన్కి గాయిన తాన్కి బోవుడెందుకు. గీ దేసంల ఏమైతున్నదో నేనుజెప్త గద"

"గట్లయితె జెప్పు"

"గీ నడ్మ గాందీజీ 150వ జయంతిని జేసింద్రు. ప్రతాని మోదీ రాజ్‌గాట్కు బోయిండు. గాంది సమాది మీద పూలుంచిండు. అందరికి తలా ఒక గిలాస మేక పాలు ఇచ్చిండు. పట్నంల ఉన్న బాపూ గాట్కు కెసిఆర్ బోయిండు. గాడున్న గాంది మెడల పూలదండేసి మొక్కిండు. నల్లగొండ జిల్లా పెద్ద కాపర్తిల గాంది గుడి ఉన్నది. పొద్దుగాల సందే గా గుడికి మస్తుమంది వొచ్చింద్రు. గాంది బొమ్మకు మేక పాలతోని అబిసేకం జేసింద్రు. పూజలు జేసింద్రు. జెనం ఎక్వమంది వొచ్చె బట్కె ప్రత్యేక దర్శనంకు మూడు నూర్ల టికెట్ బెట్టింద్రు. గా టికిట్ మీదనే ప్రత్యేక పూజడ జేసింద్రు. అంటరానోల్లు అనుకుంట కొంతమందిని గాందిగుల్లెకు రానియ్యలేదు. గాంది గుడి ఎదురుంగనే విస్కి, బీరు, బరాండి అసువంటి మందు దుక్నాలున్నయి."

"మందు గొట్టొద్దని గాందిజెప్పిండు గదా"

"అవద్ద మాడొద్దని గూడ గాంది జెప్పిండు. ఇయ్యాలేపు అవద్ద మాడని లీడర్ ఒక్కడన్న ఉన్నాడా? గా తీర్గనే మందు గొట్టనోడు ఒక్కడు గూడ లేడు. కుద్దు సర్కారే మందుగొట్టమని జెనంకు జెప్తున్నది. నిజం జెప్పాలంటె మందు తోనే సర్కార్ నడుస్తున్నది."

"ఓ గాల్ల గాంది డిల్లీలకు దిగొస్తె ఏం జేస్తరు?" అని నారదుడు అడిగిండు.

"ఒగడు కండ్లద్దాలు గుంజుకొంటడు.




ఒకడు కట్టె గుంజుకొంటడు. ఇంకొకడు గాంది పెయ్యి మీద గప్పుకొన్న బట్ట గుంజక్క బోతడు. ఆకర్కి గాందిని ఒక బొమ్మ జేసి చౌరస్తల నిలబెడ్తరు. గా బొమ్మకు పూలదండ లేస్తరు. కాకులుగా బొమ్మ మీద రెట్ట లేస్తుంటాయి" అని దున్నపోతు జెప్పింది.

"గాంది బొమ్మకు పూలదండలేసిన టీఆర్ఎస్ లీడర్లేమన్నరు"

"ఆంగ్రేజోల్ల తోని కొట్లాడి గాంది దేసంకు ఆజాద్‌దెచ్చిండు. ఒక్క నెత్తురు గూడ కింద బడని తరీ కలనే గాంది కొట్లాడిండు. ఆంద్రోల్ల తోని కెసిఆర్ కొట్లాడి తెలంగానకు ఆజాద్ దెచ్చిండు. కెసిఆర్ గూడ గాంది తరీకలనే కొట్లాడిండు. తెలంగాన గాంది కెసిఆర్. గాయినకు గూడ ఒక గుడి గట్టాలె. గా గుడిల కెసిఆర్ బొమ్మను బెట్టి పూజలు జెయ్యాలె. యాడాది కొక్క పారి బ్రహ్మోత్సవాలు జెయ్యాలె. గా గుడి గోడల మీద టీఆర్ఎస్ పద్యాలు జెక్కాలె అని టిఆర్ఎస్ లీడర్లన్నరు.

"గాంది జయంతి దినాన బిజెపి లీడర్లు ఏం జేసింద్రు"

"కద్మ పార్టీల లీడర్ల లెక్కనే గాల్లు గూడ గాంది బొమ్మ మెడల తామర పూలదండ లేసింద్రు. పూజలు జేసింద్రు"

"గాల్లేమన్నరు"

"గాంది తీర్గనే మోదీ దేసంల అందర్ని ఒక్క తాన్కి దీస్కొచ్చిండు. గందుకే అమెరిక ప్రెసిడెంట్ ట్రంప్ మోదీని జాతిపిత అని అన్నడు. పాత జాతిపిత గాంది అయితె కొత్త జాతిపిత మోదీ. గాంది బొమ్మ తీర్గనే పతొక్క ఊర్లె మోదీ బొమ్మ బెట్టాలె. గంతే గాదు. గాయినకు గుడి గట్టాలె. గా గుల్లె గాయిన బొమ్మ ఉంచి పూజలు జెయ్యాలె. లింగంకు ఎదురుంగ నందిని బెట్టిన తీర్గ మోదీ బొమ్మకు ఎదురుంగ ఒక ఆవును ఉంచాలె. ఆవు పాలతోని మోదీ బొమ్మకు అబిసేకం జెయ్యాలె అని గాల్లు అన్నరు"

"బిజెపి ఎంపీ సాద్వి ప్రగ్నా సింగ్ గాందిని సంపిన గాడ్సేనే దేస భక్తుడు. ఎక్వ తక్వ మాట్లాడితె గాయిననే దేముడు. గాయినకు గుడి గట్టిపిస్తనని అన్నదట గదా"

"అవ్ అన్నది. ఇంతకు ముందు మోదీ ఆర్ఎస్ఎస్ల ఉండెటోడు. గాడ్సే గూడ గాదాంట్లనే ఉండెటోడు. మోదీ గాంది అయితె గాడ్సే ఎందుకు గాడు అని కొందరు అడుగుతున్నరు. మల్ల గలుస్త" అన్కుంట యముని దున్నపోతు నర్కం దిక్కు బోయింది. నారాయన, నారాయన అనుకుంట నారదుడు వైకుంటం బోయిండు.

తోక:– ఒక మంత్రి మోటర్ ఎక్కిండు.

"నువ్వు పక్కన గూసో. ఇయ్యాల మోటర్ నేను నడిపిస్త" అని డేవర్‌తోని అన్నడు.

"మోటర్ నడిపిచ్చుడంటె సర్కార్ నడిపిచ్చినట్లు గాదు. సర్కార్‌ను ఎట్ల నడిపిచ్చినా నడుస్తది. గని మోటర్‌ను ఎట్ల బడ్తె గట్ల నడిపిస్తె టక్కర్ అయితది. అదృస్టం బాగుంటె కాలన్న, చెయ్యన్న ఇర్గుతది. బాగలేక పోతె పెండ్లాం పిల్లలకు గాకుండ బోతం" అని డేవర్ అన్నడు.

**సెల్: 9959150491**

## రిపోర్టర్స్ డైరీ

### స్టూడెంట్ నెంబర్‌వన్..!

శాసనసభా సమావేశాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం... అసెంబ్లీ ప్రాంగణం పాత్రికేయులు, సందర్శకులతో కిటకిటలాడింది. సమావేశాల కవరేజీకి వెళ్లిన ఓ జర్నలిస్టు.. హడావుడిగా సభలోనికి వెళుతున్నాడు. ఇంతలో అతణ్ని చూసిన మరో సీనియర్ పాత్రికేయుడు... 'హలో తమ్ముడూ.. ఇటు రా.. ఓసారి...' అంటూ పిలిచాడు. 'లేదన్నా టైం అవుతున్నది.. నేను లోనికి వెళ్లాలి...' అంటూ మొదటి విలేకరి అక్కడి నుంచి వెళ్లబోయాడు. 'ఒక్కటే నిమిషం తమ్మీ...' అంటూ సీనియర్ మరోసారి పిలిచేసరికి.. అతడు ఆగిపోయాడు. 'చూడు తమ్మీ... మా ఫ్యామిలీని తీసుకుని అసెంబ్లీకి వచ్చా. పిల్లలు ఒకసారి శాసనసభకొస్తానంటే తీసుకొచ్చా. ఇదిగో వీడు మా పెద్దబ్బాయి. ఎమ్‌టెక్ టాపర్. జెమ్మూ తెలుసా..? అన్ని సబ్జెక్టుల్లో నెంబర్‌వన్. కాలేజీ టాపర్...' అంటూ తన పుత్ర రత్నం గురించి చెప్పుకున్నాడు ఆ సీనియర్. ఆయన ముగించిన తర్వాత.. మొదటి విలేకరి అందుకుని.. 'చూడు బాబూ.. అసెంబ్లీ సమావేశాల మీద ఇంట్రెస్ట్‌తో.. శాసనసభను చూడ్డానికి వచ్చావా... వెరీ గుడ్..! మన స్పీకర్ ఎవరో తెలుసా...?' అని అడిగాడు. ఊహించని ఈ ప్రశ్నకు కంగుతిన్న మన స్టూడెంట్ నెంబర్‌వన్.. జవాబు తెలీక నీళ్లు నమిలాడు. 'అది.. అదీ అంకుల్... స్పీకర్ పేరు...' అంటూ నసిగాడు. ఎంతకీ సమాధానం దొరక్కపోవటంతో 'డాడీ...' అంటూ వాళ్ల నాన్న వైపు లుక్కేశాడు. విలేకరి ప్రశ్నకు, జవాబు దొరక్క తికమకపడుతున్న తన కొడుకు అవస్థకు అవాక్కయిన ఆ తండ్రి...'తమ్మీ.. నీకు టైం అవుతుందన్నావుగా.. వెళ్లు మరి.. మళ్లీ కలుద్దాం...' అంటూ పుత్రరత్నాన్ని రక్షించుకున్నాడు. అదీ మన సదువుల సంగతి. సమాజం గురించీగానీ, ప్రజల గురించిగానీ తెలియకుండా నేటి విద్యార్థుల్ని యంత్రాల్లాగా మారుస్తున్న ఈ సదువుల తీరు మారేదెన్నడో...?

**–బి.వి.యన్.పద్మరాజు**

### గురూ ఈజ్ బెటర్ దెన్ గూగుల్!

ముప్పవరపు వెంకయ్య నాయుడు.. భారత ఉపరాష్ట్రపతి. జాతీయ రాజకీయాల్లో తెలుగు ప్రాంత ప్రతినిధి. మాంచి భోజన ప్రియుడు. బహుభాషా కోవిదుడు. పార్లమెంట్ అయినా.. పబ్లిక్ మీటింగ్ అయినా ప్రాసలు, ప్రద ప్రయోగాల్లో దిట్ట అని ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. అన్నింటికీమించి వెంకయ్యో నిత్య విద్యార్థి. ప్రతి నిమిషం అధ్యయనం చేస్తుండటం, దాని గురించి తనని కలిసిన నాయకులు, అధికారులు, జర్నలిస్టులు, హితులు, సన్నిహితులకు చెబుతుండటం ఆయనకున్న అధికారిక అలవాటు. విషయాన్ని అనర్గళంగా చెప్పడంలోనూ ఆయన లబ్ధప్రతిష్టులు. అటువంటి సందర్భం ఒకటి. ఇటీవల ఢిల్లీలో జరిగింది. ఓ అవార్డు ప్రదాన కార్యక్రమంలో వెంకయ్య నాయుడు గురువు గురించి మాట్లాడాల్సి వచ్చింది. వెంటనే ఆయన ఏదో పద్యమో, శ్లోకమో చదువుతారని అంతా ఆశించారు. కానీ సింపుల్‌గా "గురు ఈజ్ బెటర్ దెన్ గూగుల్" అంటూ సింగిల్ లైన్‌లో ఉపాధ్యాయుడి గొప్పతనాన్ని అభివర్ణించారు. సభికులంతా చప్పట్లతో సంతోషించారు.

**– సాగర్ వనపర్తి**

### పండుగ పాట్లు

దసరా పండుగకు చెవి దుద్దులు చేయిస్తానన్నారు? మర్చిపోయారా? ఇంకెప్పుడు తెస్తారు? యాడాదికొక పండుగ ఈసారీ చేయించకుంటే నామీద ఒట్టే... మా పుట్టింటి వారు కల్గినోళ్లయితే మిమ్ముల్ని కాకా పట్టాల్సిన అవసరం నాకేంటి అంటూ... ఇంటింటీ రామాయణాన్ని ఆగకుండా చదివి అలసిపోయి నిట్టూర్పు విడిచే ఇల్లాలు.. టీవీల్లో వచ్చే అడ్వర్టైజ్‌మెంట్లనూ, పత్రికల్లో వచ్చే ప్రకటనలను అనుకరిస్తూ.. బ్రాండెడ్ బట్టలు, మ్యాచింగ్ చెప్పులు, అంటూ చాంతాడంత లిస్టు చదివే పిల్లలు... దసరాకైనా కొత్తబట్టలు కొనరా..! అంటూ ప్రాధేయపడే తల్లిదండ్రులు... ఈసారెలాగైనా పండుగకు నాలుగు రోజుల ముందైనా ఊరెళ్లాల్సిందే.. పోయినేడు ఇలాగే చెప్పి చివరిక్షణంలో తప్పించారు... ఇప్పుడస్సలు కుదరదంటూ ఒకవైపు కోపం మరోవైపు ప్రాధేయ పడే భార్యా బిడ్డలూ... పండుగొచ్చిందంటే సగటు మనిషికి చెప్పలేనన్ని పాట్లు.. ఓ వైపు పెరుగుతున్న ధరలు, ఆకాశన్నంటిన ఇంటద్దెలు, ఎదుగుతున్న పిల్లలు, సమయానికి అందని, చాలీ చాలని జీతం... మహానగరంలో సగటు జీవి కష్టాలు చెప్పనలవి కానివి. దసరా పండుగంటేనే తెలంగాణ ఆత్మ అంటూ ఊదరగొట్టే సామాజిక మాధ్యమాలు, ప్రచారసాధనాలు, ప్రభుత్వాలు చేసే హంగామా పట్నం నుంచి పల్లెలకు తాకడంతో... నేటి తరం పిల్లలు, పెద్దలు ఒకటేంటీ అందరూ ఆర్భాటాలకు పెద్దపీట వేస్తున్నారు. ఫలితంగా ఖర్చును భరించడం సామాన్యునికి తలకు మించిన భారం అవుతున్నది.

**– ఊరగొండ మల్లేశం**

### నాడు పొగిడి నేడు తెగిడి...

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సకల జనుల సమ్మె సందర్భంగా ఉద్యమకారుడిగా కేసీఆర్ ఇచ్చిన ప్రసంగం వీడియో వైరల్ అయింది. తెలంగాణ రాష్ట్ర సాధన అన్ని వర్గాలతో కలిసి ఆర్టీసీ కార్మికులు ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల బలాన్ని పొగుడుతూ, వారితో పెట్టుకుంటే అగ్గి అవుతారని నాటి ప్రభుత్వాన్ని అప్పుడు కేసీఆర్ హెచ్చరించారు. తాజాగా శనివారం నుంచి ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రారంభం కావడంతో సామాజిక మాధ్యమాల్లో కేసీఆర్ మాటలు మార్మోగుతున్నాయి. ఆర్టీసీ కార్మికుల కన్నా ఈ వీడియోను ఇతర వర్గాల వారే ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదన్న బాధ ఉన్న ఆయా ఉద్యోగ వర్గాలతో పాటు ప్రజలు నాటి, నేటి పరిస్థితులను పోల్చుకుంటూ చర్చించుకుంటున్నారు. ఈ వీడియోపై కామెంట్లు, రీ కామెంట్లతో మారిన పరిస్థితులను ప్రజలు అవలోకనం చేసుకుంటున్నారు. నాడు ఆర్టీసీ కార్మికుల పక్షంగా నిలబడి నాటి ముఖ్యమంత్రిని విమర్శించిన కేసీఆర్, తాను ముఖ్యమంత్రి అయ్యాక మాటలు పూర్తిగా మారిపోయాయని అనుకుంటున్నారు. కేసీఆర్ తీరు ఏరు దాటే వరకు ఓడ మల్లయ్య, ఏరు దాటాక బోడ మల్లయ్య అన్న ఉందని విమర్శలు గుప్పిస్తున్నారు.

**–ప్రియకుమార్**

మానవి
నవతెలంగాణ
5 హైదరాబాద్
www.navatelangana.com
ఆదివారం 6-10-2019



## బతుకమ్మ పాట

బంగారు మాతల్లి బతుకమ్మ
మా తెలంగాణ తల్లి బతుకమ్మ
నీ సంబురాలు మాకు మహావరం
గడప గడపకు బంధువైనవు
తడవ తడవకు మదిలో మెదిలేవు బతుకమ్మ
॥బంగారు॥

గునుగు తామర తంగేడుపూలు
గుమ్మడి పూల సప్తవర్ణములు
మట్టి నుండి మట్టిలోనికి చేర్చు
మానవీయత మర్మం తెలుపు
ఆడపడుచుల ఆనంద హేల
అందరు నీ వాళ్ళను దీవించే మా బతుకమ్మ మా బతుకమ్మ
॥బంగారు॥

మా బ్రతుకునకు బాసటయినవు
ఉద్యమాలకు ఊపిరయినవు
కష్టసుఖాలలో తోడై నిలిచినవు
ఐకమైత్యమై వెల్లివిరిసినవు
దు:ఖం బాపే ధన్యరూపివి
నీవు లేనిదే మేము లేములే
మమ్మేలు మా బతుకమ్మ మా బతుకమ్మ
॥బంగారు॥

గుండెచప్పుడై కొలువుతీరినవు
తెలంగాణ సంస్కృతిని చాటినవు
రంగు రంగుల పూలు తెచ్చినము
ఆటపాటలతో నిన్ను కొలిచినము
నీ అభయమే మా ధైర్యం
బంగారు మా తల్లి బతుకమ్మ మా బతుకమ్మ
॥బంగారు॥

-వైద్యం భాస్కర్
9494486475

## పచ్చదనంతో ఆహ్లాదం



- ఇంట్లో లక్షల రూపాయల అలంకార వస్తువులు ఎన్ని ఉన్నా.. ఓ పచ్చని మొక్క గాలికి హొయలుపోతూ పలకరిస్తే చాలు ఆ అనుభూతి, ఆనందమే వేరు. అందుకే ఇంటిబయటే కాకుండా ఇంట్లోనూ చిన్నపాటి మొక్కల్ని పెంచటం అందమూ, ఆరోగ్యకరం కూడా.
- పెద్ద ఇళ్లయినా, చిన్న ఇళ్లయినా చిన్నపాటి మొక్కల్ని ఇంట్లో సెట్ చేసుకునేందుకు ఎక్కువ స్థలం తీసుకోవవు. పైగా వీటికి ఎక్కువ సమయం కూడా కేటాయించనవసరం లేదు. ఇళ్లల్లో ఎక్కువగా వెదురు మొక్కల్ని పెంచుకుంటుంటారు. వీటికి సూర్యకాంతి అవసరం ఉండదు. అందుకే బెడ్‌రూమ్‌లో ఎంచక్కా వీటిని పెంచుకోవచ్చు. వెదురు మొక్కలు ఇంట్లోని కార్బన్‌మోనాక్సైడ్, బెంజీన్, క్లోరోఫామ్ లాంటి మూలకాల్ని పారద్రోలుతాయి.
- మన దేశంలో ఈమధ్యకాలంలో రబ్బరు ప్లాంట్స్‌ని ఇంట్లో పెంచుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈ మొక్కలు ఎక్కువ కాంతిని గ్రహిస్తాయి. ఎక్కువ నీటిని పీల్చుకుంటాయి. ఈ రబ్బరు మొక్కలు ఇంట్లో సరికొత్త లుక్ తీసుకొస్తాయి. దీంతో పాటు గాలిలోని కలుషితాలను శుద్ధిచేస్తాయి.
- వెదురు మొక్కలాగే ఉండి కొబ్బరి ఆకుల్లా ఉండే అరేకా పామ్ మొక్కలు ఇంట్లో పెంచుకునేందుకు అనువుగా ఉంటాయి. నీళ్లతో పాటు కాంతిని ఎక్కువగా గ్రహించే ఈ మొక్కలు ఇంట్లో ఉండే హ్యుమిడిటీని తగ్గిస్తాయి. గదికి అట్రాక్టివ్ లుక్ ఇస్తాయి. ఇలా చిన్నపాటి కుండీల్లో ఇమిడిపోయి తక్కువ ఎత్తు పెరిగే మొక్కల్ని, కొన్ని రకాల తీగ మొక్కల్ని ఇంట్లో పెంచుకుంటే ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి, దీంతో పాటు ఆరోగ్యకరం కూడా. ✿



ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని అంగీకరించడానికి.. అంతే ఉన్నతమైన వ్యక్తిత్వ ముండాలి. ఒక సున్నితమైన విషయాన్ని స్వీకరించడానికి.. అంతే సున్నితంగా వ్యక్తీకరించడానికి అంతకంటే సున్నితమైన హృదయముండాలి. అంతటి మనస్కురాలు, అద్భుతమైన అక్షర శిల్పి... స్వర్ణ కిలారి. ఏడేండ్ల పాటు కేరళలో జీవించిన ఓ అద్భుత చిన్నారి జీవితాన్ని... 'లిప్తపాటు స్వప్నం'గా మనముందు ఆవిష్కరించింది. 'క్లింట్' జీవితంలోని రంగులన్నింటినీ తన అక్షరాలతో పుస్తకంలోకి ఒంపింది. అంతేకాదు... 'దొరసాని' సినిమాలో పెద్ద దొరసానిగా నటించి... ప్రేక్షకుల మనసుల్లో తన ఇమేజ్‌ను సృష్టించుకున్నది.

# ఏడేండ్ల జీవితానికి స్వర్ణాక్షర నివాళి

**పుస్తకాలతో పరిచయం ఎప్పుడు ఏర్పడింది?**

నేను ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పుట్టి పెరిగాను. అమ్మ ఝాన్సీ లక్ష్మి. నాన్న రాజేశ్వరరావు, సింగరేణి కాలరీస్‌లో పనిచేసేవాడు. బాల్యంలో చదివే పుస్తకాలు ఒకలా ఉంటాయి. పరిణితి వచ్చిన తరువాత చదివిన పుస్తకాలు ఇంకోలా ఉంటాయి. మా అమ్మ ఝాన్సీలక్ష్మి. పీయూసీ చదువుకుంది. దాంతో ఇంట్లో చిన్నప్పటినుంచే పుస్తకాలుండేవి. అమ్మ బాగా చదివేది. చందమామ, బాలమిత్ర చదివేశాక... ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి వారపత్రికలు, చతుర, విపులలు చదివేదాన్ని. 'ఇవి చిన్నపిల్లలు చదవాల్సిన పుస్తకాలు కాదు' అని చెప్పినా వినకుండా... రాత్రి ఒంటిగంటయినా, రెండయినా పూర్తయ్యేదాకా చదిదేవాన్ని. ఆ తరువాత.. యండమూరి నవలలు, మల్లాది కృష్ణమూర్తి, మధుబాబు పుస్తకాలు చదివా. పుస్తకాలు బాగా చదివేదాన్ని.

**చదవడం సరే... రాయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?**

డిగ్రీ తరువాత... కంప్యూటర్ నేర్చుకుందామని హైదరాబాద్ వచ్చాను. ఆ తరువాత జాబ్‌లో చేరాను. అదే ఇనిస్టిట్యూట్‌లో ఓ కోర్సు నేర్చుకోవడానికి దిలీప్ కొణతం చేరాడు. అలా తను పరిచయం. ఆ స్నేహం తరువాత ప్రేమగా మారి... 2000 సంవత్సరంలో పెండ్లి చేసుకున్నాం. ఖాళీగా కూర్చోవడం అస్సలు ఇష్టం ఉండదు. అలాగనీ ఉద్యోగం కూడా చేయలేదు కానీ.. ఎప్పుడూ డ్రాయింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ఇలా చిన్న చిన్న బిజినెస్‌లు చేస్తుండేదాన్ని. దిలీప్ నిత్యం పుస్తకాలు చదువుతూనే ఉంటాడు. కనపడిన పుస్తకమల్లా కొనడమే కాదు... నెలకో ఇంగ్లిష్ పుస్తకాన్ని ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తుంటాడు. దాంతో నేనూ పుస్తకాలు చదివేదాన్ని. దీనికి మా అత్తమ్మమామయ్యలు కూడా స్ఫూర్తి. మోత్కూరు వెళ్తే అక్కడ ఇంటినిండా పుస్తకాలే. నా చదువు కంటిన్యూ అవ్వడానికి కారణం ఇంట్లో అట్లాంటి వాతావరణం. మేం ఎవ్వరం మాట్లాడుకున్నా.. పుస్తకాలు, రాజకీయాల గురించే. ఎక్కడికైనా వెళ్లినప్పుడు షాపింగ్ కంటే పుస్తకాలు కొనడానికే ఆసక్తి చూపిస్తాం. అలాగే... దిలీప్ రాసిన ప్రతి పుస్తకానికి ప్రూఫ్ రీడర్‌ను, ఎడిటర్‌ను నేనే. అయితే నేను రాయాలని ఎప్పుడూ అనుకోలేదు. ఆర్ణవ్ చిన్నవాడు కావడంతో వాడితోనే సరిపోయేది. వాడు పెద్దయ్యాక నా ప్రపంచం విశాలమైంది. 2014లో ఫేస్‌బుక్‌లో ప్రవేశించాను. అక్కడ ఒక్కలైన్ రాయడానికి భయపడేదాన్ని. తరువాత నెమ్మదిగా నా అభిప్రాయాలు రాయడం మొదలుపెట్టాను. సీరియస్‌గా రాయడానికి నాంది పలికింది మాత్రం 'నవలా నాయికలు' వ్యాస సంకలనం కోసమే. అందులో తొమ్మిది నవలల్లోని నాయికల గురించి రాశారు. అందరికీ రచన కొత్తే. నాకు బాగా నచ్చిన పుస్తకం.. ఓల్గా గారి 'స్వేచ్ఛ'లో నాయిక గురించి రాశాను. అది రాశాక నాకు ధైర్యం వచ్చింది.

**'లిప్తపాటు స్వప్నం' అనువాదానికి బీజం ఎలా పడింది?**



దాదాపు అయిదేళ్ల క్రితం – 2014 మే నెలలో ఒక రోజు ఎడ్వర్ థామస్ క్లింట్ పరిచయం అయ్యాడు నాకు, దిలీప్‌కు. దిలీప్ సోషల్ మీడియాలో చూస్తుంటే... క్లింట్ వీడియో కనిపించింది. తవ్వుకుంటే పోతే.. ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. నిండా ఏడేండ్లు కూడా జీవించని ఓ బాలుడు... 25 వేల చిత్రాలు గీశాడని చదివి అబ్బురపోయాం. వెంటనే పుస్తకం 'ఏ బ్రీఫ్ అవర్ ఆఫ్ బ్యూటీ' ఆర్డర్ చేశాడు. ఇంగ్లీష్‌లో అమ్మూనాయర్ రాసింది. దిలీప్ చదివి 'చాలా బాగుంది నువు చదువు' అని చెప్పాడు. చదివాను. ఆరోజు ఈరోజు వరకు అందులో విషయాలు గుర్తుకొస్తే ఏడవకుండా ఉండలేను. అంతగా నన్ను కదిలించేసింది. ఇంత అద్భుతమైన మనుషులుంటారా అనిపించింది. తెలుగులో తీసుకురావాలని... దిలీప్ ఒకరిద్దరని అడిగాడు. వాళ్లకు కుదరకపోవడంతో నన్నే 'అనువాదం చేస్తావా?' అన్నాడు. నేను అనువాదం చేయడమేంటి? అంటే... ఒక పిల్లాడి తల్లిగా నువు బాగా చేయగలవు అన్నాడు. ఈ పుస్తకం తెలుగు అనువాదానికి రచయిత్రి నుండి, క్లింటన్ కుటుంబం నుంచి అనుమతి తీసుకుందామని ప్రయత్నాలు మొదలు పెట్టా. అమ్మూ నాయర్ ఈ మెయిల్ ఐడి సంపాదించి ఆమెకు మెయిల్ రాశాము. వెంటనే తన ఆనందాన్ని వ్యక్తపరుస్తూ తన పుస్తకాన్ని తెలుగు చేస్తామన్నందుకు బదులిచ్చింది. అది అనువాదం చేస్తున్నన్ని రోజులు ఏడవడం తప్పితే ఏం చేసేదాన్ని కాదు. చాటుగా ఏడ్చేదాన్ని. మళ్లీ నేను ఏడుస్తున్నానేంటి? అనుకునేదాన్ని. ఎందుకంటే.. ఏడవడం బేలతనం అని చిన్నప్పటి నుంచి బలమైన నమ్మకం. కానీ పుస్తకం రాసినంత సేపు బాగా మదనపడ్డాను. మెలిపెట్టినట్టు అనిపించేది. క్లింట్ బతికుంటే ఇంకెంత గొప్పవాడయ్యేవాడేమో కదా! అమ్మూనాయర్... క్లింట్ ఫ్రెండ్. బాల్యంలో అతడిని, కుటుంబాన్ని దగ్గరగా చూసింది. అందుకే గొప్పగా రాయగలిగింది. ఇంగ్లీష్‌లో ఆమె అంత అద్భుతంగా రాసింది కాబట్టే.. తెలుగులో ఇంతయినా రాయగలిగిన.

**సాధారణంగా పుస్తకాన్ని అనువాదం చేయడానికి పుస్తకం ఉంటే చాలు... కానీ మీరు కేరళ వెళ్లి క్లింట్ కుటుంబాన్ని కలిశారు?**

నేను కేరళ వెళ్లడానికి ముందే 75శాతం అనువాదం పూర్తయ్యింది. క్లింట్‌కు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యేసరికి కుటుంబాన్ని కచ్చితంగా కలవాలనిపించింది. నేను అనువాదం చేస్తున్న సమయంలోనే.. క్లింట్ తండ్రి జోసెఫ్ చనిపోయారు. వాళ్లమ్మ 'చిన్నమ్మ'ను కలిశాక రెండు చేతులెత్తి మొక్కాలనిపించింది. అందరం పిల్లలను కంటాం. కానీ ఆ పిల్లల జీవితానికి సార్థకత ఏర్పరిచే తల్లిదండ్రులు తక్కువగా ఉంటారు. పిల్లలను ర్యాంకులు తీసుకొచ్చే యంత్రాల్లా చూస్తున్నాం మనం. కానీ వాళ్లు ఎప్పుడూ అలా అనుకోలేదు. 'మా అబ్బాయిని అందరిలో కలవడం కోసం పంపిస్తున్నాం. మీరు చదవమని బలవంత పెట్టకండి' అని స్కూల్లో ఆ రోజుల్లోనే చెప్పారంటే.. ఆ తల్లిదండ్రుల గొప్పతనం అర్థమవుతుంది. తండ్రి ఓ క్లర్క్. తనకు వచ్చిన జీతంలో రోజుకు నాలుగైదు రూపాయలు పేపర్లకోసం ఖర్చు పెట్టేవాడు. క్లింట్‌కి ప్రకృతిని దగ్గరుండి పరిచయం చేసింది వాళ్లమ్మ. గొంగళి పురుగుసీతాకోకగా మారడం దగ్గరనుంచి... ఆ వయసులోనే ఫిజిక్స్‌ను బోధించింది. అద్భుతమైన తల్లిదండ్రులు వాళ్లు. ఈ పుస్తకం చదవాల్సింది పిల్లలకంటే ఎక్కువగా... తల్లిదండ్రులు, టీచర్స్.

### మంచి స్నేహితులం...

అమ్మ నా జీవితంలోనుంచి వెళ్లిపోయిన క్షణం నుంచి నాకు తోడుగా దిలీప్ ఉన్నాడు. అసలు మా ఇద్దరి కులాలు ఏంటన్న ఆలోచన కూడా లేదు మాకు. పెండ్లికి ముందు వాళ్ల పేరెంట్స్ అడిగితే... వచ్చి నన్ను అడిగాడు. నా దగ్గరనుంచి ఏమీ కోరుకోలేదు. నా పక్కన, నా ముందు, నా వెనుక... అంతటా తనే ఉంటాడు. కులాంతర వివాహం అయినా... నేను ఏ ఇబ్బందులు పడలేదు. కారణం వాళ్ల కుటుంబాన్ని నేను పూర్తిగా ఓన్ చేసుకున్నా. అంతే సౌకర్యం అత్తయ్యవాళ్లు కూడా కల్పించారు. వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఎక్కువ, తక్కువ ఫీలింగ్స్ కూడా మాకు రావసలు. భార్యాభర్తలకంటే ముందు మేమిద్దరం మంచి స్నేహితులం.

నాకు ఏది అనిపిస్తే అది చేసే రకం నేను. దిలీప్ నాకు ఫుల్ సపోర్ట్ చేస్తాడు. తనకు నచ్చకపోతే 'మరోసారి ఆలోచించు' అంటాడే కానీ నో చెప్పడు.

**భవిష్యత్‌లో అనువాదం చేయాలనే ఆలోచన ఉందా? మీకు నచ్చిన పుస్తకాలేంటి?**

అనువాదమే చేయాలనుకుంటే ఈపాటికి రెండు పుస్తకాలు చేసేదాన్ని. ఆఫర్స్ కూడా వచ్చాయి. కానీ అనువాదాన్ని వృత్తిగా, వ్యాపారంగా చేయదలుచుకోలేదు. క్లింట్‌తో ఏర్పడిన ఎమోషనల్ బాండింగ్ వల్ల 'లిప్తకాలపు స్వప్నం' చేయగలిగాను. ఇట్లా నన్ను కదిలించే పుస్తకాలుంటే భవిష్యత్‌లో కూడా అనువాదం చేస్తాను. ఓ డైరెక్ట్ పుస్తకాన్ని ప్లాన్ చేస్తున్నా. రెండు కథలు రాశాను కానీ... ప్రచురణకు ఇవ్వలేదు. ఇటీవలి కాలంలో నాకు నచ్చిన నవలలు.. నీల, ఒంటరి, శప్తభూమి. పెద్ద నవలలు అయినా... రెండు రెండు సార్లు చదివానంటే అవి ఎంత ప్రభావం వేశాయో అర్థం చేసుకోవచ్చు. నాకు రంగనాయకమ్మ, ఓల్గాగార్ల రచనలు బాగా ఇష్టం. ఈ తరం రచయిత్రుల్లో మల్లీశ్వరి కూడా ఇష్టం. తన రచనా శైలి నచ్చుతుంది.

**క్లింట్ బాల్యాన్ని, అతని తల్లిదండ్రులను అంత ప్రేమించారు కదా! మీ బాల్యం గురించి చెప్పండి?**

నాకు బాల్యంలో రెండు షేడ్స్ ఉన్నాయి. ఇద్దరమ్మాయిలం. నాన్న సింగరేణి కాలరీస్‌లో జాబ్. ఆర్థికంగా ఇబ్బంది లేదు. నేనుపుట్టి పెరిగిందంతా అడవుల్లో. పరికి, రేగి, సీతాఫలాలు, మామిడిపండ్లు తింటూ.. ఆడుతూ పాడుతూ చదువుకున్నాం. మా స్కూలే అడవిలో ఉండేది. క్లాసులన్నీ బయటే జరిగేవి. అద్భుతమైన స్కూలింగ్. సంతోషమైన ఫ్యామిలీ. నాకు తొమ్మిదేండ్ల సమయంలో అమ్మకు క్యాన్సర్ వచ్చింది. కానీ అమ్మ ఏ లోటు లేకుండా పెంచింది. నాకు జబ్బుందని ఎప్పుడూ ఫీలయ్యేది కాదు. చెబితే తప్ప... అమ్మ క్యాన్సర్ పేషెంట్ అని తెలిసేది కాదు. తను బేలగా ఉండలేదు. మమ్మల్నలా పెంచలేదు. ఇద్దరాడపిల్లలు అనగానే పాపం లాగా చూసేవాళ్లు. అయితే తప్పేంటి అనేది అమ్మ. బేలగా ఉండొద్దు అని చెప్పేది. మమ్మల్ని చాలా బోల్డ్‌గా పెంచింది. ఆ ధైర్యం మా ఇద్దరు అక్కాచెల్లెళ్లకి కొంత వచ్చింది. మేం స్వతంత్రులుగా ఎదిగాం. 98లో డిగ్రీ అయిపోయాక హైదరాబాద్ వచ్చాను. అప్పుడు మళ్లీ క్యాన్సర్ అటాక్ అయ్యింది. ఏడాదిపాటు పోరాడి.. చివరికి ఓడిపోయింది. అమ్మ కీమోలకు వెళ్లినప్పుడంతా నాన్నగారే చూసుకునేవారు. జడలు వేసి స్కూల్‌కు పంపేవారు. అమ్మ పోయాక కొద్దిగా డల్లయ్యారు. నా పెండ్లయ్యాక కూడా మాతోనే ఉన్నారు. 2014లో చనిపోయారు. ఇద్దరి ప్రభావం నా మీద ఉంటుంది. మా అమ్మ పెద్ద రోల్‌మోడల్‌నాకు. గొప్ప మహిళ ఆమె. పితృస్వామ్య కుటుంబమే. అయినా అమ్మ అప్పట్లోనే పీయూసీ చదువుకుంది. చాలా అందంగా ఉండేది. థియేటర్‌లో యాక్టివ్‌గా ఉండేది. ఒతెల్లో వంటి డ్రామాల్లో నటించింది.



### మంచి స్నేహితులం...

అమ్మ నా జీవితంలోనుంచి వెళ్లిపోయిన క్షణం నుంచి నాకు తోడుగా దిలీప్ ఉన్నాడు. అసలు మా ఇద్దరి కులాలు ఏంటన్న ఆలోచన కూడా లేదు మాకు. పెండ్లికి ముందు వాళ్ల పేరెంట్స్ అడిగితే... వచ్చి నన్ను అడిగాడు. నా దగ్గరనుంచి ఏమీ కోరుకోలేదు. నా పక్కన, నా ముందు, నా వెనుక... అంతటా తనే ఉంటాడు. కులాంతర వివాహం అయినా... నేను ఏ ఇబ్బందులు పడలేదు. కారణం వాళ్ల కుటుంబాన్ని నేను పూర్తిగా ఓన్ చేసుకున్నా. అంతే సౌకర్యం అత్తయ్యవాళ్లు కూడా కల్పించారు. వ్యక్తిగతంగా, కుటుంబపరంగా ఎక్కువ, తక్కువ ఫీలింగ్స్ కూడా మాకు రావసలు. భార్యాభర్తలకంటే ముందు మేమిద్దరం మంచి స్నేహితులం.

నాకు ఏది అనిపిస్తే అది చేసే రకం నేను. దిలీప్ నాకు ఫుల్ సపోర్ట్ చేస్తాడు. తనకు నచ్చకపోతే 'మరోసారి ఆలోచించు' అంటాడే కానీ నో చెప్పడు.



✍ కట్ట కవిత
- వెంకటేశ్ పిప్పళ్ళ



## ఆకుల బతుకమ్మకు 13 ప్రపంచ రికార్డులు

ప్రఖ్యాత చిత్రకారిణి డాక్టర్ లక్ష్మీ సుహాసిని 13 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు.

సామాజిక చైతన్యం కలిగిన విలక్షణ చిత్రకారిణి డా॥ లక్ష్మీ సుహాసిని. విద్యార్థి దశ నుంచీ ప్రజానుకూల సాహిత్యాన్ని కవితలు, పాటలు, వ్యాసాల రూపంలో గణనీయంగా సృష్టించారు. ప్రఖ్యాత కవి, విమర్శకులు కె.వి. రమణా రెడ్డి సాహిత్యం మీద పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. నెలూరు జిల్లా రచయిత్రులపై యూజీసీ మైనర్ ప్రాజెక్ట్ వర్క్ చేసారు.

తీరొక్క పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మ తెలంగాణా సంస్కృతికి ప్రతిరూపం. బతుకునే ఓ పండుగగా జరుపుకుంటూ అమ్మను కొలిచే సాంప్రదాయం ప్రపంచంలోనే అరుదైన విషయం. ఇది ఒక్క తెలంగాణకే సొంతం. బతుకమ్మను ఎంతో మంది కళాకారులు, రచయితలు ఎన్నో విధాలుగా చిత్రీకరించారు. బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేస్తూ తామూ ప్రపంచ ఖ్యాతి పొందారు. ఈ కోవలోనే పల్లెపల్లెనా గునుగుపూల గుసగుసలతో, తంగేడు పూల పసిమి మిసిమితో, గన్నేరుపూల, బంతిపూల, చామంతిపూలతో పేర్చుకున్న దొంతరలతో తీర్చిదిద్దుకుని తలకెత్తుకుని బాటవెంట సాగిపోయే బతుకమ్మను ఆకులతో చిత్రీకరించిన [...]

' జానపద స్త్రీ పాటల్లో స్త్రీల వ్యక్తీకరణ రీతులు' అన్న అంశం మీద మద్రాసు విశ్వ విద్యాలయంలో డీ లిట్ చేశారు. ఈ సందర్భంగా 200 పైగా జానపద పాటలను సేకరించి విశ్లేషించారు. ప్రజలనుంచి సేకరించిన బాణీలతో మహిళలు, సారా ఉద్యమం, పర్యావరణం.. తదితర ప్రజా సమస్యలపై వందలాది పాటలు స్వయంగా రచించారు. వీరి పాటల సంకలనం 'దామదచ్చియలో' 2006లో విడుదలయ్యింది. ' రెక్కలు పొదిగిన చూపు' పేరుతో సుహాసిని కవితా సంకలనం 2008లో విడుదలయ్యింది.



గత ఇరవై సంవత్సరాల నుంచి సుహాసిని చిత్రకళా రంగంలో విస్తృతంగా కృషి చేస్తున్నారు. 'కాదేదీ కవితకు అనర్హం' అని మహాకవి శ్రీశ్రీ అన్నట్టు, కాదేదీ చిత్రకళకు అనర్హం అంటూ పూల రేకులు, ఆవాలు, మెంతులు, వివిధ రకాల గింజలు ఉపయోగించి వందలాది చిత్రాలను చిత్రీకరించారు. వందకు పైగా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. 2010లో 6 వేల పూల రేకులను ఉపయోగించి ఈ మె చిత్రీకరించిన ' మంటల్లో మహిళ' చిత్రం సంచలనం సృష్టించింది. అలాగే ఆవాలు, మెంతులు, 6060 గింజలతో తయారు చేసిన గౌతమ బుద్ధుని చిత్రం 2013 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సతో పాటు మరో 13 రికార్డులను పొందింది. 13326 సీడ్స్‌తో చిత్రీకరించిన ' కణ్ణగి' చిత్రం తన రికార్డును తానే బద్దలు కొట్టి సరికొత్త రికార్డును స్థాపిస్తూ 7 రికార్డు బుక్స్‌లో నమోదు అయ్యింది.

దాదాపు అర్ధ శతాబ్ధ కాలంగా తన హైస్కూలు రోజుల నుండి ఇప్పటి వరకూ ప్రజల పట్ల నిబద్ధతతో సామిత్య, చిత్ర, కళారంగాలతో పాటు సామాజిక ఉద్యమకారణిగా నిర్విరాయ కృషి చేస్తున్నారు. ఓ పాఠశాలను స్థాపించి నేటి యువతకు నాణ్యమైన విద్యను అందించాలనే ప్రయత్నంలో ఉన్న సుహాసిని కోరిక తొందరలోనే నెరవేరాలని ఆశిద్దాం.

- కె. ఎన్. జీవని

## సహజసిద్ధంగా..



ఇంట్లోని వస్తువులను శుభ్రం చేయటానికి సబ్బులు లేదా క్లీనర్స్ వాడుతుంటాం. అయితే మనం తీసుకునే కొన్ని ఆహారపదార్థాలు న్యాచురల్ క్లీనర్స్‌గా పనిచేస్తాయి. టూ ఇన్ వన్‌గా ఉపయోగపడే ఆ న్యాచురల్ ఫుడ్ క్లీనర్స్ ఏంటో తెలుసుకుందాం.

- ఓట్స్ తినడానికి మాత్రమే కాదు.. మంచి క్లీనర్‌గా కూడా పని చేస్తాయి. ఓట్స్ పిండికి కొన్ని నీళ్లు కలిపి చేతుల్ని శుభ్రపరచుకోవచ్చు. ఇలా చేస్తే చేతిపై ఉండే మురికితోపాటు సూక్ష్మజీవులూ అంతమవుతాయి.
- సాస్‌కు గోరువెచ్చటి నీళ్లు కలిపి రాగిపాత్రల్ని శుభ్రపరచవచ్చు. ఈ టెక్నిక్ ఉపయోగించి చూడండి మీ రాగి పాత్రలు మెరిసిపోతాయి.
- వంటసోడా ఆహారంలో వాడటానికే కాదు మంచి క్లీనర్‌గా ఉపయోగపడుతుంది. దీనికి కాస్త నిమ్మరసం జత చేసి సింక్‌ను క్లీన్ చేసుకోవచ్చు. బాత్రూమ్‌నూ శుభ్రంగా ఉంచుకోవచ్చు.
- శుభ్రం చేయవల్సిన గాజుపాత్రల్లో ఒక కప్పు బియ్యం పోసి దానిలో వేడి నీళ్లు పోయాలి. ఒకసారి షేక్ చేస్తే ఆ పాత్ర శుభ్రమైపోతుంది. ఈ నీటితో మిగతా గాజు పాత్రలను క్లీన్ చేసుకోవచ్చు.
- బ్లాక్ టీ చల్లారాక దాంతో పాత్రల్నీ క్లీన్ చేయొచ్చు. దీంతో పాటు వుడెన్ ఫ్లోర్‌ను శుభ్రం చేసుకోవచ్చు. ✿

## యూనియన్ లీడర్లే రెచ్చగొడుతున్నారు

- ఆర్టీసీ కార్మికులకు దేశంలోనే అత్యధిక జీతభత్యాలు
- రూ.5వేల కోట్ల నష్టాలతో నెట్టుకొస్తున్నాం: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**నవతెలంగాణ - సంగారెడ్డి ప్రతినిధి**

ఆర్టీసీ కార్మికులకు, సిబ్బందికి దేశంలోనే అత్యధిక జీతభత్యాలు తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. అత్యంత రద్దీగా ఉండే బతుకమ్మ, దసరా పండుగల సమయంలో సమ్మె చేస్తామనడం ఎంతవరకు సబబన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోకుండా 'ఇస్తారా.. చస్తారా..' అనడం భావ్యమా అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి 44శాతం ఫిట్‌మెంట్, 16 శాతం ఐఆర్ ఇచ్చామని గుర్తుచేశారు. ఆర్టీసీ నేడు రూ.5వేల కోట్ల నష్టాల్లో ఉందన్న సంగతి కార్మికులు, సిబ్బంది గుర్తుంచుకోవాలన్నారు. ప్రతియేటా రూ.1100 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతోందన్నారు. రైతులు, ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తూ రోజుకో డిమాండ్ ముందుకు తేవడం సరికాదని చెప్పారు. సిబ్బంది, కార్మికులను యూనియన్ నాయకులే రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని సమ్మె విరమించి విధులకు రావాలని కోరారు. ఆయన వెంట జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఉన్నారు.

## మద్యం పాలసీతో లిక్కర్ తెలంగాణ: రమణ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ ఒకటి నుంచి అమల్లోకి తేనున్న నూతన మద్యం విధానం మందు బాబులను పెంచి లిక్కర్ తెలంగాణగా మార్చుతుందని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకపోతుల రమణ ఒక ప్రకటనలో విమర్శించారు. పర్మిట్ రూమ్‌లకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం, 70 వేల బెల్ట్ షాపులకు అనధికారికంగా నిర్వహించడం, రాత్రి 11 గంటల వరకు మద్యం అమ్మకాలు జరపడం వల్ల రాష్ట్రం మద్యం మత్తులో ఊగుతున్నదని తెలిపారు. మద్యం మూలంగా సమాజంలో అసాంఘీక కార్యకలాపాలు పెరగడంతో పాటు కుటుంబంలో కలహాలకు దారి తీస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టాలనుకుంటున్న మద్యం పాలసీని వెంటనే రద్దు చేసి, దశల వారిగా నిషేధం అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారనీ, మద్యం అమ్మకాలతో కల్లు అమ్మకాలు పడిపోయి వృత్తి దెబ్బతిని ఉపాధి కోల్పోతున్నారని గుర్తు చేశారు. ఎక్సైజ్ శాఖామంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రకటించిన విధంగా నీరా దుకాణాలను వెంటనే తెరవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జ్వరాలతో ముగ్గురు మృతి

**నవతెలంగాణ-గార్ల/ భద్రాచలం**

విషజ్వరాలతో శనివారం ముగ్గురు మృతిచెందారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని తహసీల్దారు బజారుకు చెందిన వికలాంగుడు బొమ్మకంటి రాము(28) నాలుగు రోజులు జ్వరంతో బాధపడ్డాడు. పరిస్థితి విషమించి మృతిచెందాడు. మండల పరిధిలోని మర్రిగూడెం పంచాయతీ సరిహద్దుతండాకు చెందిన తేజావత్ సతీష్(14) ఎనిమిదో తరగతి చదివేవాడు. జ్వరంతో బాధపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

భద్రాద్రి జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన బాలుడు పి.ధనుష్ (6) డెంగ్యూతో మృతిచెందాడు. కొంతకాలంగా డెంగ్యూ లక్షణాలతో భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

## మహిళలకు సీఎం బతుకమ్మ శుభాకాంక్షలు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి కేసీఆర్ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శమైన ఈ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. సద్దుల బతుకమ్మను నిర్వహించే అన్ని చెరువుల వద్ద ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పదిలంగా కాపాడుకుందాం : డిప్యూటీ స్పీకర్**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పదిలంగా కాపాడుకోవాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. శాసనసభ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రకృతిని ఆరాధించే విధంగా పండుగలు జరుపుకోవటం మన రాష్ట్రంలో ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు.

## ఆర్టీసీ సమ్మెను పరిష్కరించండి: రావుల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికుల సమ్మెను వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్‌భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు ప్రధాన రవాణాగా గుర్తింపు పొందిన టీఎస్‌ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడంవల్ల దసరా పండుగకు ఊరికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దీనికి ప్రభుత్వమే కారణమన్నారు. ప్రత్యేకరాష్ట్ర ఉద్యమ సమయంలో మందుండి పోరాడిన కార్మికుల హక్కులను స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. ఆర్టీసీ జేఏసీ మీటింగ్‌లలో కేసీఆర్ స్వయంగా పాల్గొని కార్మికుల కాళ్లకు ముళ్లు గుచ్చితే పంటితో తీస్తానని పెద్ద పెద్ద డైలాగులు చెప్పి ఇప్పుడు వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 60 రోజుల క్రితం సమ్మె నోటీస్ ఇచ్చినా నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా కాలయాపన చేశారని విమర్శించారు.

## మంత్రి ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

- పట్టా మార్పిడి కాకపోవడంపై మనస్తాపం

**నవతెలంగాణ-మెండోరా**

రెవెన్యూ కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా కొనుగోలు చేసిన భూమిని తన పేరున పట్టా చేయడం లేదని ఓ రైతు ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎదుట ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోబోయాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం చిట్టాపూర్‌లో శనివారం జరిగిం ది. గ్రామానికి చెందిన రఘు తన ముగ్గురు సోదరులతో కలిసి బాల్కొండ మాజీ సర్పంచ్ వద్ద 9 ఎకరాల భూమిని కొన్నాడు. రఘు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లా డు. ఊళ్లో ఉన్న ముగ్గురు సోదరులు 2.25 ఎకరాల చొప్పున పట్టా చేయించుకున్నారు. గల్ఫ్ నుంచి తిరిగొచ్చిన రఘు తన వంతుగా వచ్చిన భూమిని పట్టా చేయాలని రెవెన్యూ అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. ఎన్నిసార్లు అధికారులను కలిసినా పని కాలేదు. దాంతో ఆ భూమి విక్రయించిన వారి పేరు మీదనే ఉండి పోవడంతో రఘు మనస్తాపం చెందాడు. శనివారం ఆ గ్రామానికి 30 రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వచ్చిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఎదుట కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకోబోయాడు. గమనించిన స్థానికులు రఘును నిలువరించారు. స్పందించిన మంత్రి వేముల ఆ భూమి బాధితుని పేరన పట్టా చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పోలీసు సిబ్బంది బాధితుడిని బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి పంపించారు.

# అదరం...బెదరం...



## ప్రజారవాణా పరిరక్షణ కోసమే సమ్మె

- కావాలనే సీఎం బదనాం చేస్తున్నరు
- తెలంగాణ తెచ్చుకున్నది ఉద్యోగాలు పోగొట్టుకోవడానికి కాదు
- ప్రయివేటీకరణను అడ్డుకుంటాం
- ఆ దసరా అప్పుడు చేస్తే మంచిది...ఇప్పుడు చెడ్డదా?
- అసౌకర్యానికి చింతిస్తున్నాం... ప్రజల్లారా సహకరించండి: ఆర్టీసీ సంఘాల నేతలు

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

"అదరం...బెదరం...ఎస్మాలు...గిస్మాలు జాన్తానై. ప్రజారవాణా పరిరక్షణ కోసం, ఆర్టీసీని రక్షించుకునేందుకు సమ్మె చేసి తీరుతాం. సర్కారు చేస్తున్న ప్రయివేటీకరణ యత్నాలను తిప్పికొడతాం. తెలంగాణ తెచ్చుకున్నది ఉద్యోగాలు పోగొట్టుకోవడానికి కాదు...ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచుకునేందుకు. 35 రోజుల కింద సమ్మె నోటీసు ఇస్తే...పండుగ సమయంలో మొక్కుబడి చర్చలు జరిపి బెదిరింపులకు దిగుతారా? ఉద్యమకాలంలో దసరా సమయంలో సమ్మె చేస్తే మంచోళ్లు? ఈ దసరాకు చేస్తే చెడ్డోళ్లా? ఆ నాడు ఆర్టీసీ సమ్మె చేయకుంటే ఉద్యమం ఊపందుకునేదా? నేడు సీఎం కేసీఆర్ సీఎం అయ్యేవారా? ఇదెక్కడి న్యాయం. ఆర్టీసీ నాయకులపై విషప్రచారం తగదు. డిపో స్థాయి నుంచి ఆర్టీసీ కార్మికుల్లో ఐక్యత ఉంది. సంఘాలు ఏవైనా ఆర్టీసీ కోసం సంఘటితమై పోరాడుతాం." అని ఆర్టీసీ సంఘాల నేతలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

**బెదిరింపులు మానుకోండి**

ముఖ్యమంత్రి బెదిరింపులను మానుకోవాలి. ఆర్టీసీని నిలబెట్టాలని మేం అడుగుతుంటే...ఉన్న 50 వేల కార్మికులను పీకేస్తామని కేసీఆర్ అంటున్నరు. తెలంగాణ వచ్చింది ప్రభుత్వ ఉద్యోగులను తీసేయడాకేనా? ఆర్టీసీని ఎత్తేయడానికేనా కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యింది? బ్రిటీషోళ్ల కంటే ఎక్కువ నియంతృత్వం చేస్తున్నరు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అడిగితే...ఉద్యోగాలు పీకేస్తమని అనడమేంటి. పక్కరాష్ట్రంలో ప్రభుత్వంలో విలీనం చేస్తున్నది కనిపిస్తలేదా? టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్టీసీ ఒక్క కొత్త బస్సును కూడా కొనలేదు. రీప్లేస్‌మెంట్‌లో కొన్ని బస్సులు తెచ్చారు. పదేండ్ల కింద ఎన్ని బస్సులున్నయో ఇప్పుడు అన్నే ఉన్నయి. ఇంకా ఏడు వేల సిబ్బంది రిటైర్డ్ అయ్యారు. ఒక్క పోస్టు భర్తీ చేయలేదు. సమ్మెకు సహకరించాలని ప్రజలను కోరుతున్నాం. తెలంగాణ ఉద్యమ సమయంలో సమ్మె చేసినప్పుడు కూడా దసరా పండుగ వచ్చింది. పండుగను వదులుకుని పోరాటం చేస్తున్నరని అప్పుడు కేసీఆర్ పొగిడిండు. గిప్పుడేమో దసరా పండుగ అని బదనాం చేస్తున్నండు. అరె నీ కోసం చేస్తే మంచింది...జనం కోసం చేస్తే చెడ్డదా? ఇదేం న్యాయం. సమస్యను పరిష్కరించాల్సింది పోయి బెదిరింపులకు దిగుతున్నది. ఇట్లాగే సీఎం చేస్తే ఉద్యమానికి యావత్ తెలంగాణ ప్రజల్లోకి తీసుకెళ్తం.

**- కె. హనుమంతు, టీజేఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి**

**ఎస్మాకు భయపడబోం...ఒక్కర్ని తీసేసినా ఊరుకోం**

ఎస్మాలకు,గిస్మాలకు భయపడేటోళ్లం కాదు. సొంతంగా తనకు నచ్చినోళ్ళను ఉద్యోగులుగా పెట్టే హక్కు సీఎంకు కాదుకదా ఎవ్వరికీ లేదు. ఒక్క ఉద్యోగి నియామకం చేపట్టాలంటే ఎంతో ప్రక్రియ ఉంటుంది. దాని ప్రకారం నడుచుకోవాలి. పీకేస్తాం...తీసేస్తాం అంటూ మాట్లాడితే చూస్తూ ఊరుకునేటోళ్లు ఇక్కడ ఎవ్వరూ లేరు. ఒక్క ఉద్యోగిని తొలగించి చూడమనండి...అప్పుడు మా సంగతేంటో తెలుస్తది. సీఎం ఇష్టమొచ్చినట్టు అహంకారపూరిత ధోరణితో మాట్లాడటం సరిగాదు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎంతో మా పాత్రా అంతే. ఆర్టీసీ సమ్మెతోనే తెలంగాణ ఉద్యమానికి ఊపొచ్చిన మాట వాస్తవం కాదా? సీమాంధ్ర పాలకుల పెత్తందారీ తనం కంటే ఈయన పెత్తందారీతనం , నియంతృత్వం ఎక్కువైంది. అప్పటి పాలకులు ఉద్యమాన్ని అణచివేస్తే కేసీఆర్ అనే వ్యక్తి ఎక్కడ ఉండేటోడు? అస్సలు సీఎం అయ్యేటోడా? తెలంగాణ ఉద్యమం అప్పుడు గుర్తుకురాని ప్రజల ఇబ్బందులు, చట్టాలు ఇప్పుడు గుర్తుకు వస్తున్నయా? ప్రజాస్వామిక పాలనలో ఉద్యమాలను గానీ, సమ్మెలను అణచివేసే హక్కు ఎవ్వరికీ లేదు. అదిరింపులకు, బెదిరింపులకు భయపడి ఎక్కడో ఒకరిద్దరు విధులకు హాజరయ్యారు తప్ప తొలిరోజు వంద శాతం సమ్మె విజయవంతమైంది. సమ్మెకు సహకరిస్తున్న ప్రజలకు, ఉద్యోగ, ప్రజా, కార్మిక సంఘాలకు ధన్యవాదాలు.

**- కె.రాజిరెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి**

**మొక్కుబడి చర్చలకు పిలిచి...బదనాం చేస్తరా?**

సమ్మె నోటీసు 35 రోజుల కిందట ఇస్తే ఆర్టీసీ యాజమాన్యంగానీ, లేబర్ డిపార్ట్‌మెంట్‌గానీ స్పందించలేదు. సమ్మెకు రెండు రోజుల ముందు ఏ అధికారమూ లేని ముగ్గురు సభ్యుల కమిటీతో ఏదో మొక్కుబడిగా చర్చలకు పిలిచారు. ఒక్క అంశంపైనా నిర్దిష్టంగా చర్చించలేదు. ఏదో ఆర్టీసీ కార్మికులే మొండిగా సమ్మెలోకి వెళ్లారనే విషప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల ముందు దోషులుగా నిలబెట్టే కుట్రకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకున్నది. ఉద్యమ నేపథ్యం నుంచి వచ్చిన సీఎం కేసీఆర్ ఇలా చేస్తాడని కార్మికులుగానీ, ప్రజలుగానీ ఏనాడూ ఊహించలేదు. సమ్మెను సాకుగా చూపి ఆర్టీసీని ప్రయివేటు శక్తులకు కట్టబెట్టే కుట్రకు రాష్ట్ర సర్కారు పూనుకున్నది. దీన్నీ మేం తిప్పికొడతాం. ఆర్టీసీకి ఇవ్వాల్సిన దాని కంటే ఎక్కువ నిధులు ఇచ్చామని సీఎం చెబుతున్నరు..? దేనికి ఎంత ఇచ్చారో సీఎం చెబితే? ఎలా ఇవ్వలేదో మేం చెబుతాం? దీనికి సీఎం సిద్ధమేనా? తప్పంతా ప్రభుత్వం దగ్గర పెట్టుకుని మా మీద ఆపవాదు మోపాలని చూడటం సరిగాదు.

**- వీ.ఎస్.రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి**

### కేసీఆర్‌ది అవకాశవాద రాజకీయం...ఆర్టీసీ ఆస్తులపై కన్ను

సీఎం కేసీఆర్‌ది పచ్చి అవకాశవాద రాజకీయం. ఆర్టీసీని ప్రయివేటీకరించే కుట్రకు తెరలేపారు. ఇప్పటికే వరంగల్‌లోని ఆర్టీసీ వర్క్‌షాపును బినామీ పేరుతో ఓ టీఆర్ఎస్ నేతకు కట్టబెట్టారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీని ప్రయివేటీకరించి తన సంబంధికులకు కట్టబెట్టే యత్నాలకు దిగారు. ఆర్టీసీకి చెందిన రూ.60 వేల కోట్ల ఆస్తులపై కేసీఆర్ కన్నుపడింది. అందుకే సమ్మె పట్ల ఇలా వ్యవహరి స్తున్నారు. జీతభత్యాల కోసం మేం సమ్మె చేయట్లేదు... ఆర్టీసీని, ప్రజారవాణాను బతికించుకునేందుకు పోరాడు తున్నాం. ఆర్టీసీ ఉంటేనే ఊర్లల్లో బస్సులు తిరుగుతు న్నయి..పిల్లలకు బస్సుపాసులుంటయి. కొత్తబస్సు లు కొనుక్కోవచ్చు. ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్న క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతు న్నా సమ్మెకు దిగాం. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు చింతిస్తున్నాం. మన్నించండి. మా సమ్మెకు మద్దతు తెలపండి. బెదిరింపులకు, అరెస్టులకు భయపడేది లేదు. కార్మికులను తొలగించాలంటే ముందు నన్ను తొలగించి ముందు కెళ్లాలి. అన్ని డిపోల ఎదుట ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికుల కుటుంబాలతో బతుకమ్మ పెద్దఎత్తున ఆడబోతు న్నాం. సోమవారం నాడు ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టబోతున్నాం.

**- అశ్వత్థామరెడ్డి, టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జేఏసీ కన్వీనర్**

# ఆర్టీసీ ప్రయివేటీకరణకు కుట్ర

## కార్మికుల సమ్మె న్యాయమైనదే

- వారికి సంపూర్ణ మద్దతు
- పీఎఫ్ డబ్బులు రూ.450కోట్లు వాడుకున్న సర్కార్: సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు



మాట్లాడుతున్న సాయిబాబు

**నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్/ హైదరాబాద్**

ఆర్టీసీని ప్రయివేటుపరం చేయటానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబు అన్నారు. కార్మికులు సమ్మె న్యాయబద్ధమైందని, యూనియన్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు చెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 9,500 గ్రామాలకు సుమారు 90 లక్షల మంది ప్రయాణికులను నిత్యం గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీని నిర్వీర్యం చేయాలనుకోవడం సరికాదన్నారు. సమ్మె అనుకోకుండా చేయడం లేదని, నెల రోజుల ముందే నోటీసు ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ఆర్టీసీ కార్మికులు జమ చేసుకున్న పీఎఫ్ డబ్బులు రూ.450 కోట్లను ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమన్నారు. బస్సులకు సరిపడా డ్రైవర్లను నియమించకుండా ఉన్న కార్మికులపై ఒత్తిడి పెంచడంతో వారు ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని వాపోయారు. సమ్మె పరిష్కారానికి త్రిసభ్య కమిటీ వేసిన ప్రభుత్వం.. ఎలాంటి హామీ ఇవ్వకుండా కావాలనే కార్మికులను రెచ్చగొడుతూ ఆర్టీసీ మనుగడకే ముప్పు తీసుకొస్తోంన్నారు. సమ్మె పట్ల ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. అనుభవం లేని డ్రైవర్లతో బస్సులను నడిపిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడొద్దని హెచ్చరించారు. సమ్మెలో ప్రత్యక్షంగా సీఐటీయూ నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు.

**ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతివ్వండి : సీఐటీయూ**

టీఎస్ ఆర్టీసీ పరిరక్షణ కోసం 50 వేల మంది కార్మికులు చేస్తున్న సమ్మెకు రాష్ట్ర ప్రజానీకం మద్దతు తెలపాలని సీఐటీయూ కోరింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం.సాయిబాబు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేండ్ల నుంచి ఆర్టీసీ భక్షణకు రాష్ట్ర సర్కారు పూనుకున్నదనీ, దానిలో భాగంగానే సీసీఎస్ డబ్బులు రూ.580 కోట్లు, పీఎఫ్ డబ్బు రూ.860 కోట్లు కూడా వాడుకున్నదని విమర్శించారు. కార్మికుల ఒప్పందం 30 నెలల ముందు ముగిసిపోయినా దాని గురించి మాట్లాడటమే లేదని పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీకి సంక్రమించిన అప్పు రూ.2,056 కోట్లు అనీ, ఇది 2018-19 నాటికి రూ.4,704 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. చాసిస్ మీద గతంలో 14.5% వ్యాట్ స్థానంలో జీఎస్టీ 28 శాతం అయిందనినీ, బస్ బాడీ నిర్మాణానికి గతంలో ఐదు శాతం ఉంటే వ్యాట్ నేడు జీఎస్టీ 28 శాతం అయిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్సి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టాయని తెలిపారు. 2018-19లో పాస్‌ల రీయింబర్స్‌మెంట్ కోసం ఆర్టీసీ రూ.664 కోట్లు ఇవ్వాలని కోరగా, 130 కోట్లు మాత్రమే విడుదల చేసిందని పేర్కొన్నారు. బస్సుల సంఖ్యను పెంచకపోవడం, సిబ్బందిని భర్తీ చేయకపోవడం ఆర్టీసీ పరిరక్షణ ఏవిధంగా అవుతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఐదేండ్లలో ఆర్టీసీ పన్నుల రూపంలో రూ.3921 కోట్లు చెల్లించిందనీ, అప్పులు, ఫాయిదా, వడ్డీ చెల్లింపులకు మరో రూ.3900 కోట్లు ఇచ్చిందని తెలిపారు. ఆ రెండు భారాలు తగ్గిస్తే వేలాది కోట్లు ఆర్టీసీకి మిగులు నిధులు ఉంటాయని తెలిపారు.

**ఆర్టీసీ సమ్మెకు అంగన్‌వాడీ, మున్సిపల్, గ్రామపంచాయతీ వర్కర్ల మద్దతు**

ఆర్టీసీ పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న పోరాటానికి తాము మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్(టీచర్స్), హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పద్మ, పి.జయలక్ష్మి, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.గణపతిరెడ్డి, ఐ.శ్రీపతిరావు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖమర్‌అలీ, పాలడుగు భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మెకు సంఘీభావంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ పట్టణ కేంద్రాల్లో ఆది, సోమవారాల్లో సంఘీభావ ప్రదర్శనలు చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు.ఉద్యోగులపై బెదిరింపులకు దిగటం, సమ్మెపై నిర్బంధం ప్రయోగించడం అత్యంత అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్లనే కాకుండా ఐసీడీఎస్‌లోని అంగవాడీ టీచర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు, మున్సిపల్, గ్రామపంచాయతీ కార్మికుల విషయంలోనూ ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకు వెళ్తున్నదనీ, ఇది మంచి ధోరణి కాదని పేర్కొన్నారు.

## ఆర్టీసీ కార్మికులను అణచివేయొద్దు : న్యూడెమోక్రసీ

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెను నివారించేందుకు చర్యలు చేపట్టకుండా కార్మికులను అణనివేసే విధానాలకు పాల్పడొద్దని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రభుత్వానికి సూచించింది. ఈ మేరకు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె గోవర్ధన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అరెస్టు చేసిన కార్మికులు, నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ పరిరక్షించాలని కోరారు. సమ్మెను విరమించి విధులకు హాజరుకాకపోతే ఉద్యోగాల నుంచి తీసివేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం బాధ్యతారహితమని విమర్శించారు. సమ్మె చేస్తే ఉద్యోగాలు పోతాయనే భయానక వాతావరణాన్ని సృష్టించకుండా కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు, సంప్రదింపులు జరపకుండానే నిరంకుశంగా మాట్లాడ్డం సరైంది కాదని తెలిపారు.

## విద్యావాలంటీర్ల జీతాలు చెల్లించాలి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యావాలంటీర్లకు ప్రభుత్వం జీతాలు చెల్లించాలని తెలంగాణ విద్యావాలంటీర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మఠం శివానందస్వామి, ప్రధాన కార్యదర్శి జోగినాథ్ యాదవ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రూ.75.17 కోట్లు విడుదల చేసి ఐదు రోజులైందని తెలిపారు. కానీ సంబంధిత జిల్లా స్థాయి అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యావాలంటీర్ల బ్యాంకు అకౌంట్లలో జీతాలు జమ కాలేదని పేర్కొన్నారు. దసరా పండుగపూట ఐదు నెలల వేతనాలు లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించినా జీతాలు రాలేదని పేర్కొన్నారు. వెంటనే జీతాలు బ్యాంకు అకౌంట్లలో వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆర్టీసీ కార్మికులను అరెస్టులకు ఐఎఫ్‌టీయూ ఖండన

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి జి అనురాధ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను సానుకూల వైఖరితో స్పందించి పరిష్కారం చేయాల్సిన బాధ్యత కేసీఆర్ ప్రభుత్వంపై ఉందని తెలిపారు. కనీస నిర్ణయాధికారం లేని త్రిసభ్య కమిటీ జేఏసీ నేతలతో తూతూమంత్రంగా చర్చలు జరిపిందని పేర్కొన్నారు. చర్చలు విఫలం కావడానికి ప్రభుత్వ విధానమే కారణమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి ప్రజాప్రయోజనాల కోసం ఆర్టీసీ సంస్థ పరిరణక్ష కోసం జేఏసీ నేతలతో తక్షణం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# తీవ్ర ఆరోపణలున్న కేసుల్ని వదిలేయమన్నాడు!

## విధి నిర్వహణలో తీవ్రంగా జోక్యం చేసుకొనేవాడు

- మాట వినకుంటే.. తప్పుడు కేసుల బనాయింపు..
- తన చర్యలతో మోడీ తీవ్రంగా ఇబ్బంది పెట్టేవాడు!
- సీబీడీటీ చైర్మెన్‌పై ముంబయి ఐటీ ఆఫీసర్ ఫిర్యాదు
- ఆర్థిక మంత్రి, పీఎంవో, సీవీసీ, క్యాబినెట్‌కు లేఖలు



పి.సి. మోడీ

**న్యూఢిల్లీ:** ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డులో (సీబీడీటీ) అత్యున్నత అధికారిపై మొట్టమొదటిసారిగా తీవ్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తన విధి నిర్వహణలో సీబీడీటీ చైర్మెన్ పి.సి. మోడీ వివిధ రకాలుగా జోక్యం చేసుకొంటూ ఇబ్బందిపెట్టారంటూ ముంబయిలోని ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్(యూనిట్-2) అల్కా త్యాగీ ఒక ఫిర్యాదులో ఆరోపించారు. 1984 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారిణి అయిన అల్కా త్యాగీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పంపిన తొమ్మిది పేజీల ఫిర్యాదు లేఖలో మోడీపై పలు ఆరోపణలను వెలుగులోకి తెచ్చారు. వివిధ ఫిర్యాదుల కూర్పుతో త్యాగీ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో), సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ), మంత్రి మండలికి ఫిర్యాదు లేఖలనూ పంపారు. విధి నిర్వహణలో మోడీ తనపై వివిధ రూపాల్లో తీవ్ర ఒత్తిళ్లను తీసుకువచ్చేవారని త్యాగీ ఆరోపించారు. తీవ్రమైన ఆరోపణలున్న కేసులను, సున్నితమైన కేసులను వదిలేయాలని ఆదేశాలు జారీ చేసేవారని కంప్లయింట్‌లో పేర్కొన్నారు. తన విధి నిర్వహణలో విపక్ష నేతలకు వ్యతిరేకంగా, కఠినంగా వ్యవహరించడం వల్లే.. తన అత్యున్నత ఉద్యోగ స్థానాన్ని పదిలంగా నిలుపుకోగలిగానంటూ మోడీ తరుచూ గర్వంగా చెప్పుకొనేవాడని త్యాగీ ఆరోపించారు. ఈ విషయాన్ని ఆంగ్ల మీడియా ఒకటి వెలుగులోకి తెచ్చింది. దీంతో ఈ విషయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**బ్లాక్‌మెయిల్ చేసేవాడు..**

త్యాగీ కార్యాలయం ఐసీఐసీఐ బ్యాంక్ క్విడ్‌ప్రోకో కేసు, నల్లధనం చట్ట కింద ముకేశ్ అంబానీ కుటుంబ సభ్యుడి కేసు, జెట్ ఎయిర్‌వేస్‌లో నిధుల మళ్లింపు వంటి పలు ముఖ్యమైన కేసులపై విచారణ జరుపుతోంది. తీవ్ర ఆరోపణలున్నప్పటికీ సున్నితమైన కేసు దర్యాప్తును నిలిపేయాల్సిందిగా సీబీడీటీ చైర్మెన్ పీసీ మోడీ తరుచూ తనను ఒత్తిడి చేసేవారని త్యాగీ ఫిర్యాదులో పేర్కొన్నారు. మే నెల చివరికల్లా దర్యాప్తును నిలిపేయాల్సిందిగా గడువునూ నిర్దేశించారని ఆరోపించారు. ఆయన ఆదేశాలు ఆశ్చర్యానికి గురిచేసేవైనా.. దర్యాప్తు నిలిపేయబోమని కష్టంగా జవాబు చెప్పాల్సి వచ్చేదని వివరించారు. అంతేకాదు, ఆ సున్నితమైన కేసుకు సంబంధించి తన పేరు ఎక్కడా ఉండకూడదని, కనీసం సంప్రదించినట్టు కూడా పేర్కొనరాదని హెచ్చరించేవారని తెలిపారు. సదరు ఫైల్ క్లోజ్ చేయడానికి తీవ్ర ఒత్తిడి చేశారని వివరించారు. తన మాట వినకుంటే కఠిన చర్యలుంటాయని గుర్తు చేసి వేధించేందుకు మోడీ ప్రయత్నించేవారని త్యాగీ తెలిపారు. తనపై ఉన్న పాత విజిలెన్స్ కేసును ఆయుధంగా చేసుకొని తనను మోడీ బ్లాక్‌మెయిల్ చేసేవారని తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే, ఆ కేసులో పీసీ మోడీనే తనకు ఆల్‌క్లియర్ నివేదికను అందించారనీ.. అయినప్పటికీ దానిని తరుచూ గుర్తుచేస్తూ తనకు రావాల్సిన మంచి పోస్టింగ్‌ను నిలిపేసేవారని ఫిర్యాదులో త్యాగీ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఒప్పుకోకపోతే ఇబ్బందిపెట్టేవారు..**

ఒకసారి సమాచారం అందినాక.. చర్యలు తప్పక తీసుకోవాల్సి ఉంటుందని..ఈ విషయమై పీసీ మోడీని ఒప్పించేందుకు నానావిధాలుగా కష్టపడే వాళ్లమని త్యాగీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా చర్యలు తీసుకోకుంటే తమ వృత్తిగత జీవితానికే నష్టమని తెలిసినా.. ఒత్తిడి చేసేవారని వివరించారు. తన డిమాండ్లకు తలవంచని ఉద్యోగులపై ఆయన కొత్తగా ఫిర్యాదులు సృష్టించి తీవ్ర ఇబ్బందులు పెట్టేవారని తెలిపారు. ఇలాంటి విషయాలు చెప్పాల్సిన రోజు వస్తుందని ఎప్పుడూ అనుకోలేదనీ, సీబీడీటీ చైర్మెన్ పీసీ మోడీ అనైతిక, సందేహాస్పద వైఖరి వల్లే ఈ విషయాలు బయటకు చెప్పాల్సి వచ్చిందని వివరించారు. ఇదే లేఖలో తన కుటుంబానికి సంబంధించిన ఒక బ్యాంక్ లావాదేవీపై విజిలెన్స్ విచారణ వివరాలను పేర్కొన్నారు. దానిపై ఈడీ, సీబీఐ, సీబీడీటీ కూడా దర్యాప్తు చేసిందనీ, చివరకు ఎలాంటి అవకతవకల్లేవని నివేదికలిచ్చాయన్న విషయాన్ని త్యాగీ తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ ఫిర్యాదులు అందిన రెండు నెలలకు పీసీ మోడీ జాబ్ పొజిషన్‌ని మరో ఏడాది మోడీ సర్కారు పొడిగించడం గమనార్హం. మోడీ చర్యలతో ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా పోస్టింగ్ అవ్వాల్సిన త్యాగీ.. నాగపూర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఐటీ(ట్రెయినింగ్)గా పంపడం కొసమెరుపు.

**ఆంధ్రప్రదేశ్**

## మద్యం ధరలకు తలుపులు 'బార్లా'

- ప్రభుత్వం పెంచింది రూ. 10
- బార్లలో పెరిగింది 40 రూపాయలు

**అమరావతి :** ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మద్యం విధానం వినియోగాన్ని ఎంతవరకు తగ్గించిందో కానీ, ధరలు మాత్రం భారీగా పెరగడానికి కారణమైంది. బార్లలో ఎంఆర్‌పితో సంబంధం లేకుండా భారీగా పెంచేస్తున్నారు. సర్కారు మద్యం దుకాణాలను ప్రారంభించిన సమయంలోనే కొంత మేరకు ధరలను పెంచిన విషయం తెలిసిందే. సాధారణ మద్యం క్వార్టర్ బాటిల్‌పై పది రూపాయలు, ఫుల్ బాటిల్‌పై 40 రూపాయలు చొప్పున పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్త ధరలు అమలులోకి రాకముందే, పాత సీసాలపై ఉన్న ధరలకు అదనంగా వసూలు చేస్తూ ఎక్సయిజ్‌శాఖే ఉల్లంఘనకు పాల్పడు తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం క్వార్టర్ బాటిల్‌పై పది రూపాయలే పెంచగా, బార్లలో 30 రూపాయలు వసూలు చేస్తున్నారు. సౌకర్యాలు కల్పిస్తున్నందు వల్లనే అదనంగా 30 వసూలు చేస్తున్నట్లు వారు చెబుతుండగా, ఈ సౌకర్యాలు గతంనుంచి ఉన్నవేనని, మరి కొత్తగా ఎందుకు అదనంగా వసూలు చేస్తున్నారంటూ వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. బార్లలో ఫుల్ బాటిల్ ధరలు కళ్లు బైర్లు కమ్మేలా ఉన్నాయి, . అక్టోబర్ ఒకటో తేదీ వరకు బాటిల్‌పై ఉన్న ఎమ్మార్పీ ధర కన్నా దాదాపు వంద రూపాయలు అదనంగా వసూలుగా చేయగా అక్టోబర్ రెండు నుంచి 225 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అంటే ప్రభుత్వం 40 రూపాయలు పెంచితే... బార్లలో 125 రూపాయలను ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. త్వరలోనే బార్లపైనా ఒక విధానాన్ని ప్రకటించి బార్ల సంఖ్యను తగ్గిస్తారన్న ప్రచారం నేపథ్యంలో ఇప్పటినుంచే బార్లలో వసూళ్లను పెంచేసారని తెలుస్తోంది.




# ఆరోగ్య బీమా తప్పనిసరి

## పెట్టుబడి పెట్టలేనివారికి యూఎస్‌లో స్థానం లేదు

- కొత్త ఆదేశాలపై ట్రంప్ సంతకం



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. అమెరికాకు వస్తున్న వారందరికీ తప్పనిసరిగా ఆరోగ్య బీమా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లుపై ఆయన సంతకం చేశారు. ఒకవేళ, హెల్త్ ఇన్స్యూరెన్స్ లేకుండా యూఎస్‌లో ప్రవేశించే వలసదారులు తప్పనిసరిగా 30 రోజుల్లోనే ఆరోగ్య బీమా సౌకర్యాన్ని పొందాల్సి ఉంటుందని వైట్ హౌస్ తన తాజా ఆదేశాల్లో పేర్కొంది. హెల్త్ కేర్ కోసం పెట్టుబడి పెట్టలేని వారికి తమ దేశంలో స్థానం లేదని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. వచ్చే నెల నవంబర్ 3 నుంచి ఈ నిర్ణయం అమలు లోకి వస్తుందని చట్టబద్ధంగా దేశంలోకి ప్రవేశించేవారికి ఈ ఆదేశాలు అడ్డుకాబోవని వైట్ హౌస్ ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, 2020 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 18 వేల మంది శర ణార్థులను మాత్రమే అమెరికాలో పునరావాసం కోసం అనుమతించాలని ట్రంప్ యంత్రాంగం గత నెలలో తెలిపింది. మోడ్రన్ రెఫ్యూజీ ప్రోగ్రామ్ ప్రారంభమైన తర్వాత ఓ సంవత్సరంలో అమెరికాలో వలసదారుల సంఖ్యను ఇంత తక్కువకు కుదించడం ఇదే తొలిసారి.

## ఈక్వెడార్‌లో చమురు నిరసనలు

- ధరలను తగ్గించాలని ప్రజల డిమాండ్



**క్విటో:** ఈక్వెడార్‌లో నిరసనలు వెల్లువెత్తాయి. చమురు ధరల పెంపును నిరసిస్తూ ఆందోళనలు ప్రారంభమయ్యాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. వందలాది మంది రోడ్లపైకి చేరుకొని ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. చమురు ధరలను ప్రభుత్వం తగ్గించేంత వరకు తమ ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. నిరసనకారులపై పోలీసులు బాష్పవాయుగోళాలు ప్రయోగించారు. 350 మంది నిరసనకారులను అరెస్ట్ చేసినట్టు ప్రభుత్వం ధ్రువీకరించింది. అల్లర్లను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపింది. నిరసనకారులు తక్షణమే ఆందోళన కార్యక్రమాలను విరమించుకోవాలని అధ్యక్షుడు లెనిన్ మొరెనో దేశ ప్రజలను కోరారు. అతి త్వరలో పన్నుల చెల్లింపు విధానంలో సంస్కరణలు చేపడతామని అన్నారు. చమురు సంస్థలకు సబ్సిడీ అందజేయలేమని తేల్చి చెప్పారు.

## స్పేస్‌వాక్‌కు సిద్ధమైన మహిళా వ్యోమగాములు..



**వాషింగ్టన్:** ఆరు నెలల కిందట మహిళా వ్యోమగాములు స్పేస్‌వాక్‌కు ప్రయత్నించినా అది విజయవంతం కాలేదు. మరో ప్రయత్నానికి స్పేస్‌వాక్ సిద్ధమైంది. ఇద్దరు మహిళా వ్యోమగాములు తొలిసారి స్పేస్‌వాక్ చేయనున్నారు. క్రిస్టియన్ కోచ్, కొత్త వ్యోమగామి జెస్సికా మెయిర్ అనే ఇద్దరు వ్యోమగాములు స్పేస్‌వాక్‌లో పాల్గొనున్నారు. ఈనెల 21న వీరిద్దరు వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో స్పేస్‌వాక్ చేయనున్నారు. ఈ ఇద్దరూ ఐఎస్ఎస్‌కు కొత్త బ్యాటరీలను అమర్చుతారు. బ్యాటరీలను మార్చేందుకు మొత్తం ఐదు సార్లు స్పేస్‌వాక్ చేయనున్నారు. కాగా, దాంట్లో ఓ సారి కేవలం మహిళా వ్యోమగాములు మాత్రమే పాల్గొననున్నారు. మహిళా వ్యోమగాములు స్పేస్‌వాక్ చేయడం ఓ మైలురాయిగా నిలుస్తుందని నాసా డిప్యూటీ చీఫ్ మేగన్ మెక్ ఆర్థర్ అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగాల కల్పనలో ట్రంప్ సర్కారు విఫలం

**వాషింగ్టన్:** ఉద్యోగ అవకాశాలు కల్పించుట, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడంలో ట్రంప్ సర్కారు విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను అధికారంలోకి వచ్చినట్టయితే స్థానిక యువతకే ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ఎన్నికల ప్రచారంలో రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేసిన ట్రంప్ ఊదరగొట్టారు.

వలసదారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. వీసాల జారీలో కఠినతర నిబంధనలు తీసుకొచ్చారు. సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. అమెరికాలో విద్యనభ్యసించేందుకు వస్తున్నవారి కారణంగానే నిరుద్యోగ సమస్య తలెత్తుతోందంటూ ప్రజలను మభ్యపెట్టారు. రానున్న అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందుతానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాతే అమెరికాలో నిరుద్యోగ సమస్య తగ్గిందని మరోసారి ఊదరగొట్టేందుకు ట్రంప్ సర్కారు ప్రయత్నించడం




గమనార్హం. అమెరికాలో నిరుద్యోగ రేటు 50 ఏండ్ల కనిష్టానికి తగ్గి 3.5 శాతానికి చేరుకుందని ప్రకటించింది. సెప్టెంబరులో లక్షన్నర కొత్త ఉద్యోగాల కల్పన, దేశ ఆర్థిక రంగానికి చేయూతనిచ్చిందని పేర్కొంది. సెప్టెంబరు నెలలో సృష్టించబడిన ఉద్యోగాలే కాకుండా ఈ సంవత్సరం జులై, ఆగస్టు నెలలో 45వేల ఉద్యోగాలు యువతకు కల్పించామని వైట్‌హౌస్ పేర్కొంది.

## గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన ఆస్ట్రేలియన్లు విడుదల



**సిడ్నీ :** గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన ఆస్ట్రేలియన్లను ఇరాన్ విడుదల చేసిందని ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి మెరైస్ పైనీ వెల్లడించారు. ఆస్ట్రేలియా, ఇరాన్ మధ్య ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఆ దేశ విదేశాంగ మంత్రితో సంప్రదింపులు జరిపామని అన్నారు. పెర్త్ నగరానికి చెందిన జోలీ కింగ్, మార్క్ ఫర్కిన్ ఆస్ట్రేలియా నుంచి బ్రిటన్‌కు ప్రయాణం చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. రెండు దేశాల మధ్య జరిగిన ప్రయాణాన్ని ఓ డాక్యుమెంట్‌గా చిత్రీకరించారు. కిర్గిస్థాన్ నుంచి పాకిస్థాన్‌లో మూడు నెలల పాటు గడిపారు. అక్కడ ఎవరెవరిని సంప్రదించారనే విషయాలను మాత్రం బహిర్గతం చేయలేదు. పలు సైనిక శిబిరాల వద్ద గస్తీ నిర్వహించిన అక్కడ తీసిన ఫొటోలను, వీడియోలను ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేశారు. ఓ డ్రోన్ కొనుగోలు కోసం కూడా వీరిద్దరూ ప్రయత్నించినట్టు ఇరాన్ ఆరోపించింది. వీరిద్దరి చర్యలపై అనుమానం వ్యక్తం చేసింది. ఈఏడాది జులైలో ఇరువురిని అరెస్ట్ చేయాలని ఆదేశించింది. ఇరాన్ జాతీయ భద్రతకు సంబంధించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసి గూఢచర్యానికి పాల్పడ్డ కేసులో వీరిద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటించింది.

## ఆస్పత్రి నుంచి శాండర్స్ డిశ్చార్జ్



**వాషింగ్టన్:** హృదయ సంబంధిత అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఆశావహ అభ్యర్థి బెర్నీ శాండర్స్ డిశ్చార్జ్ అయ్యారు.శుక్రవారం సాయంత్రం నేవాడా ఆస్పత్రి వైద్యులు ఆయనను ఇంటికి పంపించినట్టు ప్రకటించారు. 78 ఏండ్ల బెర్నీ శాండర్స్ ఈ వారం ప్రారంభంలో అస్వస్థతకు గురైన ఆయనను డిసెర్ట్ స్ప్రింగ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి భారత సంతతికి చెందిన వైద్యుడు డాక్టర్ అర్జున్ గురురాజ్ పరీక్షించి మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్‌తో బాధపడుతున్నట్టు తెలిపారు. సెనేటర్ శాండర్స్ ధమనుల్లో ఏర్పడిన అడ్డంకిని శస్త్రచికిత్స ద్వారా తొలగించినట్టు ఆయన ప్రచార బృందం ప్రకటించింది.ఈ నేపథ్యంలో శాండర్స్ పాల్గొనాల్సిన అన్ని రకాల ప్రచార కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది.ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత శాండర్స్ ఒక ప్రకటన విడుదల చేశారు.డిసెర్ట్ స్ప్రింగ్స్ ఆస్పత్రి వైద్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రిలో ఉన్న రెండున్నర రోజుల సమయంలో తనను కంటికి రెప్పలా చూసుకున్నారని శాండర్స్ కొనియాడారు. స్వల్ప విశ్రాంతి అనంతరం మళ్లీ తన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొంటానని ఆయన వెల్లడించారు.అలాగే తాను త్వరగా కోలుకోవాలని కోరుకున్న అభిమానులు, పార్టీ మద్దతుదారులకు శాండర్స్ కృతజ్ఞతలు తెలిపారు. తాను కోలుకుంటున్నానని ఆయన ట్వీట్ చేశారు.

# ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

## ఐరాస, అనుబంధ సంస్థల మధ్య సహకారం పెరగాలి : భారత్

**వాషింగ్టన్:** ఉగ్రవాదాన్ని నిర్మూలించుటలో ఐరాస, అనుబంధ సంస్థల మధ్య సహకారం మరింత పెరగాలని భారత్ సూచించింది. ఉగ్ర సంస్థలకు నిధులు సమకూర్చడంలో భాగంగా మాదక ద్రవ్యాల సరఫరా సరిహద్దుల గుండా పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. వీటిని అరికట్టడానికి ఐరాస, అనుబంధ సంస్థలు మరిన్ని పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఐరాస సాధారణ సభలో సామాజిక, మానవ హక్కుల విభాగం జరిపిన సదస్సులో భారత ప్రతినిధి పాలోమీ త్రిపాఠి మాట్లాడారు. ఉగ్రవాదులకు సహకరించడంలో భాగంగా సరిహద్దుల గుండా కొన్ని మూకలు నకిలీ కరెన్సీ, మనీలాండరింగ్, అక్రమ ఆయుధ సరఫరా, మాదక ద్రవ్యాల సరఫరా లాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని హెచ్చరించారు. యువతను



ఉగ్రవాదంపైపు ఆకర్షించేందుకు మాదకద్రవ్యాలను ఎరగా చూపుతున్నారని తెలిపారు. ఉగ్రవాదులకు ఊతమిచ్చే మూకలను నిలువరించేందుకు మరిన్ని కఠిన నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ నేపథ్యంలో దేశాల మధ్య నిఘా సంబంధిత సమాచార మార్పిడిలో సైతం వేగం పెరగాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. అలాగే పౌర సమాజం, ప్రయివేట్ రంగంతోనూ భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. అప్పుడే ఉగ్రవాదుల ఆగడాలను ఆటకట్టించే అవకాశం ఏర్పడుతుందన్నారు.

# వ్యవ'సాయం' అంతా పెండింగే

## రైతు సంక్షేమంటూనే సర్కారు నిర్లక్ష్యం

- నిధుల ఎగనామం
- గల్లా పెట్టె ఖాళీతో ముందుకు సాగని పథకాలు

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

రైతుల సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలకు నిధుల కొరత వెంటాడుతున్నది. రైతు బంధు, పావలావడ్డీ, రుణమాఫీ, డ్రిప్, వ్యవసాయ యాంత్రీకరణ, ఆర్‌కేఈవై పథకాలకు కేటాయించిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. రైతాంగానికి ప్రయోజనం కలిగే పథకాలకు నిధులు విడుదల చేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రైతు పథకాల గురించి ఉదరగొట్టిన అధికార పార్టీ... ఆ పథకాలకు నిధులను మాత్రం విడుదల చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో అమలుకు చాలా వ్యత్యాసం కనిపిస్తున్నది. వందల కోట్లు కూడా విడుదల చేయలేదు.

ఫలితంగా రైతులు తమ ప్రయోజనాలను కోల్పోవాల్సి వస్తున్నది. రైతుబంధు, రుణమాఫీ, పంట బీమా, వడ్డీలేని రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల్లో చెల్లించాల్సిన రాష్ట్ర వాటా చెల్లింపులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. నిధుల విడుదలలో జాప్యంతో రైతులకు మరిన్ని కష్టాలు మొదలయ్యాయి.

**అందని పంట బీమా పరిహారం**

రైతులు పండించిన పంట ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకం అమలు చేస్తోంది. దీనికి సంబంధించి బీమా ప్రీమియంతో రైతు వాటా పోను మిగతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం వాటా ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకునేప్పుడే పంట బీమా ప్రీమియం మినహాయించుకుని చేసుకుని రుణాలు ఇస్తారు. ప్రభుత్వాలు తమ వాటా చెల్లించకపోవడం, మరోవైపు బీమా కంపెనీల నిర్లక్ష్యంతో పంట నష్ట పరిహారం అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 2018 ఖరీఫ్ పంటల బీమా పథకం సంబంధించి రాష్ట్ర






ప్రభుత్వం వాటా రూ 200కోట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. ఏడాదైనా ప్రభుత్వం చెల్లించక పోవడంతో గత ఏడాది ఖరీఫ్‌కు సంబంధించిన పంట బీమా పరిహారం రైతులకు అందలేదు. గతేడాది 2017కు సంబంధించి పంట బీమా పరిహారం కూడా ఇప్పటి వరకు అందడం లేదని డోర్నకల్ మండలానికి చెదిన వందలాది మంది రైతులు వారానికి ఒక్కసారి వ్యవసాయశాఖ కమిషనరేట్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు.

**ఆర్‌కేవీవైై ఆగమాగం**

వ్యవసాయ యాంత్రీకరణ, పంట తెగుళ్ల నివారణ, ఉద్యానవన అభివృద్ధి, పరిశోధన, పశుపోషణ, పాల కేంద్రాలు, చేపల పెంపకం, పట్టుపురుగుల పెంపకం తదితర పథకాలకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ క్రిషీ వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తుంది. కేంద్రం వాటా 60శాతం, రాష్ట్రం వాటా 40శాతం ఇవ్వాల్సి ఉన్నది. కేంద్ర ప్రభుత్వం మొదటి విడత వాటా చెల్లిస్తున్నా... కానీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత నిధులు రావడం లేదు. గత నాలుగేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌కేవీవైకి నిధులు కేటాయించకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నది. దీంతోపాటు ఖర్చుల వివరాలు వెల్లడించక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రూ 600 కోట్లుకు పైగా నిధులు నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రం నిధులు ఇవ్వక, కేంద్రం నిధులు రాక ఇబ్బంది ఎదురవుతున్నది. దీంతో రైతాంగానికి ఉపయోగపడే కార్యక్రమాలకు వెచ్చించే ఆర్‌కేవీవై పథకం నిరుపయోగంగా మారిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఆడియాశలైన రైతు బంధు

**రాష్ట్రంలో ఖరీఫ్ పంట పెట్టుబడి సాయం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నది. రైతుబంధు పథకం కింద 56.75లక్షల మందికి అమలు చేస్తున్నది. దీని కోసం రూ 7254కోట్లు కావాల్సివుంది. ప్రభుత్వం ఇప్పటి వరకు 42లక్షల మంది రైతులకు రూ 4862కోట్లు మాత్రమే చెల్లించింది. బడ్జెట్‌లో మాత్రం రూ 6900కోట్లు కేటాయించినా, నిధులు మాత్రం ఇవ్వలేదు. మరో 13.50 లక్షల మందికి రైతు బంధు అందనేలేదు. దీని కోసం రూ 2వేల కోట్లు అవసరం ఉన్నది.**



### రైతు రుణమాఫీ

**రైతు రుణమాఫీ ప్రకటించి బడ్జెట్‌లో మొదటి విడత నిధులు రూ 6000కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు పైసా విడుదల చేయలేదు. దీంతో 48.14లక్షల మందికి రూ 31.824కోట్లు ఇప్పటి వరకు అమలు కాకుండా పెండింగ్‌లోనే కొనసాగుతున్నది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణమాఫీ అమలు చేయకపోవడంతో పంట బీమా, వడ్డీలేని రుణాలపై ప్రభావం పడుతున్నది. బ్యాంకులు రుణాలు ఇవ్వక పోవడంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద తీసుకున్న అప్పులతో రైతులు సతమతమవుతున్నారు.**

### వడ్డీలేని రుణాలకు మోక్షమెప్పుడో

**బ్యాంకులో రైతు తీసుకున్న రుణాన్ని ఏడాదిలోపు చెల్లిస్తే వడ్డీ చెల్లించాల్సిన అవసరం ఉండదు. బ్యాంకులు సాధారణంగా వసూలు చేసే వడ్డీ మొత్తంగా 7శాతం. కేంద్ర ప్రభుత్వం 3శాతం, రాష్ట్ర ప్రభుత్వం 4శాతం వడ్డీ కింద బ్యాంకులకు చెల్లిస్తాయి. దీంతో రైతుకు వడ్డీ లేని రుణం అమలవుతున్నది. అయితే గత నాలుగేండ్లుగా రైతులకు అందించాల్సిన వడ్డీలేని రుణాలను ప్రభుత్వం చెల్లించక పోవడంతో పేరుకుపోయాయి.**

**2015-16 నుంచి 2018-19 వరకు నాలుగేండ్లుగా రూ 815 కోట్ల పావలా వడ్డీ, వడ్డీలేని రుణాల బకాయిలను ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించకపోవడంతో రైతుల నుంచి బ్యాంకులు బలవంతంగా వసూలు చేసుకున్నాయి. వడ్డీ ప్రభుత్వం చెల్లిస్తున్నదని ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో మాట ఇచ్చిన సంగతి తెలిసిందే.**

## ఆర్టీసీ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి

- ఢిల్లీ మీడియాతో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



**నవ తెలంగాణ న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణలో సమ్మె చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమస్యలపై టీఆర్ఎస్ సర్కారు తక్షణమే దృష్టి సారించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. కార్మికులు సమ్మె విరమించేలా ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులు ఏండ్లుగా తమ హక్కుల కోసం పోరాడుతున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వారికి ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని అన్నారు. కార్మికుల విషయంలో సర్కారు మాత్రం ఒంటెత్తు పోకడలతో సమస్యని మరింత జఠిలం చేయడం సముచితం కాదన్నారు. కనీసం కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరిపే సమయం లేదా అని ఆయన నిలదీశారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుండా కాలయాపన చేశారన్నారు. కార్మికులను అరెస్ట్ చేస్తే తెలంగాణలో ఉన్న జైళ్లు సరిపోవన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సాధ్యం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు ఏమాత్రం సహేతుకం కాదన్నారు.

ఇటీవల పీఎం మోడీని కలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో యురేనియం తవ్వకాలు ఆపాలని ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. ఇక గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం విషయం ఎందుకు ప్రస్తావించలేదన్నారు. మూకదాడులపై ప్రధాని మోడీకి లేఖ రాసిన 49 మంది మేధావులపై ప్రభుత్వం దేశద్రోహం కేసు బనాయించడం దారుణమన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాన్ని దేశ ప్రధానికి లేఖ రాయడం కూడా తప్పేనా? అని అడిగారు.

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన భారత్‌లో ఇలాంటి చర్యలు సరైనవి కావన్నారు. ఇప్పటికైనా కేసు పెట్టిన వారిపై అభియోగాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్యాగ్రహం ఉద్యమంలోనే జాతిపిత మహాత్మా గాంధీ రౌలత్ వంటి దేశద్రోహ చట్టాలను వ్యతిరేకించినట్టు గుర్తు చేశారు. అలాంటి నేత 150వ జయంతి ఉత్సవాలు జరుగుతున్న తరుణంలో అదే చట్టాన్ని దుర్వినియోగం చేయడంపై దేశవ్యాప్త చర్చ జరగాలని అన్నారు.

## ఆర్టీసీ కార్మికులతో పెట్టుకుంటే మసైపోతారు

- సర్కారుకు జీవన్‌రెడ్డి హెచ్చరిక



**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

ఆర్టీసీ సమ్మె నివారణకు చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతున్నదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఉద్యమంలోనే వారి సత్తా ఏమిటో చేశారనీ, వారితో పెట్టుకుంటే మసైపోతారని సర్కారును హెచ్చరించారు. ఉద్యమ సమయంలో ఆర్టీసీకి ఇచ్చిన హామీలను కేసీఆర్ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సమైక్య పాలకులను హెచ్చరించిన కేసీఆర్ ఇప్పుడు ఆయన మసికాక తప్పదన్నారు. పక్క రాష్ట్రంలో ఆర్టీసీ బలోపేతం కోసం ప్రభుత్వంలో విలీనం చేశారన్నారు. ప్రభుత్వం కుట్ర పూరితంగా కార్మికులను సమ్మె వైపు పురికొల్పిందన్నారు.

**ఆర్టీసీ కార్మికుల పట్ల కేసీఆర్ హేయమైన చర్య : మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ**

ఆర్టీసీ కార్మికుల పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వ్యవహరిస్తున్న తీరు హేయమైనదని మాజీ ఎమ్మెల్సీ షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు లేకపోతే తెలంగాణ ఉద్యమం జరిగేదా? అని ప్రశ్నించారు. అవసరం ఉన్నప్పుడు ఒక మాట, అవసరం తీరాక మరో మాట మాట్లాడే నేత కేసీఆర్ అని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల విషయంలో కేసీఆర్ యూటర్న్ తీసుకున్నారని విమర్శించారు.

## గోదావరి నదిలో బోటు ప్రమాదంపై సుప్రీంలో పిటిషన్

**న్యూఢిల్లీ :** గోదావరి నదిలో బోటు ప్రమాదంపై భారత సర్వోన్నత న్యాయస్థానంలో శనివారం పిటిషన్ దాఖలైంది. ఆంధ్రప్రదేశ్ బోట్ యాక్సిడెంట్ విషయంలో మాజీ ఎంపీ హర్షకుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బోటు వెలికితీసే విషయంలో అశ్రద్ధగా వ్యవహరిస్తుందని ఆయన పిటిషన్లో పేర్కొన్నారు. ఈ విషయంపై నేవీ డైరెక్టర్ జనరల్‌పై కూడా పిటిషన్లో ప్రస్తావించారు. నేవీ అధికారులతో వెంటనే వెలికితీసే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేయాలని పిటిషన్ పత్రంలో ఆయన కోరారు. సంఘటనా స్థలంలో చూసిన కొంతమంది 93 మంది బోటులో ఉన్నట్టు పిటిషన్లో వెల్లడించారు. అయితే, బోట్ ప్రమాదం తర్వాత పోలీసులు ప్రతి ఒక్కరిని ఫోటోలు తీశారని పిటిషన్ దారుడు హర్షకుమార్ వివరించారు. ఆ ఫోటోలు వెంటనే బహిర్గతం చేయాలనీ, పూర్తి సంఖ్య వెంటనే మీడియా ముందు పెట్టాలని హర్షకుమార్ పిటిషన్ లో కోరారు. కాగా, మృతుల్లో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి అశోక్ సోదరి ఉన్నట్టు హర్షకుమార్ తన పిటిషన్‌లో తెలిపారు. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు చేపట్టనున్నది.

# అడవుల రక్షణలో బీట్ ఆఫీసర్లే కీలకం

- కొత్తగా పచ్చదనాన్ని పెంచుకుందాం: బీఓ పాసింగ్ అవుట్ పేరేడ్‌లో పీసీసీఎఫ్ ఆర్. శోభ

**నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్**

అటవీ సంరక్షణలో క్షేత్రస్థాయిలో ఉండే బీట్ అధికారులదే కీలక పాత్ర అనీ, వారంతా నిబద్ధతతో పనిచేయాలని పీసీసీఎఫ్ ఆర్.శోభ కొత్త ఉద్యోగులకు హితబోధ చేశారు. అసిస్టెంట్ బీట్ అధికారి నుంచి బీట్ అధికారులుగా ప్రమోషన్ పొంది దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందిన అధికారుల కాన్వొకేషన్, పాసింగ్ అవుట్ పేరేడ్‌లో ఆమె పాల్గొన్నారు. 27వ బ్యాచ్ నుంచి 38మంది అటవీ బీటు అధికారులు తమ ఆరు నెలల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకున్నారు. అటవీ రక్షణ, పచ్చదనం పెంపు, స్మగ్లింగ్, వేట నియంత్రణ లాంటి అటవీ సంబంధిత 15 విషయాలతో పాటుగా వీరికి వెపన్ ట్రైనింగ్, అటవీ భూమి సర్వే చేయటం లాంటి ప్రత్యేక శిక్షణ ఈ ఆరునెలల కాలంలో ఇచ్చారు. ఈ పరీక్షలలో బి.సజన్ లాల్, ఆసిఫాబాద్ డివిజన్ మొత్తం 950 మార్కులకు గాను 824 మార్కులు సాధించి 86.74 శాతంతో ప్రథమ స్థానం పొందారు. అదే కాకుండా 7 సబ్జెక్టులలో ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ ఆల్‌రౌండర్‌గా కూడా బంగారు పథకాలను గెలుచుకున్నారు. అటవీ రక్షణలో తమ విధులు



నెరవేర్చటంతో పాటు, ప్రజలను, స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పోరేషన్ ఎమ్‌డీ పి.రఘువీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ఉన్నతాధికారులు పి.రఘువీర్, స్వర్గం శ్రీనివాస్, పృథ్వీరాజ్, కె.తిరుపతయ్య, ఎ.శంకరన్, గోవిందరాజులు, యన్ఆర్ సంగీతలతో పాటు దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణలో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు 81 మంది కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



బెల్లంకొండ సురేష్, రథన్, దిల్‌రాజు, గణేష్, పవన్ సాధినేని, వినాయక్, కార్తీక్ ఘట్టమనేని, సాయి శ్రీనివాస్

## అల్లుడు శీనుకు మించి అనందం పొందాలి

ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ రెండో తనయుడు, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తమ్ముడు బెల్లంకొండ గణేష్ హీరోగా పరిచయం అవుతూ ఓ సినిమాలో నటిస్తున్నారు. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బీటెల్ లీఫ్ ప్రొడక్షన్స్‌తో కలిసి లక్కీ మీడియా పతాకంపై బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం శనివారం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. అతిథిగా విచ్చేసిన ప్రముఖ నిర్మాత దిల్‌రాజు క్లాప్ నివ్వగా, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వినాయక్ మాట్లాడుతూ, 'బెల్లంకొండ సురేష్‌గారు నన్ను దర్శకుడిగా పరిచయం చేశారు. నేను సాయి శ్రీనివాస్‌ని హీరోగా పరిచయం చేశాను. ఇప్పుడు గణేష్ హీరోగా పరిచయం కావడం చాలా ఆనందంగా ఉంది. సాయి సక్సెస్‌ఫుల్ హీరోగా పేరు తెచ్చుకున్నారు. సాయి ఎలా కష్టపడతాడో, అలా గణేష్ కూడా కష్టపడి మంచి పేరు తెచ్చుకోవాలి. పవన్ సాధినేని మంచి దర్శకుడు. బెక్కం వేణుగోపాల్ నిర్మించిన సినిమాలన్నీ విజయం సాధించాయి.. ఈ చిత్రం కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. 'అల్లుడు శీను' విడుదల టైమ్‌లో సురేష్ ఎంత ఆనందంగా ఉన్నారో, ఈ సినిమా విడుదల టైమ్‌లోనూ అంతకు మించిన ఆనందాన్ని పొందాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'సాయి హీరోగా పరిచయం అయిన 'అల్లుడు శీను' సినిమాని నేను నిర్మించాను. ఇప్పుడు గణేష్‌ని పరిచయం చేసేందుకు బెక్కం మంచికథతో వచ్చారు. ఈ చిత్రానికి బెస్ట్ టెక్నీషియన్లు పనిచేస్తున్నారు. బెక్కం విజయవంతమైన సినిమాలు చేశారు. ఇది కూడా వాటిలాగే పెద్ద హిట్ కావాలి' అని బెల్లంకొండ సురేష్ తెలిపారు. 'తమ్ముడు మంచి సినిమాతో లాంచింగ్ కావడం ఆనందంగా, భావోద్వేగభరితంగా ఉంది. అతనికి తొలి సినిమాకే యంగ్ టీమ్ కుదిరింది. పవన్ బ్యూటిఫుల్ లవ్‌స్టోరీని తీయబోతున్నారు. మూడు కోణాలున్న జీవితాన్ని తెలిపే చిత్రమిది. వివేక్ ఆత్రేయ మాటలు సినిమాని మరో స్థాయికి తీసుకెళ్తాయని నమ్ముతున్నా' అని చెప్పారు. 'ఈ సినిమాతో నాకు పెద్ద బాధ్యత అప్పగించారు. నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని మాటిస్తున్నా. ఇంత పెద్ద అవకాశం ఇచ్చిన సురేష్, బెక్కంలకు ధన్యవాదాలు. గణేష్‌కి మంచి వినోదభరిత చిత్రాన్ని ఇస్తాను' అని దర్శకుడు పవన్ సాధినేని చెప్పారు. హీరో గణేష్ చెబుతూ,'నేనీ స్థానంలో నిలబడడానికి నాన్ననే కారణం. అమ్మ ఎంతో సపోర్ట్ చేసింది. అన్నయ్య బాగా ఎంకరేజ్ చేసేవారు. ఈ కథ విన్నప్పుడు కన్నీళ్ళు వచ్చాయి. అంత బాగుంది. ఆడియెన్స్‌కి కచ్చితంగా నచ్చుతుంది' అని చెప్పారు. 'ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఈ కథని పవన్‌తో చాలా రోజులు ప్రిపేర్ చేయిస్తున్నా. గణేష్‌కి బాగా సూట్ అవుతుందనిపించింది. నిర్మాతగా సురేష్‌గారిని స్ఫూర్తిగా తీసుకుని సినిమాలు నిర్మిస్తున్నా. ఎలాగైనా సూపర్ హిట్ సినిమా చేయాలని ప్రయత్నిస్తున్నాం' అని నిర్మాత బెక్కం వేణుగోపాల్ చెప్పారు.

## వైభవంగా ఎవ్వరికీ చెప్పొద్దు ప్రీ రిలీజ్ వేడుక



తరుణ్ భాస్కర్, బాబీ, దిల్‌రాజు, వి.వి. వినాయక్, బసవ శంకర్, రాకేష్ వర్రె, గార్గేయి ఎల్లా ప్రగడ

రాకేశ్ వర్రె, గార్గేయి ఎల్లాప్రగడ హీరో హీరోయిన్లుగా బసవ శంకర్ దర్శకత్వంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాకేశ్ వర్రె నిర్మిస్తున్న చిత్రం 'ఎవ్వరికీ చెప్పొద్దు'. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై దిల్‌రాజు ఈ నెల 8న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక శుక్రవారం జరిగింది. అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.వి.వినాయక్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ట్రైలర్ చూసినప్పుడు ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనడానికి నిదర్శనం దర్శకుడు శంకర్. ఫస్ట్‌టైమ్ స్టేజి మీద ఒక దర్శకుడు కొత్తగా, నిజాయితీగా మాట్లాడాడు. సినిమా కూడా అలాగే ఉంటుంది. రాకేష్ 'బద్రినాథ్'లో ఒక మంచి క్యారెక్టర్‌లో నాతోపాటు ట్రావెల్ అయ్యాడు. తను మంచి నటుడు. తను చిన్నప్పటి నుండి కోరుకున్న కోరిక ఈ చిత్రంతో నెరవేరుతుంది. డెఫినెట్‌గా ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. ఈ సినిమాని ఓన్ చేసుకొని రిలీజ్ చేస్తున్న రాజన్నకి రాకేష్ తరపున థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమా రాజుగారు చూసి బాగుందన్నప్పుడే హిట్ అయ్యింది. 'ఫిదా'లో సాయి పల్లవి నటన ఎంత ఎనర్జిటిక్, హుషారు అనిపించిందో ఈ ట్రైలర్ చూసిన తర్వాత ఈ హీరోయిన్ అలా అనిపించింది. తను చెప్పాలనుకున్నది సూటిగా, సుత్తి లేకుండా తీసిన దర్శకుడిని అభినందిస్తున్నా' అని అన్నారు. 'మా 'జోష్' సినిమాలో రాకేష్ వర్క్ చేశాడు. తను యాక్ట్ చేస్తానని వచ్చినప్పుడు విదేశాల్లో చదువుకుని వచ్చావు. మంచి కెరీర్ ఉంది. ఇది నీకు అవసరమా అన్నాను. కొన్ని రోజుల తర్వాత నేను హీరోగా చేస్తున్నానని చెప్పాడు. సినిమా అంతా పూర్తయిన తర్వాత నా దగ్గరకు వచ్చాడు. సినిమా చూశాను. అంతా కొత్త టీమ్ పడ్డ కష్టం నాకు తెరపై కనపడింది. చాలా మంచి కాన్సెప్ట్ మూవీ. మంచి రిలీజ్ డేట్ కోసం 9 నెలలు వెయిట్ చేశారు. బసవ శంకర్ ఆర్టిస్టుల నుంచి సహజమైన నటనని తీసుకున్నాడు. మంచి హ్యూమర్ ఉంది. సినిమా కచ్చితంగా నచ్చుతుంది' అని నిర్మాత దిల్ రాజు తెలిపారు. హీరో, నిర్మాత రాకేష్ వర్రె మాట్లాడుతూ, 'చాలా ఎమోషనల్ జర్నీ. 'బద్రినాథ్'లో మంచి పాత్ర ఇచ్చిన వినాయక్‌కి థ్యాంక్స్. ఆయన నా వెనక నిలబడ్డారు. అలాగే డైరెక్టర్ బాబీని చూసి ఇన్‌స్పైర్ అవుతుంటాను. తరుణ్ భాస్కర్‌కి థ్యాంక్స్. సినిమాటోగ్రాఫర్ విజయ్‌కి, లిరిసిస్ట్ వాసు, డైరెక్టర్ శంకర్‌గారికి ధన్యవాదాలు. సినిమా కచ్చితంగా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. అలాగే మా సినిమా రిలీజ్‌కు సపోర్ట్ చేస్తున్న దిల్‌రాజుగారికి థ్యాంక్స్. మా నాన్నగారికి కూడా థ్యాంక్స్. రిటైర్ అయిపోవాలనుకున్న ఆయన నా కోసం కష్టపడటం స్టార్ట్ చేశారు. నిజానికి ఈ సినిమాకు నేను హీరోని కాను. నాన్నగారే హీరో. సినిమాని ఆడియెన్స్ బాగా ఎంజాయ్ చేస్తారని గ్యారంటీగా చెప్పగలను' అని అన్నారు. 'ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని కాన్ఫిడెంట్‌గా ఉన్నా' అని దర్శకుడు బసవ శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు బాబీ, తరుణ్ భాస్కర్, హీరోయిన్ గార్గేయి, సంగీత దర్శకుడు శంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# నవచిత్రం

## తదుపరి చిత్రానికి రంగం సిద్ధం



చిరంజీవి, కొరటాల శివ

చిరంజీవి ఇటీవల 'సైరా నరసింహారెడ్డి'తో సందడి చేశారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా గాంధీ జయంతిని పురస్కరించుకుని విడుదలై విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. కలెక్షన్ల పరంగానూ సత్తా చాటుతోంది. ఇది రెండు రోజుల్లోనే రూ.వంద కోట్లకుపైగా వసూళ్ళని రాబట్టినట్టు సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కొంత గ్యాప్‌తో చిరు నెక్స్ట్ సినిమాకి సిద్ధం కాబోతున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో నటించే సినిమా వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభం కానుందట. ఆర్‌ఎఫ్‌సీలో మొదటి షెడ్యూల్‌ని జరుపనున్నారట. అందుకోసం ప్రత్యేకంగా ఓ సెట్ కూడా వేసినట్టు తెలుస్తుంది. దాదాపు ఇరవై రోజులపాటు ఈ షెడ్యూల్ ఉంటుందట. వినోదం, సందేశం మేళవింపుగా రూపొందే ఈ చిత్రంలో కథానాయికగా త్రిష పేరు వినిపిస్తుంది. మరోవైపు ఇందులో మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ కీలక పాత్రలో కనిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొరటాల దర్శకత్వం వహించిన 'జనతా గ్యారేజ్'లో మోహన్‌లాల్ నటించిన విషయం విదితమే. ఆయనతోపాటు మరో సీనియర్ నటి నదియా సైతం కీ రోల్ పోషించే ఛాన్స్ ఉందట. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయనున్నారు. దీంతోపాటు ఆ తర్వాతి చిత్రం కూడా కన్ఫమ్ అయినట్టు తెలుస్తుంది. మలయాళంలో సూపర్ హిట్‌గా నిలిచిన 'లూసిఫర్' చిత్ర రీమేక్ రైట్స్ రామ్‌చరణ్ సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ సినిమాని తండ్రి చిరంజీవి తోనే రూపొందించే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. మోహన్‌లాల్ హీరోగా, పృథ్వీరాజ్ కీలక పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. మోహన్‌లాల్ పాత్రలో చిరంజీవి, పృథ్వీరాజ్ పాత్రలో రామ్‌చరణ్ నటించే అవకాశాలు ఉన్నాయట.

## స్పీడ్ పెంచేశాడు



రజనీకాంత్

రజనీకాంత్ ప్రస్తుతం 'దర్బార్' చిత్రంలో నటిస్తున్నారు. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. రజనీకాంత్, మురుగదాస్ కాంబినేషన్‌లో మొదటిసారి ఈ సినిమా రూపొందుతుంది. నయనతార కథానాయికగా నటిస్తుండగా, నివేదా థామస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రం తాజాగా షూటింగ్ పూర్తి చేసుకుందట. ఇటీవలే ముంబయి, జైపూర్ వంటి ప్రాంతాల్లో యాక్షన్ ఎపిసోడ్స్‌ని చిత్రీకరించారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. తాజాగా చిత్ర బృందంతో రజనీ దిగిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంది. ఇందులో ఆయన యంగ్ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. రజనీకాంత్ ఈ చిత్రంలో రెండు భిన్న షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారట. ఓ షేడ్‌లో పోలీస్ అధికారిగా కనిపించనున్నారు. మరో షేడ్‌లో ఎలా కనిపిస్తారనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా విడుదల చేయబోతున్నారు. మరోవైపు రజనీ నెక్స్ట్ కె.ఎస్.రవికుమార్, హెచ్ వినోథ్ దర్శకత్వంలో సినిమాలు చేయనున్నారు. కె.ఎస్.రవికుమార్ ప్రస్తుతం బాలకృష్ణ హీరోగా ఓ సినిమాని రూపొందిస్తూ బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రజనీ నెక్స్ట్ వినోథ్ దర్శకత్వంలో నటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇవే కాకుండా గౌతమ్ మీనన్ దర్శకత్వంలోనూ ఓ సినిమా చేసే ఆలోచనలో ఉన్నారట. ప్రస్తుతం రజనీ కోసం ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని గౌతమ్ మీనన్ సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

## తలైవి కోసం భరతనాట్యం

**బాలీవుడ్‌లో విలక్షణ నటిగా పేరు తెచ్చుకున్న కంగనా రనౌత్ ప్రస్తుతం మాజీ సీఎం, అలనాటి నటి జయలలిత బయోపిక్‌లో నటిస్తుంది. 'తలైవి' పేరుతో రూపొందే ఈ చిత్రానికి ఏ.ఎల్.విజయ్ దర్శకత్వం వహిస్తున్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమా కోసం కంగనా భరతనాట్యం నేర్చుకుంటోంది. జయలలిత కెరీర్ ప్రారంభంలో భరతనాట్యంలో రాణించారు. పలు ప్రదర్శనలు కూడా ఇచ్చారు. ఆయా సన్నివేశాల కోసం కంగనా ఇప్పుడు గాయత్రి రఘురామ్ వద్ద శిక్షణ తీసుకుంటుంది. ఈ సందర్భంగా తీసిన పలు ఫొటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకుంది కంగనా. భరతనాట్యంలోని పలు స్టెప్స్‌తో వేస్తూ ఉన్న ఫొటోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తమిళం, హిందీలో తెరకెక్కే ఈ సినిమా వచ్చే నెలలో మైసూర్‌లో ప్రారంభం కానుంది. ఇందులో జయలలిత రాజకీయ గురువు, మాజీ సీఎం ఎంజీఆర్‌గా అరవింద స్వామి నటిస్తున్నారు. ప్రస్తుతం కంగనా హిందీలో 'పంగా', 'ధాఖడ్' చిత్రాల్లో నటిస్తుంది.**



కంగనా రనౌత్

## నాకు మోహన్‌లాలే పోటీ!



మోహన్‌లాన్, మమ్ముట్టి

'మలయాళంలో నాకు మోహన్‌లాల్‌తోనే పోటీ. సినిమాల విషయంలో మా మధ్య మంచి పోటీ ఉంటుంది' అని మరో మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి అన్నారు. ఇటీవల 'యాత్ర' చిత్రంతో తెలుగు ఆడియెన్స్‌ని ఆకట్టుకున్న మమ్ముట్టి, మోహన్‌లాల్ మంచి స్నేహితులు. మలయాళ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయకులుగా రాణిస్తున్నప్పటికీ వారి మధ్య స్నేహబంధం అలానే కొనసాగుతుంది. తరచూ వీరిద్దరు కలుసుకుంటుంటారు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మమ్ముట్టి మాట్లాడుతూ, 'మేం కెరీర్ ప్రారంభం నుంచి మంచి స్నేహితులం. ఇప్పటికీ మా మధ్య స్నేహం అలానే ఉంది. నటన విషయంలో మేమిద్దరం పోటీపడతాం. మంచి పాత్రలు చేసే విషయంలో పోటీపడతాం. పోటీ అనేది కెరీర్ పరంగానే కానీ, వ్యక్తిగతంగా కాదు. కెరీర్ పరంగా కూడా మాది చాలా ఆరోగ్యకరమైన పోటీ' అని తెలిపారు. మలయాళంలో సూపర్‌స్టార్లుగా రాణిస్తున్న ఈ ఇద్దరు కలిసి దాదాపు 54 చిత్రాల్లో కలిసి నటించడం విశేషం. ఆ సినిమాలు మంచి ఆదరణపొందాయి. ప్రస్తుతం మమ్ముట్టి 'మామాంగం', 'షైలాక్' చిత్రాల్లో నటిస్తున్నారు. 'మామాంగం' తెలుగులో కూడా విడుదల కానుంది. ఇక మోహన్‌లాల్ ప్రస్తుతం 'బిగ్ బ్రదర్స్', 'మరక్కర్: అరబికడలింటే సింహం' చిత్రాల్లో నటిస్తున్నారు.



కేథరిన్ థ్రెస్సా

## విలక్షణ నటిగా మెప్పించాలి

**'బలమైన పాత్రలు వస్తే ఏ భాషలోనైనా నటిస్తాను. తెలుగులో ఎక్కువగా సినిమాలు చేయకపోవడానికి కారణం బలమైన పాత్రలు రాకపోవడమే' అని అంటోంది కేథరిన్ థ్రెస్సా. సాయి శేఖర్ దర్శకత్వంలో సిద్ధార్థ్, కేథరిన్ జంటగా నటించిన చిత్రం 'వదలడు'. తమిళంలో రూపొందిన 'అరువమ్' చిత్రానికి అనువాదం. ఈ నెల 11న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం కేథరిన్ థ్రెస్సా మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో నేను జ్యోతి అనే టీచర్ పాత్రలో కనిపిస్తాను. స్మెల్‌ని పొందలేను. ఓ రకమైన లోపం అది. నాకు అమ్మ ఉండదు. నాన్నతోనే అన్ని విషయాలు పంచుకుంటాను. ఫన్ అయినా, ఎమోషన్ అయినా అన్నీ నాన్నే. ఆయన నాకు పెళ్ళి చేయాలను కుంటారు. కానీ నేను ఓ మంచి అమ్మని కాలేనని ఉద్దేశంతో పెళ్ళికి దూరంగా ఉంటాను. హీరో సిద్ధార్థ్ ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా కనిపిస్తారు. మా మధ్య ప్రేమ, అనంతరం చోటు చేసుకునే సంఘటనలు ఆసక్తికరం. అయితే సినిమా ప్రధానంగా ఆహారం కల్తీపై సాగుతుంది. ఫుడ్ మాఫియా లాభాల కోసం ప్రతి దాన్ని ఎలా కల్తీ చేస్తున్నారనేది చూపించబోతున్నాం. కాన్సర్ అనేది వ్యాధి కాదు, అదొక వ్యాపారమనే విషయాలు వినోదాత్మకంగా, అన్ని కమర్షియల్ అంశాలతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాం. ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్న కల్తీ మాఫియా గురించి, ఆహార పదార్థాల ప్రమాణాలు పెంచాలనేది ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తీసిన చిత్రమిది. సాధారణంగా దేశంలో ఎలాంటి సమస్య వచ్చినా సిద్ధార్థ్ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తుం టారు. కాబట్టి ఆయన ఈ సినిమాకి యాప్ట్ అయ్యారు. ఇందులో సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ కూడా ఉంటాయి. అవి సినిమాకి కీలకం. నా పాత్ర కోసం కొంత రీసెర్చ్ చేశాను. వాసన పొందలేని, ఆ లోపం ఉండే వాళ్ళు కూడా ఉంటారని డాక్టర్స్ ద్వారా తెలుసుకున్నా. సినిమా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరు చూడాల్సిన చిత్రమిది. ప్రస్తుతం నా దృష్టి అంతా నటనకు స్కోప్ ఉన్న పాత్రలపైనే ఉంది. 'సరైనోడు'లో నా పాత్ర కాసేపే ఉన్నా, చాలా బలంగా ఉంటుంది. అది అందరు గుర్తించేలా ఉంది. అలాంటి రోల్స్ వస్తే ఏ భాషలోనైనా నటిస్తాను. అంతిమంగా విలక్షణ నటిగా గుర్తింపు పొందాలనుకుంటున్నా. ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో 'వరల్డ్ ఫేమస్ లవర్'లో నటిస్తున్నా. అందులో నాది చాలా గొప్ప పాత్ర. సిద్ధార్థ్ సామాజిక అంశాలపై స్పందిస్తుంటారు. ఆయనతో పనిచేయ డం వల్ల నాపై ఆయన ప్రభావం పడింది. ఇటీవల అమెజాన్ అడవులు కాలిపోయినప్పుడు బాధేసింది. నల్లమల్ల ఫారెస్ట్‌ని కట్ చేయాలని చూస్తున్నారు. మనకు ఉన్న అడవులే చాలా తక్కువ. పైగా వాటిని కూడా కట్ చేస్తే తీవ్రంగా నష్టపోతాం. అది మానవ మనుగడకే ప్రమాదకరం' అని అన్నారు.**

## ఇదేమీ ఓవర్ నైట్ స్టార్‌డమ్ కాదు..!



పాయల్ రాజ్‌పుత్

**'నేను ఓవర్ నైట్ స్టార్ అవ్వడమనేది నిజం కాదు. దీని వెనకాల ఆరేండ్ల కష్టం ఉంది. సౌత్‌లో సినిమాలు చేయాలని ఆరేండ్లుగా ప్రయత్నిస్తున్నా. చాలా మంది నన్ను రిజక్ట్ చేశారు' అని అంటోంది పాయల్ రాజ్‌పుత్. తేజస్, పాయల్ రాజ్‌పుత్ జంటగా శంకర్ భాను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. సి.కళ్యాణ్ నిర్మించిన ఈ సినిమా దసరా పండుగని పురస్కరించుకుని ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం పాయల్ రాజ్‌పుత్ మీడియాతో మాట్లాడుతూ, 'తెలుగులో నటిస్తున్న రెండో చిత్రమిది. మహిళా ప్రధానంగా సాగుతుంది. ఇందులో నా పేరు అలివేలు. పాపికొండ అనే విలేజ్‌లో సోషల్ వర్కర్‌గా పనిచేస్తుంటాను. అక్కడ ఊర్లో చాలా సమస్యలు, మహిళలపై చిన్నచూపు వంటివి ఉంటాయి. మరి సమస్యల పరిష్కారం కోసం ఓ మహిళగా నేను చేసిన త్యాగం ఏంటనేది సినిమా. జనాన్ని ఎడ్యూకేట్ చేయడంతోపాటు మంచి సందేశాన్ని అందించే చిత్రమవుతుంది. టీజర్, పోస్టర్‌లో చూసినట్టు నా పాత్ర చాలా బోల్డ్‌గా ఉంటుంది. గ్లామర్‌సైడ్ కొంత వరకే ఉంటుంది. అలాగని నానుంచి అభిమానులు కోరుకునే అన్ని అంశాలుంటాయి. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సాగుతుంది. ఫస్ట్ టైమ్‌లో ఇందులో యాక్షన్ కూడా చేశాను. నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. చాలా కంఫర్ట్‌గా పెరిగా. కానీ ఈ చిత్రం కోసం 40 రోజులు విలేజ్‌లో ఉండాల్సింది. అది చాలా ఇబ్బందిగా అనిపించింది. కానీ ఆ వాతావరణాన్ని బాగా ఎంజాయ్ చేశాను. ఈ సినిమా స్టీరియోటైప్‌ని బ్రేక్ చేస్తుంది. ఇలాంటి సినిమాలు మరిన్ని వచ్చే అవకాశం ఉంది. 'ఆర్ ఎక్స్ 100' తర్వాత చాలా వరకు అలాంటి సినిమాలే వచ్చాయి. కానీ ఒప్పుకోలేదు. కొత్తగా డిఫరెంట్‌గా చేయాలని ఈ స్క్రిప్ట్ ఎంచుకున్నా. ప్రస్తుతం 'వెంకీమామ', 'డిస్కోరాజా' సినిమాల్లో నటిస్తున్నా. దీంతోపాటు మరో సినిమా చేస్తున్నా. అందులో ఐపీఎస్‌గా కనిపిస్తాను. 'ఆర్‌ఎక్స్ 100'తో నేను ఓవర్ నైట్ స్టార్ అయిపోయాననేది వాస్తవం కాదు. ఆరేండ్ల పాటు అవకాశాల కోసం ఎంతో స్ట్రగుల్ అయ్యాను. చాలా మంది రిజక్ట్ చేశారు. అయితే ఇప్పుడొచ్చిన ఇమేజ్‌ని ఊహించలేదు. ఆడియెన్స్ ఎంతో ప్రేమిస్తున్నారు. నన్ను ఓ ప్రిన్సెస్‌గా ట్రీట్ చేస్తున్నారు. ఇదంతా చాలా హ్యాపీగా ఉంది. అదే సమయంలో నెగటివ్ కూడా ఉంది. సోషల్ మీడియాలో చాలా మంది వల్గర్‌గా కామెంట్ చేస్తున్నారు. కొందరు పోర్న్ స్టార్ అంటున్నారు. మరికొందరు సిల్క్‌స్మితతో పోల్చుతున్నారు. ఈ చిత్ర టీజర్ విడుదలైనప్పుడు బ్యాడ్‌గా కమెంట్స్ వచ్చాయి. అవి చూసి ఆ రోజు ఏడ్చేశా. ఇప్పుడు కామన్ అని అర్థమైంది. నేను ఎలాంటి సినిమాలు చేయాలనే విషయంలో చాలా క్లీయర్‌గా ఉన్నాను. ఇక కరీనా కపూర్ నా ఫేవరేట్ నటి. దర్శకుల్లో మధూర్ భండార్కర్, ఇంతియాజ్ అలీకి పెద్ద ఫ్యాన్స్‌ని. వారితో పనిచేయాలనుకుంటున్నా' అని చెప్పింది.**

# జిల్లాల వారీగా సమ్మె ప్రభావం

**నవతెలంగాణ- యంత్రాంగం**

నల్లగొండ డిపోలో డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నిరుద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆర్టీఏ శాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ సీనియార్టీని బట్టి తీసుకున్నారు. దేవరకొండ డిపో ఎదుట బస్సులను అడ్డుకోవడంతో కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. కార్మికల అరెస్టును నిరసిస్తూ సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లోనూ అదనపు చార్జీలు వసూలు చేశారు. నార్కట్‌పల్లి డిపోలో కార్మికులు నిరసన తెలిపారు. ప్రయివేటు వ్యక్తులను నడిపిన బస్సుల్లో అనుభవం లేని డ్రైవర్లు ఉన్నారని ప్రయాణికులు ఎక్కడానికి భయపడ్డారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది డిపోల నుంచి 430 ఆర్టీసీ బస్సులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య నడిచాయి. మహబూబాబాద్ డిపోలో కార్మికులు బస్సులను అడ్డుకొని, డిపో ఎదుట బైటాయించారు. దాంతో అరెస్టు చేశారు. నిరసనగా సీపీఐ(ఎం), కాంగ్రెస్, టీజేఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో డిపోల ఎదుట ఆందోళన చేపట్టిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఆర్టీసీ ఏజేసీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు.

సంగారెడ్డి జిల్లా కందిలో గుర్తు తెలియని వ్యక్తులు ఆర్టీసీ అద్దె బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. జహీరాబాద్‌లో ప్రయివేటు వాహనాలను పోలీసు బందోబస్తు మధ్య నడిపించారు. సంగారెడ్డిలో సమ్మెకు ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంఘీభావం ప్రకటించారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కార్మికులు బస్సులను డిపో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో కార్మిక సంఘాల నాయకులతో పాటు కార్మికులనూ అరెస్టు చేశారు. అరెస్టులకు నిరసనగా కార్మికులు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.

కరీంనగర్ రీజియన్ పరిధిలో తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను విధుల్లోకి తీసుకున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని శివారులో ఆర్టీసీ బస్సుపై గుర్తుతెలియని వ్యక్తి రాళ్లు విసిరాడు. బస్సు అద్దం పగిలి అందులోని ఓ బాలుడి తలకు గాయమైంది. నిజామాబాద్‌కు వచ్చే ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసిన కాచిగూడ-నిజామాబాద్ జనసాధారణ్ ప్రత్యేక రైలు కిక్కిరిసిపోయింది.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో డిపో ఎదుట దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగన్న, సిద్దిరాములుతో పాటు నాయకులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోనూ ఆందోళనకు



కరీంనగర్‌లో కార్మికుల నిరసన



ఖమ్మం బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

దిగిన కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్ వన్ డిపో వద్ద నల్ల రిబ్బన్లు నోటికి కట్టుకుని కార్మికులు ఆందోళన చేశారు. జగిత్యాల బస్‌డిపో వద్ద తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ మద్దతు తెలిపారు.

కల్వకుర్తి డిపో నుంచి హైదరాబాద్ వరకు ప్రయివేటు సిబ్బందిని పెట్టుకుని ఆర్టీసీ బస్సులను నడిపిస్తుండటంతో రంగారెడ్డి జిల్లాలో కార్మికులు అడ్డుకున్నారు. దాంతో కార్మికులు, ప్రయివేటు సిబ్బంది మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు.

**యాదాద్రిలో ఉద్రిక్తత**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట డిపో నుంచి ఉదయం రెండు బస్సులను నడిపించే ప్రయత్నం చేయగా కార్మికులు, అఖిలపక్షం నాయకులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం వారిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మహిళా కండక్టర్ పుష్పలత స్పృహ తప్పి పడిపోయారు. ఆమెను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్మికులు బస్సులను అడ్డుకుంటున్న క్రమంలో ఓ బస్సు అలాగే ముందుకు కదలడంతో మహిళా కండక్టర్ ఆగ్రహంతో డ్రైవర్‌ను చెప్పుతో కొట్టారు. కార్మికుల అరెస్టులను నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆలేరులో కాంగ్రెస్ పార్టీ ర్యాలీ నిర్వహించింది. కార్మికుల అరెస్టు అనంతరం మధ్యాహ్నం రెండు గంటల తరువాత ప్రయివేట్ కార్మికులతో బస్సులను రోడ్డెక్కించారు. సూర్యాపేట జిల్లాలో తాత్కాలికంగా అప్పటికప్పుడే డ్రైవర్లను, కండక్టర్లను నియమించారు. డిపో నుంచి బస్సులు బయటకు వెళ్లకుండా సీఐటీయూ నాయకులు ధర్నా చేయడంతో అరెస్టు చేశారు. సమ్మెకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మద్దతు తెలిపారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో..**

గ్రేటర్ హైదరాబాద్‌లో 3550 బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు చెబుతున్న ఎక్కడా బస్సులు తిరగలేదు. ఎంజీబీఎస్, జేబీఎస్ ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.

ఉద్యోగాలకు వెళ్లేవారు ఆటోలు, ప్రయివేటు వాహనాలు, క్యాబ్‌లలో గమ్యస్థానాలకు చేరుకున్నారు. అయితే, మూడింతల చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. బస్సును నడిపిన ప్రయివేట్ వ్యక్తి కుషాయిగూడ డిపో ముందు కరెంట్‌పోల్‌కు తగిలించాడు. ఈసీఐఎల్ బస్టాండ్ ముందు యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. సమ్మె సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్‌భగవత్, కుషాయిగూడ డివిజనల్ మేనేజర్ జగన్‌తో కలిసి పరిశీలించారు.

**కిక్కిరిసిన మెట్రో**

ఆర్టీసీ సమ్మె మొదటి రోజు మెట్రో రైళ్లు జనంతో కిటకిటలాడాయి. వివిధ రూట్లలో అదనంగా వంద సర్వీసులతో కలిపి మొత్తం 810 సర్వీసులను మెట్రో అధికారులు నడిపించారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11.30 గంటల వరకూ మెట్రో సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఆరు అదనపు రైళ్లను ఏర్పాటు చేసిన హెచ్‌ఎంఆర్ స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు, సిబ్బందిని నియమించారు.

**దోచుకుంటున్న ప్రయివేటు ఆపరేటర్లు**

ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ఇదే అదునుగా భావించిన ప్రయివేటు బస్సులు, ట్రావెల్స్ యాజమాన్యాలు ప్రయాణికుల నుంచి అధిక డబ్బులు వసూలు చేశారు. ఏమైనా అంటే 'బస్సులు బంద్ ఉన్నాయి. ఇష్టం ఉంటే ఎక్కు. లేకపోతే దిగిపో' అని పరుషంగా మాట్లాడుతున్నారు. మరో వైపు పోలీసు బందోబస్తు మధ్య నడుస్తున్న అద్దె బస్సులకు అధికారులు టార్గెట్ పెట్టారు. బస్సుకు రూ. 5 వేలు చెల్లించాలని సూచించి.. అందులో నుంచే తాత్కాలిక డ్రైవర్‌కు రూ.1500, కండక్టర్‌కు రూ.1000 చెల్లిస్తామని ప్రకటించారు. అయితే, టికెట్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదనడంతో అందిన కాడికి దండుకున్నారు. ప్రయివేటు ట్రావెల్స్ బస్సులు నిజామాబాద్-హైదరాబాద్ రూట్లో సర్వీసులను నడిపి రూ.400 వసూలు చేశారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు రూ.76 చార్జీ ఉండగా, రూ.150 వసూలు చేశారు.

నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు సాధారణంగా రూ.100 నుంచి రూ.150 అయితే, ప్రయివేటు వాహనాల్లో రూ.250 నుంచి రూ.300 వరకు వసూలు చేశారు. ఏసీ సౌకర్యం ఉంటే రూ.400 నుంచి రూ.500 వరకు తీసుకున్నారు.

**ఎన్ని అవాంతరాలెదురైనా సమ్మె.. : అశ్వత్థామరెడ్డి**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం చేస్తున్న ఈ ధర్మపోరాట సమ్మెను ఎన్ని అవాంతరాలు ఎదురైనా కొనసాగిస్తామని జేఏసీ, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి అన్నారు. శనివారం ఆయన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, హయత్‌నగర్‌లోని డిపో-1,2లో పర్యటించారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర నూటికి నూరు శాతం ఉందన్నారు. ఉద్యోగులను తొలగించాలనుకుంటే ముందుగా తనను తొలగించాలన్నారు. సోమవారం నుంచి ఇందిరాపార్కు వద్ద దీక్షలు చేపడతామని తెలిపారు.

## ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**నవతెలంగాణ-మహబూబాబాద్**

ఆర్టీసీ కార్మికులను పోలీసులు నిర్బంధంగా అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డ్రైవర్ శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. కురవి మండలం బంచరాయి తండాకు చెందిన లాలు మానుకోట ఆర్టీసీ డిపోలో పది సంవత్సరాలుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సమ్మెలో భాగంగా కార్మికులు బస్సులను అడ్డుకుంటుండగా పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని విడుదల చేయకపోవడంతో మనస్తాపానికి గురైన లాలు మానుకోట ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో పక్కనే ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన గురుచరణ్ అనే కార్మికుడు ప్రజ్ఞాపూర్ బస్సు డిపో సమీపంలోని హోర్డింగ్ బోర్డెక్కి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. పోలీసుల జోక్యంతో కిందకు దిగాడు.

## సెలవులు, సమ్మె ప్రభావం....

- సగానికి తగ్గిన రోగులు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

పండుగ నేపథ్యంలో వరుస సెలవులు, ఆర్టీసీ సమ్మె ప్రభావం పేద రోగులపై పడింది. ఎప్పుడూ కిక్కిరిసి ఉండే ఉస్మానియా, గాంధీ తదితర ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య సగానికి పడిపోయింది. సాధారణ రోజుల్లో ఉస్మానియా ఆస్పత్రికి రోజు దాదాపు 2000 మంది వరకు రోగులు వస్తుంటారు. గురు, శుక్రవారాల్లో 1500 వరకే రిజిస్ట్రేషన్లు జరగగా, ఆర్టీసీ సమ్మె తొలి రోజు శనివారం వెయ్యి లోపు రిజిస్ట్రేషన్లు జరిగాయి. గాంధీ, నీలోఫర్ తదితర ఆస్పత్రుల్లోనూ పరిస్థితి ఇదే విధంగా ఉన్నట్టు వైద్యవర్గాలు చెప్పాయి. తప్పనిసరిగా ఆస్పత్రికి వచ్చే వారికి ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. హైదరాబాద్ నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. వీరిలో అత్యధికులు నిరుపేదలు. ఆర్టీసీ కాకుండా ప్రయివేటు వాహనాల్లో రావాలనుకున్న నాలుగైదు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తుండడంతో ఎక్కువ మంది రోగులు ఆస్పత్రికి రావడాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితులు తలెత్తిన తర్వాత రోజుల్లో రోగుల సంఖ్య రోజు వారీ కన్నా మరింత ఎక్కువగా ఉంటుందని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు.

## కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రతినెలా జీతాలు

**- జీవో ఇస్తామని మంత్రి హరీశ్‌రావు హామీ**



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఇక నుంచి ప్రతినెలా జీతాలు ఇచ్చేందుకు జీవో విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని ప్రభుత్వ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం తెలిపింది. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావును శనివారం హైదరాబాద్‌లోని సంఘం అధ్యక్షులు జి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. కాంట్రాక్టు అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామని తెలిపారు. ప్రతినెలా వేతనాలు చెల్లించాలని, బదిలీలు చేపట్టాలని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించి మంత్రి హరీశ్‌రావు ప్రతినెలా వేతనాలు చెల్లించేందుకు జీవో విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. మిగిలిన సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారని పేర్కొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు టీటీఎఫ్, టీడీటీఎఫ్ మద్దతు

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

ఆర్టీసీ సమ్మెకు టీటీఎఫ్, టీడీటీఎఫ్ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు టీటీఎఫ్ అధ్యక్షులు ఈ రఘునందన్, ప్రధాన కార్యదర్శి కె రమణ, టీడీటీఎఫ్ అధ్యక్షులు ఎస్ రాజేందర్, ప్రధాన కార్యదర్శి గోపు సోమయ్య శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం అనవసర ప్రతిష్టకు పోకుండా సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

## ఆప్షన్ల ప్రకారమే నియామకాలు

(మొదటిపేజీ తరువాయి)

ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే కేస్ టు కేస్ స్టడీ చేసి తుది ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దీనితో శనివారం తెలంగాణ విద్యుత్ అధికారులు 1,157 మంది ఆప్షన్లను కూడా కమిటీకి అందచేశారు. దీనిలో 613 మంది తాము ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తామని, 544 మంది తెలంగాణలో ఉంటామని ఆప్షన్లు ఇచ్చారు. అయితే ఏపీకి ఆప్షన్లు ఇచ్చిన వారిని తాము తీసుకోలేమని ఆ రాష్ట్ర ట్రాన్స్‌కో జేఎమ్‌డీ చక్రధరరావు చెప్పారు. తమకు శాంక్షన్ పోస్టులు లేవని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీన్ని జస్టిస్ ధర్మాధికారి తప్పుపట్టారు. శాంక్షన్ పోస్టులు లేకుంటే సూపర్‌న్యూమరేరీ పోస్టులు సృష్టించి తీసుకోవాలని చెప్పారు. ఆ రాష్ట్ర ఆర్థిక స్థితిని కూడా ఏపీ అధికారులు వెల్లడించారు. దీన్ని కూడా కమిటీ పక్కనపెట్టి తమ ఆదేశాలు పాటించాలని చెప్పింది. అలాగే తెలంగాణకు ఆప్షన్ ఇచ్చిన 544 మందిని ఇక్కడి విద్యుత్ సంస్థలు తీసుకోవాలని చెప్పింది. అలాగే ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు 265 మంది విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. ఈ మేరకు పోస్టింగులు ఇచ్చి, ఆ తర్వాత ఏవైనా అభ్యంతరాలు ఉంటే వేర్వేరుగా పరిష్కరించుకోవాలని పేర్కొన్నది. దీనికోసం నవంబర్ 2,3 తేదీల్లో విజయవాడలో కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.

## 'సైరా'ను చూడండి..

- గవర్నర్‌కు చిరంజీవి విజ్ఞప్తి

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

తాను నటించిన సైరా నర్సింహారెడ్డి సినిమాను వీక్షించాలంటూ ప్రముఖ నటుడు చిరంజీవి.. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను కోరారు. శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆమెతో ప్రత్యేకంగా భేటీ అయిన చిరంజీవి.. గవర్నర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురూ జాతీయ, రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించినట్టు తెలిసింది.

## బడికి రాని పంతుళ్లపై వేటు?

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యే వారిలో ఉన్నారు. వ్యాపారం చేసే వారు, ప్రయివేటు విద్యాసంస్థలు నడిపే వారూ లేకపోలేదని అధికారులు అంటున్నారు. ఇక దీర్ఘకాలిక అనారోగ్యం పాలైన వారూ సమాచారం ఇవ్వడానికి వీలు కాని వారు ఉండొచ్చు. ఇలా అనేక కారణాలతో ఉపాధ్యాయులు పాఠశాలలకు దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్నారు. అయితే ఏడాది వరకు డుమ్మా కొడితే వారికి వెంటనే విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి. కానీ ఐదేండ్లకుపైగా డుమ్మా కొట్టే టీచర్లు ఉన్నారంటే విద్యాశాఖ అధికారులు ఎంత అలసత్వం ప్రదర్శిస్తున్నారో అర్థమవుతున్నది. ఇప్పటికైనా డుమ్మా కొట్టే బడి పంతుళ్లను గుర్తించి వారిపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం కావడం గమనార్హం. త్వరలోనే ఆ ఉపాధ్యాయులకు నోటీసులు పంపించే అవకాశమున్నది.

## దొంగఖాతాలతో రుణాలు

(మొదటిపేజీ తరువాయి)

డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసును నమోదు చేసింది. పీఎంసీ బ్యాంకు కుంభకోణంలో జోయ్ థామస్ ముఖ్యవ్యక్తిగా ఈడీ భావిస్తోంది.

పీఎంసీ బ్యాంక్ మొత్తం లోన్ బుక్ విలువ రూ.8,880కోట్లు కాగా, ఇందులో రూ.6500 కోట్లు (73శాతం) రియాల్టీ సంస్థలకు రుణాలుగా అందాయి. పెద్ద ఎత్తున ఆర్థిక అక్రమాలు చోటుచేసుకోవటం, రియాల్టీ సంస్థలకు రుణాలు మంజూరవటం నిఘా వర్గాల ద్వారా ఆర్‌బీఐకి చేరేదాకా విషయం బయట పడలేదు. ప్రాథమిక విచారణ తర్వాత గత నెల 23న పీఎంసీ బ్యాంకు విషయంలో ఆర్‌బీఐ కఠిన చర్యలకు దిగింది. పలువురు కీలక అధికారుల్ని సస్పెండ్ చేసింది. బ్యాంకు విత్‌డ్రాయల్స్‌పై పరిమితులు విధించింది. హెచ్‌డీఐఎల్‌కు ఇచ్చిన రుణాలన్నీ పెద్ద సంఖ్యలో మొండి బకాయిలుగా పేరుకున్న విషయాన్ని బ్యాంకు ఎండీ జోయ్ థామస్ దాచిపెట్టిన సంగతి బయటపడింది.

అంతేగాక రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను తప్పుదారి పట్టించి, 21వేల దొంగ ఖాతాలను పీఎంసీలో సృష్టించటం వెనుక జోయ్ థామస్ ఉన్నట్టు బలమైన ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ దొంగ ఖాతాల పేరుమీద పీఎంసీ బ్యాంకు నుండి రుణాలు మంజూరు చేశారనీ, ఆ రుణాలన్నీ ముంబయి కేంద్రంగా ఉన్న రియలెస్టేట్ సంస్థ హెచ్‌డీఐఎల్‌కు చేరినట్టు సమాచారం. దొంగ ఖాతాల్ని సృష్టించిన విషయాన్ని జోయ్ థామస్ విచారణలో ఒప్పుకున్నారని తెలిసింది. పీఎంసీ బ్యాంకు అవినీతి కుంభకోణంలో ఎంతమంది అధికారులు జోయ్ థామస్‌కు సహకరించారన్న దానిపై పోలీసులు దృష్టి సారించారట.

## కాశ్మీర్‌లో 'మానవీయ సంక్షోభం'

**న్యూఢిల్లీ:** కాశ్మీర్‌లో 'మానవీయ సంక్షోభం' నెలకొన్నదని విదేశీ వ్యవహారాల అమెరికా సెనేట్ కమిటీ అభివర్ణించింది. సమాచార వ్యవస్థపై నిషేధంసహా కాశ్మీర్ పౌరులపై విధించిన ఆంక్షలను తొలగించాలని సెనేట్ కమిటీ సూచించింది. ఈ ఏడాది ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయించిన తర్వాత అక్కడ నెలకొన్న పరిస్థితులపై సెనేటర్ క్రిస్ వ్యాన్‌హోలెన్ ఈ ప్రతిపాదన చేశారు. విదేశీ కేటాయింపుల చట్టం 2020 కింద వార్షిక నివేదికను సెనేట్‌కు సమర్పించే సందర్భంగా ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం.

ఇటీవల ఢిల్లీకి వచ్చిన అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) ప్రతినిధుల బృందంలో వ్యాన్‌హోలెన్ ఒకరు. ఈ బృందం భారత్‌తో ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలు, రక్షణరంగంలో సహకారంపై చర్చలు జరిపింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన సీనియర్ సెనేటర్ లిండ్సేగ్రాహమ్ నేతృత్వంలోని బృందం సెనేట్‌కు సమర్పించే నివేదికకు వ్యాన్‌హోలెన్ ప్రతిపాదన ఓ చేర్పులాంటిది. కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేయాలనుకున్న పాకిస్థాన్‌కు అమెరికా సెనేట్ బృందం చేసిన ప్రతిపాదన కలిసి వచ్చే అంశంగా భావిస్తున్నారు.

మొబైల్‌ఫోన్, ఇంటర్‌నెట్ సర్వీసుల్ని పునరుద్ధరించాలని, కర్ఫ్యూసహా ఇతర ఆంక్షల్ని ఉపసంహరించాలని, అధికరణం 370 రద్దు తర్వాత నిర్బంధించినవారిని విడుదల చేయాలని వ్యాన్‌హోలెన్ ప్రతిపాదించారు. కాశ్మీర్‌లో పరిస్థితిపై తన ప్రతిపాదనను కాంగ్రెస్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించిందని, అక్కడ మానవ హక్కులు అమలవుతున్న తీరుపై పర్యవేక్షిస్తున్నామని వ్యాన్‌హోలెన్ చెప్పినట్టు ద హిందూ పేర్కొన్నది. భారత్ దీనిపై తగిన విధంగా స్పందిస్తుందని వ్యాన్‌హోలెన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

**యూఎస్ సెనేటర్‌కు చేదు అనుభవం**

యూఎస్ సెనేటర్ క్రిస్ వాన్ హోలెన్‌కు చేదు అనుభవం ఎదురైంది. ఆయన కాశ్మీర్ పర్యటనకు కేంద్రం అనుమతిని నిరాకరించింది. కాశ్మీర్ పర్యటనకు ఇది సరైన సమయం కాదని భారత ప్రభుత్వం తనకు చెప్పినట్టు డెమోక్రాటిక్ పార్టీ సెనేటర్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. కాగా, కాశ్మీర్‌కు తనను అనుమతించకపోవడంతో కేంద్రం తీరుపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. సమాచార వ్యవస్థ స్తంభించిపోయిన కాశ్మీర్‌లో క్షేత్రస్థాయి పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు వెళ్లడమే తన పర్యటన ఉద్దేశమనీ, అయితే కాశ్మీర్‌లో ఏం జరుగుతున్నదో చూడటానికి భారత ప్రభుత్వం కోరుకోవడంలేదని హోలెన్ ఆరోపించారు. " దాచడానికి ఏమీ లేనప్పుడు, కాశ్మీర్ పర్యటనకు సందర్శకులను అనుమతించడానికి భారత ప్రభుత్వం భయపడాల్సిన పని లేదు" అని తన వ్యక్తిగత అభిప్రాయంగా హోలెన్ తెలిపారు. ప్రపంచంలో రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలైన భారత్, అమెరికాలు విలువల గురించి చాలా మాట్లాడుకున్నాయనీ, ప్రస్తుత సమయంలో పారదర్శకత పాటించడం కీలకమని వాషింగ్టన్ పోస్ట్ తో మాట్లాడుతూ వివరించారు.

## ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో..

- ప్రధానికి 71మంది రిటైర్డ్ ఉన్నతాధికారుల లేఖ
- పాత ఫైళ్లను తిరగదోడటానికి కాలపరిమితి విధించాలని డిమాండ్

**న్యూఢిల్లీ:** ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఆర్థికశాఖలోని నలుగురు మాజీ అధికారులపై విచారణకు ఆదేశించడానికి నిరసనగా 71మంది రిటైర్డ్ ఉన్నతాధికారులు ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. అలాంటి చర్య వల్ల సమర్థులు, నిజాయితీపరులైన అధికారులు కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఆత్మ స్థైర్యాన్ని దెబ్బతీస్తుందని వారు తమ లేఖలో గుర్తు చేశారు. పాత ఫైళ్లను తిరగదోడకుండా హేతుబద్ధమైన కాలపరిమితిని విధించాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసం రిటైర్డ్ లేదా సర్వీస్‌లో ఉన్న అధికారులను ఎంపిక చేయడం ఆందోళన కలిగిస్తోందని వారు తమ లేఖలో తెలిపారు. ఈ లేఖపై సంతకాలు చేసినవారిలో క్యాబినెట్ మాజీ కార్యదర్శి కెఎం చంద్రశేఖర్, జాతీయభద్రత మాజీ సలహాదారు శివశంకర్‌మీనన్, విదేశాంగశాఖ మాజీ కార్యదర్శి సుజాతాసింగ్, పంజాబ్ మాజీ డీజీపీ జులియో రెబీరో ఉన్నారు.

ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి విదేశీ పెట్టుబడులకు ఎఫ్‌ఐపీబీ అనుమతి మంజూరు చేయడంపై నిటి ఆయోగ్ మాజీ సీఈవో సింధుశ్రీకుల్లర్, చిన్న,మధ్యతరహా పరిశ్రమలశాఖ మాజీ కార్యదర్శి అనూప్ కె పూజారి, ఆర్థికశాఖలో అప్పటి డైరెక్టర్ ప్రబోధ్ సక్సేనా, ఆర్థిక వ్యవహారాల మాజీ కార్యదర్శి రవీంద్రప్రసాద్‌లపై విచారణకు సీబీఐకి గత నెలలో కేంద్రం అనుమతిచ్చింది. దీనిపై స్పందించిన రిటైర్డ్ అధికారులు ప్రధానికి లేఖ రాశారు. రాజకీయ లక్ష్యాల కోసం చేపట్టే ఇలాంటి చర్యల వల్ల అధికారులకు రక్షణ లేదన్న అభిప్రాయం కలుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీల్లో చాలా వరకు నిబంధనలను ఉల్లంఘించినవేనని, అందుకు అధికారులెలా బాధ్యులవుతారని వారు ప్రశ్నించారు.

ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు(ఎఫ్‌డీఐలకు) అనుమతి ఇవ్వాల్సిందిగా అప్పటి ఆర్థికమంత్రికి విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎఫ్‌ఐపీబీ) సిఫారసు చేసినట్టు ఆర్థిక వ్యవహారాలశాఖ(డీఈఏ) మాజీ కార్యదర్శి,ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తెలిపారు. ఉల్లంఘనలు జరిగినట్టు ఎఫ్‌ఐపీబీకి ఎలాంటి సమాచారమూ లేదని దువ్వూరి సుబ్బారావు తెలిపారు. ఈ కేసులో సుబ్బారావు వాంగ్మూలాన్ని సీబీఐ రికార్డు చేసింది. ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎఫ్‌ఐపీబీకి ఎక్స్ అఫీషియో చైర్మన్‌గా వ్యవహరించడం సంప్రదాయంగా ఉండేది. ఎఫ్‌ఐపీబీని మోడీ సర్కార్ 2017లో రద్దు చేసింది.

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో అవినీతి, నగదు అక్రమ చలామణి(మనీలాండరింగ్)కి పాల్పడ్డట్టు మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరంపై ఆరోపణలున్నాయి. చిదంబరాన్ని సీబీఐ ఇప్పటికే అరెస్ట్ చేసి విచారించింది. ఐఎన్‌ఎక్స్ మీడియాలోకి చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నవేళ 2007లో రూ.305 కోట్ల విదేశీ నిధులు వచ్చాయని సీబీఐ 2017 మే 15న ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. 2018లో దీనికి సంబంధించి మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ, చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి చెందిన రూ.54 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ఈ కేసులో చిదంబరంతోపాటు ఆయన కుమారుడు కార్తి, ఐఎన్‌ఎక్స్ మీడియా సహవ్యవస్థాపకురాలు ఇంద్రాణీ ముఖర్జీ నిందితులుగా ఉన్నారు.

## హుజూర్‌నగర్‌లో ప్రజానాయకున్ని బలపరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని చెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలకు హాజరయ్యేందుకు వచ్చిన సందర్భంగా తమ్మినేని శనివారం శివమ్స్ గార్డెన్‌లో విలేకర్లతో మాట్లాడారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో పార్టీలకతీతంగా ఉన్న ప్రజా నాయకున్ని ఓటింగ్ ద్వారా బలపరుస్తామని చెప్పారు. టెక్నికల్ సమస్యలతో తమ పార్టీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణకు గురికావడం బాధాకరమన్నారు. అయితే, ఎవరికి మద్దతివ్వాలన్నది రాష్ట్ర కమిటీ నిర్ణయించిన తరువాత ప్రకటిస్తామని తెలిపారు. నెలరోజుల కిందటే ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ఇప్పుడు తూ.తూ మంత్రంగా చర్చలు జరిపారని విమర్శించారు. సమ్మెలో పాల్గొంటున్న వారిని నిర్బంధించడం సరికాదన్నారు. కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇతర పార్టీలతో తిట్టడంతోనే కాలయాపన చేస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు శశిధర్, హేమలత ఉన్నారు.

# సమ్మె సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

కార్మికులు పట్టించుకోలేదు. ఒక్క ఉద్యోగి కూడా విధుల్లో చేరలేదు. సర్కారు బెదిరింపులు మాత్రం తగ్గలేదు. ప్రత్యామ్నాయంగా పెద్దసంఖ్యలో డ్రైవర్లు, కండక్టర్లు విధుల్లో చేరుతున్నారంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు మైండ్‌గేమ్ ప్రారంభించారు.

**మస్తు చేశాం : మంత్రి పువ్వాడ**

రాష్ట్రవ్యాప్తంగా నిత్యం 10వేల బస్సుల్ని తిప్పేవాళ్లమని, శనివారం 9వేల బస్సుల్ని తిప్పా మని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రకటిం చారు. సమ్మె ప్రభావం ప్రయాణీకులపై ఏమాత్రం లేదని చెప్పేందుకు ప్రయత్నించారు. 2,129 టీఎస్‌ఆర్టీసీ బస్సులు, 1,717 అద్దెబస్సులు, 1,155 ప్రయివేటు బస్సుల్ని నడిపినట్టు ఆయన లెక్కలు చెప్పారు. ప్రయివేటు విద్యాసంస్థల నుంచి 1,195 బస్సులు, మ్యాక్సీ క్యాబ్‌తో పాటు 2,278 ఇతర వాహనాలను తిప్పామని తెలిపారు. 3,978 మంది డ్రైవర్లు, 2,195 మంది తాత్కాలిక కండక్టర్లను నియమించామన్నారు. ఆదివారం నాటికి వీరి సంఖ్య మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపట్ల ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఇప్పటికైనా సమ్మె విరమించి విధుల్లో చేరాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడికక్కడ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు.

**తాడోపేడో : జేఏసీ**

టీఎస్‌ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి(టీఎమ్‌యూ) కో కన్వీనర్లు కె రాజిరెడ్డి (ఎంప్లాయిస్ యూనియన్), వీఎస్ రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఓ సుధ (సూపర్‌వైజర్స్ అసోసియేషన్) మీడియాతో మాట్లాడారు. సమ్మె వందశాతం సక్సెస్ అయ్యిందని, ప్రభుత్వ బెదిరింపులు ఆర్టీసీ కార్మికులకు కొత్తేం కాదని తేల్చిచెప్పారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఆదివారం ఉదయం 8 గంటలకు అన్ని రాజకీయపార్టీలు, కార్మిక, విద్యార్థి సంఘాల మద్దతు కోరుతూ లేఖలు సమర్పించనున్నట్టు తెలిపారు. అదేరోజు ఉదయం 11 గంటలకు ట్రేడ్ యూనియన్ల రౌండ్‌టేబుల్ సమావేశాలు, సాయంత్రం 5 గంటలకు ఆర్టీసీ కార్మికులు కుటుంబాలతో సహా అన్ని డిపోల వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటలకు గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించి, 10 గంటలకు ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్షలు చేపట్టనున్నట్టు జేఏసీ నేతలు తెలిపారు.

**నేడు అద్దెబస్సుల కోసం నోటిఫికేషన్**

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు ఎక్కువ బస్సుల్ని తిప్పామని ఆర్టీసీ యాజమాన్యం ఓ ప్రకట నలో తెలిపింది. అదనంగా 2,500 అద్దెబస్సుల కోసం నోటిఫికేషన్ ఇచ్చే ప్రక్రియ నడుస్తున్నదని, ఆదివారం విడుదల చేస్తామని అధికారులు చెప్పా రు. ఆ బస్సులు వస్తే సమ్మె ప్రభావం ఏమాత్రం ప్రయాణీకులపై ఉండదని అన్నారు. పలుచోట్ల డిపోల నుంచి బస్సుల్ని తీసేందుకు ప్రయత్నించిన ప్రయివేటు డ్రైవర్లను ఆర్టీసీ కార్మికుల అడ్డుకు న్నారు. యాదగిరిగుట్ట డిపో నుంచి బస్సును తీస్తున్న ప్రయివేటు డ్రైవర్‌పై ఓ మహిళా కండక్టర్ చెప్పుతో దాడి చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది.



బస్టాండ్‌లో పోలీసులు



బస్టాండ్‌లో ప్రయివేటు బస్సులు

**మైండ్‌గేమ్**

సమ్మె ప్రభావం ప్రజలపై ఏమాత్రం లేదని చెప్పేందుకు ప్రభుత్వం శక్తియుక్తులన్నీ ప్రయోగి స్తున్నది. అన్ని బస్సులు తిప్పాం...ఇంతమందిని రిక్రూట్ చేశాం...సాయంత్రానికి ఇంతమంది కార్మికులు విధులకు హాజరయ్యారు అంటూ మైండ్‌గేమ్ ప్రారంభించింది. వాస్తవానికి ఏ ఒక్క ఆర్టీసీ కార్మికుడు కూడా శనివారం సాయంత్రం 6 గంటల్లోపు విధుల్లో చేరలేదు. దీంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఈ గడువును ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పెంచారు. ఆలోపు విధుల్లో చేరకుంటే ఉద్యోగాలు కోల్పోతారంటూ బెదిరింపులకు దిగారు. మధ్యాహ్నం ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ఆర్టీసీ సమ్మెపై సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. దీనిలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది.

**ప్రయివేటీకరణ దిశగా...**

సమ్మెను సాకుగా చూపి, ఆర్టీసీని విచ్ఛిన్నం చేసి, పూర్తిగా ప్రయివేటీకరించే దిశగా ప్రభుత్వం పావులు కదుపుతున్నది. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం పరోక్షంగా ఈ అంశాలను వెల్లడించారు. ప్రభుత్వం వద్ద మూడు ప్రత్యామ్నాయాలు ఉన్నాయని చెప్పారు. ఆర్టీసీలో ఇప్పుడున్న 2,150 బస్సులకు అదనంగా మరో మూడు నుంచి నాలుగు వేల ప్రయివేటు బస్సులను అద్దెకు తీసుకుని నడపాలనే ఆలోచన ఉన్నట్టు తెలిపారు.

దీనికోసం పర్మినెంట్ ఉద్యోగాల ప్రశ్నే లేకుండా పూర్తిగా రోజువారీ కూలీ లెక్కన డ్రైవింగ్ లైసెన్సు కలిగిన యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారికి శిక్షణ ఇవ్వడం, తద్వారా ఉపాధి కల్పించడం రెండో ప్రత్యామ్నాయంగా ఉన్నట్టు వెల్లడించారు. అదే సమయంలో స్వరాష్ట్రం సహా పొరుగు రాష్ట్రాల నుంచి 6 నుంచి 7 వేల ప్రయివేటు బస్సులకు రూట్ పర్మిట్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలు ఉన్నట్టు తెలిపారు. ప్రపంచబ్యాంక్ ఆదేశాల అమలుకు ఇంతకు మించిన అవకాశం రాదని సదరు మంత్రి సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్టీసీని విభజించే ప్రయత్నాలు చేశారని, తామిప్పుడు వాటిని ముందుకు తీసుకెళ్తున్నామని అన్నట్టు సమాచారం.

**తెలంగాణ ఆర్టీసి కార్మికులకు ఏపీ సంఘాల మద్దతు**

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏపీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, (ఎస్‌డబ్ల్యూఎఫ్), ఏపీఎస్‌ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్, ఏపీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్లు శనివారం వేరు వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. సమ్మెలో ఉన్న కార్మికులను బెదిరించి, అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపాయి. తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టకు పోకుండా, ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయమైనదని, వారి డిమాండ్లు సహేతుకమైనవిగా తెలిపాయి. వివిధ డిపో యూనిట్లలో సంఘీభావ కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్షులు జిలానీబాషా, ప్రధాన కార్యదర్శి సుందరయ్య పిలుపునిచ్చారు.

| | | | | |
|---|---|---|---|---|
| సెన్సెక్స్ ▼433 37,673 | నిఫ్టీ ▼139 11,174 | డాలరుకు రూపాయి విలువ 70.88 | బంగారం(10.గ్రా) రూ. 39,335 | వెండి (కేజీ) రూ. 48,000 |





| కోడి గుడ్లు (వందకి) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 392 | విజయవాడ | 380 |
| ఒక్కగుడ్డుకు | 4.70 | చెన్నై | 382 |
| వరంగల్ | 381 | ముంబయి | 385 |



## మడత ఫోన్ బుకింగ్స్‌కు మహా స్పందన!



**ముంబయి:** స్మార్ట్‌ఫోన్ల తయారీ దిగ్గజం శాంసంగ్ లగ్జరీ ఫోన్ల విక్రయంలో సరికొత్త రికార్డును లిఖించింది. సంస్థ ఇటీవల లాంచ్ చేసిన లగ్జరీ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఫోల్డ్ విక్రయాల్లో రికార్డు స్థాయిలో జరిగినట్టుగా సంస్థ వెల్లడించింది. ఈ ఫోన్ ప్రీ బుకింగ్‌లు మొదలు పెట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే సూపర్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ హాట్ కేకుల్లా బుక్ అయిపోయాయని సంస్థ వివరించింది. శుక్రవారం అధికారిక ఆన్‌లైన్ స్టోర్‌లో ప్రీ-బుకింగ్‌లు మొదలు పెట్టిన 30 నిమిషాల వ్యవధిలో మొత్తం 1,600 యూనిట్ల గెలాక్సీ ఫోల్డ్ ప్రీమియం ఫోన్‌లను కంపెనీ విక్రయించేసింది. దీంతో సంస్థ ప్రీ-బుకింగ్స్‌ను మూసివేసింది. మీడియా కథనాల మేరకు ఫోన్‌లను ముందే బుక్ చేసుకున్న కొనుగోలుదారుల్లో అత్యధికులు మొత్తం రూ. 1,64,999 ముందస్తుగా చెల్లించి మరీ వీటిని సొంతం చేసుకోవడం విశేషం.

## జెబ్రానిక్స్ నుంచి 'మాస్టర్‌పీస్' స్పీకర్



**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** ఐటీ ఉపకరణాలు, సౌండ్ సిస్టమ్స్‌లను తయారు చేసే ప్రముఖ సంస్థ జెబ్రానిక్స్ సరికొత్త వైర్‌లెస్ స్పీకర్‌ను మార్కెట్లోకి ఆవిష్కరించింది. గరిష్టంగా దాదాపు 12 గంటల ప్లేబ్యాక్ సమయంతో 'మాస్టర్‌పీస్' పేరుతో తాము వైర్‌లెస్ ఫంక్షన్‌తో కూడిన పోర్టబుల్ వైర్‌లెస్ స్పీకర్‌ను మార్కెట్లోకి తెచ్చినట్టుగా జెబ్రానిక్స్ ఇండియా డైరెక్టర్ ప్రదీప్ దోషి తెలిపారు. నాణ్యమైన ధ్వనితో పాటు మేటి బ్యాటరీ బ్యాకప్‌ను కోరుకునే వారికి 'మాస్టర్‌పీస్' అద్భుతమైన ఛాయిస్ అని ఆయన అన్నారు. ఇందులో ఎఫ్ఎం రేడియో కూడా అంతర్నిర్మితమై ఉందని తెలిపారు. దీనిని యూఎస్‌బీ, యాక్స్, మైక్రో ఎస్‌డీ మోడ్‌లలో కూడా వినియోగించవచ్చని ఆయన తెలిపారు. ఈ డివైస్ పూర్తిగా స్టిరియో అనుభవాన్ని అందించేలా అమరికలు చేసినట్టుగా వివరించారు. ఈ ఉత్పత్తి దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌స్టోర్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## ఆంధ్రాబ్యాంక్‌లో ఘనంగా బతుకమ్మ

**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ఆంధ్రాబ్యాంక్ ఘనంగా నిర్వహించింది. బ్యాంక్ కోఠి కార్యాలయం అవరణలోని ఈ వేడుకలను పూర్తి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.కార్యక్రమంలో హైదరాబాద్ జంటనగరాల్లో ఉన్న వివిధ ఆంధ్రాబ్యాంక్ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. రంగురంగుల పూలతో తయారు చేసిన బతుకమ్మకు తొలత పూజలు నిర్వహించిన సిబ్బంది.. ఆ తరువాత చప్పట్లు కలుపుతూ, కోలాటమాడుతూ బతుకమ్మ వేడుకలను వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్కిల్‌కు చెందిన డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.డి.ఎన్.వి. ప్రసాద్, అసిస్టెంట్ జనర్ మేనేజర్లు టి.ఎస్. రమేశ్ బాబు, ఓబుల్‌రెడ్డితో పాటు హైదరాబాద్-1 జోన్‌కు చెందిన జోనల్ మేనేజర్ కె.రాజేంద్ర కుమార్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాలుపంచుకొని.. సిబ్బందిని ప్రోత్సహించారు.

# ఏమాత్రం బాగోలేదు

**23 శాతం పడిపోయిన కంపెనీల ఆర్డర్లు**

- పరిశ్రమల సామర్థ్యపు వినియోగం73.6 శాతానికి..!
- ఆర్థికంలో 2008 సంక్షోభం నాటి గడ్డు పరిస్థితులు
- ఉత్పత్తీ పడిపోయింది.. ఉద్యోగితా కుంగిపోతోంది...
- భారతీయ రిజర్వు బ్యాంక్ సర్వేలో ఆశ్చర్యకర నిజాలు



**నవతెలంగాణ, వాణిజ్య విభాగం:** దేశంలో వ్యాపార వాతావరణం ఏమాత్రం బాగోలేదని భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) నిర్వహించిన సర్వేల్లో తేలింది. 2008లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం సమయంలో ఎలాంటి దుర్భర పరిస్థితులు నెలకొని ఉన్నాయో.. దాదాపు దేశంలో ఇప్పుడూ అలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయని ఆర్బీఐ సర్వే తేల్చింది. ఇటీవల ముగిసిన సెప్టెంబరు త్రైమాసికంలో ఇలాంటి పరిస్థితులు మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయని ఆర్బీఐ తన సర్వేలో వివరించింది. దేశంలో నెలకొన్న మందగమన పరిస్థితుల నేపథ్యమే.. సర్కారు ఇటీవల కార్పొరేట్ పన్నును భారీగా తగ్గించాలని నిర్ణయించేందుకు కారణం కావచ్చొని సర్వే అభిప్రాయపడింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో వ్యాపార కార్యకలాపాలు తీవ్ర గడ్డ పరిస్థితిని ఎదుర్కొన్నట్టుగా ఆర్బీఐ తెలిపింది. 2013-14 తరువాత వ్యాపార కార్యకలాపాలు ఇంతగా కుంగడం ఇదే తొలిసారి అని.. ఆర్థిక సంక్షోభం తరువాత పరిస్థితులు ఈ స్థాయికి దిగజారడం ఇది రెండోసారి అని సర్వే తేల్చింది. తొలి త్రైమాసికంలో దేశంలో తయారీ కంపెనీల ఆర్డర్లు 23 శాతం మేర కుంగిపోవడం.. దేశంలోని మందగమన తీవ్రతకు అద్దంపడుతోందని సర్వే తెలిపింది. కొత్త ఆర్డర్లు గణనీయంగా పడిపోవడం ఆర్థిక వ్యవస్థకు ఒక ప్రమాదకరమైన హెచ్చరికవంటిదని ఈ సర్వేలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో సంస్థల పెండింగ్ ఆర్డర్లు అంతకు ముందు త్రైమాసికాలకు కొనసాగింపుగానే పడిపోతూ వచ్చాయని ఆర్బీఐ సర్వే వివరించింది. జూన్ త్రైమాసికంలో పరిశ్రమల సామర్థ్య వినియోగం కనిష్టంగా 73.6 శాతానికి పడిపోయింది. అంతకు ముందు త్రైమాసికంలో ఇది 76.1 శాతానికి కుంగింది. నోట్ల రద్దు ప్రభావం తరువాత దేశంలో పరిశ్రమల సామర్థ్యపు వినియోగం ఇంత కనిష్టానికి పడిపోవడం ఇదే తొలిసారని ఆర్బీఐ తెలిపింది. పరిశ్రమల సామర్థ్యపు వినియోగం 76 శాతానికి చేరడం ఒక ప్రమాదకర స్థాయి అని.. ఇక్కడి నుంచి మూలధన పెట్టుబడుల చక్రం తిరిగి పుంజుకోవాల్సి ఉంటుందని.. సెప్టెంబరు త్రైమాసికంలో ఇది మరింతగా దిగజారి 73.6 శాతానికి చేరడం శోచనీయమేనని ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్‌సేన్ అన్నారు. ఇది మరింత తగ్గడంతో దేశంలో క్యాపెక్స్ సైకిల్ ఇప్పట్లో కోలుకొనే అవకాశాలు కనుచూపుమేరలో కూడా కనిపంచడం లేదని అన్నారు.

### సంక్షోభం నాటి స్థాయికి బీఏఐ..

దేశంలోని తయారీ కంపెనీల వ్యాపార వాతావం ణపు గుణాత్మక అంచనాను వెల్లడించే 'బిజినెస్ అసెస్‌మెంట్ ఇండెక్స్' (బీఏఐ) 2008 నాటి ఆర్థిక సంక్షోభం స్థాయికి చేరిందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో ఆయా సంస్థల వ్యాపార అంచనాలు కూడా కుంచించుకు పోయాయని ఆర్బీఐ సర్వే నివేదిక తెలిపింది. సెప్టెంబరు తో ముగిసిన రెండో త్రైమాసికంలో ఆర్డర్లు రావడం క్షీణించడంతో పాటు.. ఆ మేరకు ఉత్పిత్తి తగ్గిపోవడం, ఉద్యోగ అవకాశాలు పడిపోవడం కనిపించిందని వ్యాపార వర్గాలు ఆర్బీఐ సర్వేలో తేల్చి చెప్పారు. దేశంలో ఎగుమతులు, దిగుమతుల్లో ప్రమాదకర ఆశావాదం కల్పిస్తోందని సర్వేలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఆర్బీఐ కన్జ్యూమర్ కాన్ఫిడెన్స్ సర్వేలో కూడా ఇదే తరహా అభిప్రాయం వెల్లడైన సంగతి తెలిసిందే.

## పెట్టుబడుల ఉపసంహరణకు కొత్త విధానం..



**న్యూఢిల్లీ:** దేశంలో మందగమన పరిస్థితులు ముదురుతూ పన్ను ఆదాయం పడిపోతున్న వేళ సర్కారు ద్రవ్యలోటును పూడ్చుకొనేందుకు గాను భారీ స్థాయిలో పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు గాను కేంద్ర కెబినెట్ కొత్త తరహాలో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా పీఎస్‌యుల ప్రయివేటీకరణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయనుందని సీనియర్ అధికారులు పేర్కొన్నారు. ఈ కొత్త పాలసీలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో డీఐపీఏఎమ్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మెనెజ్‌మెంట్) సర్కారు సంస్థల్లో వ్యూహాత్మక వాటాల అమ్మకాలను చేపట్టనుంది. ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందని అధికారులు తెలిపారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.1.05 లక్షల కోట్లను సమీకరించాలని ప్రభుత్వం లక్షంగా పెట్టుకున్నందున.. ఈ టార్గెట్ సాధనకు గాను భవిష్యత్తులో ఇకపై నిటి అయోగ్, డీఐపీఏఎమ్ సంయుక్తంగా పెట్టబడుల ఉపసంహరణను చేపడుతాయని ఆర్థికశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేట్ పన్ను మినహాయింపు నిర్ణయానికి ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తోందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీలో ద్రవ్యలోటును 3.3శాతం తేవడానికి పెట్టుబడుల ఉపసంహరణ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావనగా ఉందని వారు చెబుతున్నారు.

## మూడు నెలల్లో.. 6000 కోట్లు..!



**న్యూఢిల్లీ:** దేశంలో మందగమన ఛాయలు కనిపిస్తున్నప్పటికీ పబ్లిక్ ఇష్యూల (ఐపీవోల) రూపంలో కార్పొరేట్ సంస్థలు మార్కెట్ల నుంచి దండిగానే నిధులను సమీకరించుకుంటున్నాయి . సెప్టెంబరుతో ముగిసిన మూడు నెలల కాలంలో దాదాపు 10 ఐపీవోల ద్వారా భారత్‌లోని కార్పొరేట్ సంస్థలు దాదాపు రూ.6000 కోట్ల మేర నిధులను సమీకరించాయి. జులై-సెప్టెంబరు త్రైమాసికంలో 10 ఐపీవోలు ప్రాథమికర మార్కెట్లోకి వచ్చాయి. సెప్టెంబరు త్రైమాసికంలో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లోకి వచ్చిన ఐపీవోలను విశ్లేషించి చూస్తే.. భారత్ ఆరో స్థానంలో నిలిచిందని ఈవై ఇండియా ఐపీవో ట్రెండ్స్ క్యూ3 నివేదిక-2019 తెలిపింది. అంతకు ముందు సంవత్సరంలో సెప్టెంబరు త్రైమాసంలో మొత్తం 22 ఐపీవోలు భారత ప్రాథమిక మార్కెట్లోకి వచ్చినట్టుగా నివేదిక వెల్లడించింది. ఇదే సమయంలో ప్రధాన మార్కెట్లోకి వచ్చిన ఐపీవోల సంఖ్య మూడు నుంచి నాలుగుకు పెరిగిందని నివేదిక వెల్లడిలంచింది. మరోవైపు ఎస్ఎంఈ మార్కెట్లో సెప్టెంబరు త్రైమాసికంలో కేవలం ఆరు ఐపీవోలు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది ఇదే సమయంలో మార్కెట్లోకి వచ్చిన ఐపీవోల సంఖ్య 42గా నిలిచిందని నివేదిక విశ్లేషించింది. ప్రధానంగా రిటైల్, రియల్ ఎస్టేట్, ఆతిథ్యం, నిర్మాణ రంగం, టెక్నాలజీ విభాగాల్లో ఎక్కువగా ఐపీవోలు నమోదు అయినట్టుగా ఈ నివేదిక తెలిపింది. ఇటీవలి కాలంలో సర్కారు ప్రకటించిన పలు ఉద్దీపన నేపథ్యంలో వచ్చే ఏడాది మొదటి అర్థభాగం నుంచి ఐపీవోల జోరు మరింతగా పెరిగే అవకాశం ఉందని ఈ నివేదిక తెలిపింది.

## ఏపీకి నిధులివ్వండి..

- రైతు భరోసా పథకం ప్రారంభోత్సవానికి రండి: ప్రధాని మోడీతో ఏపీ సీఎం జగన్



**న్యూఢిల్లీ:** సకాలంలో నిధులు విడుదల చేసి రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ప్రధాని మోడీని ఏపీ సీఎం జగన్ విజ్ఞప్తి చేశారు .శనివారం ప్రధానితో సమావేశమైన ముఖ్యమంత్రి సుదీర్ఘంగా ఎకరువుపెట్టారు. 15 నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభోత్సవానికి రావాలని మోడీ జగన్ ఆహ్వానించారు. పథకం ప్రారంభం రోజునే ఏపీలోని కౌలు రైతులతో సహా మొత్తం 53 లక్షల మందికి లబ్ధి కల్పించనున్నట్టు వివరించారు. వీటితో పాటు కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.61,071.51 కోట్ల రూపాయలు అవసరమవుతాయని గత ప్రభుత్వం ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్లో పేర్కొంది.ఈ విషయాన్ని సీఎం ప్రస్తావించారు. ఇప్పటి వరకూ కేంద్రం నుంచి వచ్చింది రూ. 6,739 కోట్లు మాత్రమేనని తెలిపారు. రెవెన్యూలోటు,గ్రాంట్లు, పోలవరం ప్రాజెక్టులో సవరించిన అంచనాలు ఆమోదించాలని విన్నవించారు. ప్రాజెక్టు కోసం ఇంకా భూసేకరణ, పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయాల్సి ఉన్నదని వివరించారు.వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి కింద ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని కోరారు. కృష్ణా, గోదావరి నదుల అనుసంధానం గురించి ప్రస్తావించారు. గోదావరి నీటిని నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు తరలించడం ద్వారా కృష్ణా డెల్టా ను స్థిరీకరించడంతో పాటు, రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు సాగు నీరు సమృద్ధిగా లభించి, ఆర్థికంగా ఆ ప్రాంతం పురోగమించడానికి దోహదపడుతుందని తెలిపారు. నవరత్నాలుకు చేయూతనివ్వాలని కోరారు.

**విభజనతో నష్టం..**

ఏపీ విభజనతో రాష్ట్రం చాలా నష్టపోయింది. ముఖ్యంగా పరిశ్రమలు, సేవా రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని జగన్ ప్రధానికి వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో పెరుగుదల లేకపోగా తగ్గిందనీ, 'జీవీఏ' (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వీటి వాటా 76.2శాతం నుంచి 68.2 శాతానికి పడిపోయిందన్నారు. తలసరి ఆదాయం కూడా రూ.1.46 లక్షల నుంచి రూ.1.29 లక్షలకు పడిపోయిందని వివరించారు.

## భారత్, బంగ్లాల మధ్య పలు ఒప్పందాలు

**న్యూఢిల్లీ :** రక్షణ, వాణిజ్యం , రహదారుల కనెక్టవిటీ వంటి రంగాలకు సంబంధించి భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య పలు ఒప్పందాలు జరిగాయి. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం గురువారం ఢిల్లీ చేరుకున్న బంగ్లా ప్రధాని షేక్ హసీనా మోడీతో శనివారం భేటీ అయ్యారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన ఎల్పీజీ సరఫరా ప్రాజెక్టుతో పాటు మరో రెండు ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోడీ మాట్లాడుతూ ఇరుదేశాల ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇరుదేశాలు సంయుక్తంగా ఈ ఏడాది 12 ప్రాజెక్టులను ప్రారంభించినట్టు వెల్లడించారు. బంగ్లాదేశ్ నుంచి ఎల్పీజీని తీసుకువచ్చే ప్రాజెక్టులో ఇరుదేశాల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని అన్నారు.. ఈరోజు ప్రారంభించిన పైపులైన్ అనేది పర్యావరణ సహితంగా, తక్కువ ఖర్చుతో కూడుకున్నదని అన్నారు. బంగ్లాదేశ్‌కు రుణ సదుపాయం కల్పించే ఒప్పంద పొడిగింపునకు సంబంధించిన అంగీకార పత్రాలపై ఈ సందర్భంగా ఇరుదేశాలకు చెందిన అధికారులు సంతకాలు చేశారు. దీంతోపాటు తీర ప్రాంత నిఘా వ్యవస్థకు సంబంధించిన అంశంపై ఎంఒయూ కుదుర్చుకున్నారు.

# బీఆర్‌కే భవన్‌లోకి నో ఎంట్రీయే...

**మీడియాను అనుమతించొద్దన్న సీఎం**

- జర్నలిస్టుల కోసం ఆదర్శనగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్లలో ఓ గది
- టీఆర్టీ ఆందోళన నేపథ్యంలో ప్రగతి భవన్ చుట్టూ మరిన్ని ఆంక్షలు



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

రాష్ట్రంలో మీడియాపై ఆంక్షలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. అది బూర్గుల రామకృష్ణారావు భవన్ అయినా, ప్రగతి భవన్ అయినా.. మరేదైనా సరే... తాము చెప్పిందే రాసుకోవాలి తప్ప, ప్రశ్నించకూడదు, సమాచారం తెలుసుకోకూడదనే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. బీఆర్‌కే భవన్‌లోకి సచివాలయాన్ని తరలించిన నేపథ్యంలో.. ఆ భవనంలోకి ఇప్పటి వరకూ మీడియాను అనుమతించలేదు. అయితే సామాగ్రి, ఫైళ్లన్నింటినీ చాంబర్లలో సర్దిన తర్వాత.. జర్నలిస్టులను అక్కడికి అనుమతిస్తారంటూ మొన్నటి వరకూ అధికారులు చెప్పుకొచ్చారు. కానీ తాజా సమాచారం ప్రకారం.. ఇప్పుడే కాదు, మున్ముందు ఎప్పుడూ కూడా ఆ భవనంలోకి ప్రెస్‌ను అనుమతించొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్.. ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. మంత్రులు, ఉన్నతాధికారులు అధికారికంగా నిర్వహించే విలేకరుల సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ఆదర్శనగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్లలో ఓ గదిని కేటాయించాలంటూ ఆయన సూచించినట్టు సమాచారం. బీఆర్‌కే భవన్‌లోని వార్తలను కవర్ చేసే మీడియా ప్రతినిధులందరూ అక్కడే ఉండాలి తప్ప.. ఆ భవన్ వైపు తొంగి చూడొద్దంటూ ఆంక్షలు విధించనున్నారు. ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ సమావేశం సందర్భంగా ప్రగతి భవన్ అధికారులు.. మీడియాపట్ల అనుసరించిన నిర్లక్ష్య వైఖరిపట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. దాదాపు 6.30 గంటలపాటు ఫుట్‌పాత్‌పైన్నే పడిగాపులు కాయాల్సి రావటంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్న సంగతి విదితమే. ఇది జరిగిన రెండు రోజులకే టీఆర్టీ అభ్యర్థులు ప్రగతి భవన్ ముట్టడి పేరుతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వారిని అదుపుచేయటం పోలీసులకు కత్తిమీద సామే అయింది. ఈ నేపథ్యంలో ప్రగతి భవన్ పరిసర ప్రాంతాల్లో మరిన్ని ఆంక్షలు విధించాలని సీఎం నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఆయన ఆదేశించినట్టు ఓ అధికారి చెప్పారు. మరోవైపు సచివాలయాన్ని తరలించిన నేపథ్యంలో... బీఆర్‌కే భవన్‌లో ఇప్పటికీ పూర్తిస్థాయి వ్యవస్థ ఏర్పాటు కాలేదు. చాలా చాంబర్లలో ప్రింటర్లు, కంప్యూటర్లను ఇంకా అమర్చలేదు. దీంతో కనీసం ఫ్యాక్స్‌ను పంపేదుకుగానీ, ప్రింట్ తీసేందుకుగానీ అవకాశం లేకుండా పోయిందని అక్కడి సిబ్బంది తెలిపారు. సీఎంవోతోపాటు అనేక ఇతర ప్రధాన కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని వారు వివరించారు. ఇదంతా సర్దుబాటు కావటానికి ఇంకో పది, పదిహేను రోజులు పట్టొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## హైదరాబాద్‌కు చేరుకున్న స్పీకర్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికారిక విదేశీ పర్యటనను ముగించుకుని తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఆఫ్రికా ఖండంలోని ఉగాండా దేశ రాజధాని కంపాల నగరంలో జరుగుతున్న కామన్వెల్త్ దేశాల 64వ స్పీకర్ల సదస్సులో పాల్గొనడానికి సెప్టెంబర్ 25న ఆయన వెళ్లిన విషయం విదితమే. శనివారం తెల్లవారుజామున శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. బాన్సువాడ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కామన్వెల్త్ దేశాల స్పీకర్ల సమావేశంలో పాల్గొన్న అనంతరం యూరప్‌లో పర్యటించారు. ఆయన వెంట శాసనసభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు కూడా ఈ అధికారిక పర్యటనలో ఉన్నారు.

# పండుగ వేళా.. పుంజుకోవట్లే

**ఊపందుకోని కొనుగోళ్లు**

- ఆర్థిక మందగమనం ముంగిట్లోనే మార్కెట్లు
- ఆందోళనలో వ్యాపారులు






**న్యూఢిల్లీ :** పండుగ సందర్భంగా కొనుగోళ్లు పెరిగి ఆర్థిక మందగమనం నుంచి కాస్త ఉపశమనం కలుగుతుందన్న అంచనాలు తప్పుతున్నాయి. ఆశించన మేరకు కొనుగోళ్లు ఊపందుకోలేదని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లలో ఇంకా మందగమనమే రాజ్యమేలుతున్నదని వాపోతున్నారు. కొత్త వస్తువులు కొనుక్కునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదనీ, పెట్టుబడులూ పెట్టేందుకు ముందుకు రావడంలేదని చెబుతున్నారు. అంతర్జాతీయంగా లావాదేవీలు జరుపుతున్న బడా కంపెనీలు మాత్రమే భద్రంగా ఉన్నాయనీ, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మార్కెట్‌లలో నెలకొన్న అనిశ్చితితో తీవ్రంగా నష్టపోతున్నాయని అభిప్రాయపడుతున్నారు. మోడీ సర్కారు తీసుకున్న పెద్దనోట్ల రద్దు నిర్ణయం మా జీవితాల్ని ధ్వంసం చేయగా.. జీఎస్టీ వచ్చాక మమ్మల్ని పూర్తిగా దెబ్బతీసిందనీ, ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక మందగమనం మా పిల్లల కడుపుమాడుస్తున్నదని ఓ వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు. పండుగ సీజన్‌లో కొనుగోళ్లు పెరుగుతాయని చాలా కంపెనీలు ఆశలు పెట్టుకున్నాయి. కానీ, ఆ అంచనాలు తప్పుతున్నట్టు ఓ వార్తా కథనం వివరిస్తున్నది. దీంతో భవిష్యత్ పరిణామాలపై ఆందోళనలు వెలువడుతున్నాయి.

**ఆఫర్లు పెట్టినా అమ్మకాల్లేవ్ : మొబైల్ షాప్ ఓనరు**

లక్నోలోని మల్హార్‌కు చెందిన రజాక్ అహ్మద్ ఆరేండ్లుగా మొబైల్ షాప్ నడుపుతున్నారు. తన అనుభవంలో ఇంతటి దుస్థితిని చూడలేదని అన్నారు. పండుగ సీజన్ కోసం ఆర్డర్ చేసిన 20 స్మార్ట్ ఫోన్‌లలో కనీసం ఒక్క దాన్నీ అమ్మలేకపోయానని వాపోయారు. 'మొబైల్ ఫోన్లు, యాక్సరీల కోసం లక్షల రూపాయలు వెచ్చించాను. కస్టమర్లు వచ్చి మొబైల్ యాక్సరీలు కొంటున్నారు. రిపేర్ చేయించుకుంటున్నారు. కానీ, మంచి ఆఫర్లు పెట్టినా.. కొన్ని వస్తువులు ఫ్రీగా ఇస్తున్నా.. కొత్త ఫోన్లు కొనడం లేదు. అందరు ఆన్‌లైన్‌లో కొంటున్నారేమోనని అనుకున్నానను. వన్‌స్టాప్ సొల్యూషన్, ఆఫ్టర్‌సేల్ సర్వీస్‌లు పెట్టినా.. కొనుగోళ్లు లేవు. దీంతో ఆర్థిక మందగమనం కష్టాలేంటో తెలిశాయి. నాలుగు నెలలుగా అసలు అమ్మకాలే లేవు. మార్కెట్‌లో నగదు ప్రవాహం తగ్గింది. వినియోగదారుల వద్ద పైసల్లేవని సర్వేల్లోనూ కనిపిస్తున్నాయి. ఇది వ్యాపారాలకు ఎంతమాత్రం మంచిది కాద'ని రజాక్ అన్నారు.

**ప్రాజెక్టులన్నీ అన్‌హోల్డ్ : ఆర్కిటెక్టు ఓం కుమార్**

దేశంలో పలు ఐదు నక్షత్రాల హోటళ్లను డిజైన్ చేసిన లక్నోలోని ప్రముఖ సంస్థలో పనిచేస్తున్న ఆర్కిటెక్టు ఓం కుమార్ ప్రస్తుత పరిస్థితులు నోట్లరద్దు రోజుల్ని తలపిస్తున్నాయని అన్నారు. పండుగ సీజన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందన్న తమ ఆశలు నిరాశలయ్యాయని తెలిపారు. 'రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకే జంకుతున్నారు. బ్యాంకులూ రుణాలివ్వడం లేదు. ప్రయివేటు మదుపరులు చేతులు ఎత్తేశారు. గతంలో ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు చాలా ఆసక్తి చూపేవారు. ఒక లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేస్తే రెండు మూడేండ్లలో రెట్టింపు లేదా మూడు రెట్ల లాభాలను సొంతం చేసుకునేవారు. కానీ, నేడు మార్కెట్ స్తబ్దుగా ఉన్నది. ఆస్తుల విలువలు చుక్కలను తాకుతున్నాయి. ప్రస్తుతం మూడు నక్షత్రాల హోటల్ ఒకటి, ఒక మాల్ సహా నాలుగు ఖరీదైన ప్రాజెక్టులను నిలిపేయాల్సి వచ్చింది. నిర్మించేందుకు సంస్థ దగ్గర డబ్బు లేదు. లాభాలు వస్తాయన్న భరోసాను మదుపరులకు ఇవ్వలేక పెట్టుబడులనూ కూడబెట్టలేకపోతున్నామ'ని ఓం కుమార్ చెప్పారు.

### మరింత దిగజారుతున్న మార్కెట్లు : ఇత్తడి కళాకారుడు

ఉత్తరప్రదేశ్‌లోని మొరదాబాద్‌కు చెందిన రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇత్తడి కళాకారుడు దిషాద్ హుస్సేన్ ఆరునెలలుగా ఎలాంటి ఆర్డర్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. చిన్నదో పెద్దదో ఏదైనా సరేనని ఆర్డర్ల కోసం ప్రతి ఒక్కరి దగ్గరికి పరుగులు తీస్తున్నానని హుస్సేన్ వివరించారు. 'వంటగది వస్తువులు, ఇంటిలోపలి అలంకారాలకు సంబంధించిన మా పని ఎప్పుడూ మందగమనం ప్రభావానికి లోనుకాలేదు. కానీ, ఇప్పుడు పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. పనిలేక పొదుపు చేసుకున్న కొద్దిమొత్తంలో నుంచే కుటుంబాన్ని వెళ్లదీస్తున్నాం. అంతర్జాతీయ లావాదేవీలు జరిపే కంపెనీలు మినహా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు నిర్వహిస్తున్నవారికి ఇది గడ్డుకాలమే. పెద్దనోట్ల రద్దు నడ్డివిరిస్తే.. అడ్డదిడ్డంగా తెచ్చిన జీఎస్టీ దాదాపు మా బతుకులను నాశనం చేసింది. ఈ మందగమనం దెబ్బతో ఇంట్లో పూటగడవటం కూడా కష్టమవుతున్నది. సాధారణంగా పండుగ సీజన్ వస్తే మార్కెట్ సందడిగా ఉంటుంది. కానీ ఈసారి ఆ ప్రభావం అస్సలు కనిపించడం లేదు. మందగమనంతో మార్కెట్లు దినదినం మరింత దిగజారుతున్నాయ'ని హుస్సేన్ తన గోడువెళ్లబోసుకున్నారు.

జోష్
నవతెలంగాణ



ఫొటో :పిప్పళ్ల వెంకటేష్

# అతనే ఓ కెమెరా



**ఫొటోగ్రఫీ కొందరికి హాబీ అయితే మరికొందరికి ప్యాషన్. అంతకు మించి ఏదైనా పదం ఉందంటే అది ఫొటోగ్రాఫర్ వినోద్‌బాబుకు సరిగ్గా సరిపోతుంది. తెలంగాణ బతుకు చిత్రాలను తన కెమెరాలో బంధిస్తున్నాడు. ఇక్కడి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళు తున్నాడు. తీసే ప్రతి చిత్రం సమాజహితం కావాలని కోరుకుంటూ అందరికంటే భిన్నంగా అడుగులు వేస్తూ ఆ యువకుడు చెబుతున్న విశేషాలు ఈ వారం జోష్‌లో...**

నేను పుట్టింది హైదరాబాద్. పెరిగింది మాత్రం హైదరాబాద్, వైజాగ్, విజయవాడ, చెన్నై.. ఇలా అమ్మానాన్నల జాబ్ వల్ల చాలా ప్రాంతాలు తిరిగాను. అమ్మ నళినీ, నాన్న శ్రీనివాస్. వాళ్ళిద్దరూ డాక్టర్లు. నా టెన్త్ పూర్తయ్యే సరికి సుమారు పది స్కూల్స్‌లో చదువుకుని ఉంటా. అందుకే నాకు పెద్దగా స్నేహితులు లేరు. పైగా చిన్నప్పుడు కాస్త నత్తి ఉండేది. ఏడో తరగతిలో ఉన్నప్పుడు నా రోల్ నెంబర్ 57. అది పలకడం కూడా వచ్చేది కాదు. అందరూ ఎగతాళి చేసేవారు. అందుకే ఒంటరిగా వుండేవాడిని. ఒక్కోసారి స్కూల్‌కి వెళ్ళాలన్నా ఏడుపొచ్చేది. ఒంటరి తనమే నన్ను ఓ ఫొటో గ్రాఫర్‌గా మార్చివుంటుంది. చిన్నప్పటి నుండి బొమ్మలు బాగా గీసేవాడిని. దీనికి ఎవరితో మాట్లాడాల్సిన అవసరం లేదు. నా పని నేను చేసుకునేవాడిని.

### పర్యావరణంపై ఆసక్తితో

ఇంట్లో కూర్చొని బొమ్మలు వేయడం, ఒకే చోట కూర్చోడం కూడా నచ్చేది కాదు. బయట తిరుగుతూ ఏమైనా చేయాలనుకున్నప్పుడు ఫొటోగ్రఫీ అలవాటయింది. బయట తిరుగుతూ కంటికి నచ్చింది ఫొటోలు తీసేవాడిని. చెన్నైలో బీటెక్ బయోటెక్నాలజీ చేస్తున్నప్పుడు 'ఎకో యూత్' అని కాలేజీ స్టూడెంట్స్ అందరం కలిసి పెట్టుకున్నాం. పర్యావరణంపై ఆసక్తితో ఇది ఏర్పాటు చేసుకున్నాం. మేము బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ చేసేవాళ్ళం. ఆ తర్వాత గేట్ రాసి ఐఐటి ధన్‌బాగ్‌లో ఎన్విరాల్‌మెంట్‌లో ఎంటెక్ చేశాను. అక్కడ చాలా నేర్చుకున్నా. ఫొటోగ్రఫీపై ఆసక్తి బాగా పెరిగింది.

పర్యావరణానికి నష్టం చేసే ఫ్యాక్టరీలకు అక్రమంగా పర్మిషన్లు ఇవ్వడం గమనించా. ఎంటెక్ తర్వాత జాబ్‌లో చేరాను. తృప్తి లేదు. దాంతో ఇంట్లో చెప్పకుండానే 2015లో జాబ్ మానేశా. తెలిసిన తర్వాత ఒక్క సంవత్సరం టైం ఇవ్వమన్నాను. బెటర్‌గా ఏదైనా చేయాల నుండేది. బైక్ తీసుకుని తిరగడం మొదలు పెట్టా.

### జాతీయ స్థాయికి తీసుకెళ్ళాలని

ఇంట్లో అమ్మ వాళ్ళు లెఫ్ట్ ఐడియాలజీ, అందరూ చదువుకున్న వారు. సమాజం, ప్రజల పట్ల ఓ అవగాహన ఉన్న వారు. వాళ్ళ ఆలోచనలే నాకూ వచ్చాయనుకుంటా. అందుకే సామాన్య ప్రజల సమస్యలపైనే నా దృష్టి ఉండేది. అప్పట్లో ఏ పత్రికలో చూసినా ఉత్తర తెలంగాణలో కరువు గురించి బాగా చర్చ జరుగుతుండేది. అసలు అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవాలని 2017, మే నెలలో బైక్‌పై కరువు ప్రాంతాలన్నీ తిరిగి ఫొటోలు తీశా. నీటి సమస్య బాగా కనిపించింది. పేపర్లలో వచ్చిన దానికన్నా, నేను ఊహించిన దానికన్నా సమస్య తీవ్రంగా వుంది. కూలి పనులు మానుకొని ఒక్కో నల్లా దగ్గర 100 నుండి 150 మంది కూర్చొని ఉండేవాళ్ళు. కిలో మీటర్లు నడిచి వెళ్ళి మహిళలు బిందెలు నెత్తిన పెట్టుకొని మోస్తున్నారు. ఈ సమస్య కేవలం మన రాష్ట్రం వరకు తెలిస్తే సరిపోదు జాతీయ స్థాయిలో తెలియాలనే ఉద్దేశంతో దీన్ని ఓ ప్రాజెక్ట్‌గా చేశాను. అలాగే 'యాక్షన్ ఎయిడ్' ఆర్గనైజేషన్ వాళ్ళు వచ్చి కరువు ప్రాంతాలు ఓ మూడు రోజులు తిరిగారు. వాళ్ళతో పాటు మళ్ళీ తిరిగాను. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాళ్ళు పెట్టిన సమావేశం నేను తీసిన ఫొటోలతో ఎగ్జిబిషన్ పెట్టాను. అలా మన రాష్ట్రంలోని కరువు సమస్య జాతీయ స్థాయికి తీసుకుపోవడంలో నా వంతు ప్రయత్నం చేశాను.

### హోం లాండ్

'యాక్షన్ ఎయిడ్' వారితో కలిసి తిరిగినప్పుడు మల్లన్నసాగర్ కూడా వెళ్ళాను. అక్కడ వాళ్ళతో కరువు గురించి మాట్లాడుతుంటే ముంపు గురించి తెలిసింది. మల్లన్నసాగర్ ముంపు ప్రాంతాల యూత్ అంతా కలిసి ఓ వాట్సాప్ గ్రూప్ పెట్టుకున్నారు. అందులో నన్ను కూడా యాడ్ చేశారు. 4,5 రోజులు అక్కడే వుండి మల్లన్న సాగర్ మొత్తం తిరిగాను. ఆ ఫొటోలన్నీ తీస్తే మరో ప్రాజెక్ట్ అయింది. ఓ రోజు ఉదయం మల్లన్నసాగర్ వాట్సాప్ గ్రూప్‌లో 'మన బతుకులు కూడా అలూరులాగే అవుతాయా' అనే ఓ మెసేజ్ చూశా. వెంటనే దాన్ని గురించి అడిగా. అలూరు అంటే గద్వాల్ దగ్గర ప్రాంతమది. అక్కడి ప్రజలు ఎంత వ్యతిరేకించినా డ్యాం కట్టేశారు. ఆ ప్రాంతమంతా మునిగిపోయింది. ఆ విషయం తెలుసుకుని వెంటనే అక్కడికి వెళ్ళి అక్కడి ఫొటోలు తీశాను. ఉత్తర తెలంగాణలో నీటి సమస్య, కరువు, ఇక్కడ చూస్తే భూ నిర్వాసితులు, ముంపు ఇలా వీటన్నింటికి పరిశీలిస్తే ఓ లింక్ దొరికింది. ఇలా నేను తీసిన ఫొటోలన్నీ కలిపి 'హోం లాండ్' (వాళ్ళ భూముల్లోనే వాళ్ళు శరణార్థులు) అనే ప్రాజెక్ట్ చేశాను. దీని కోసం సుమారు ఐదు నెలలు పట్టింది. ఇది కార్వాన్ అనే ఇంటర్నేషనల్ మ్యాగజైన్‌లో పబ్లిష్ అయింది.

### కండ్ల నుండి నీళ్ళు వచ్చేవి

తెలంగాణలో ఊరికి కరువు వచ్చినప్పుడు బలులు ఇస్తుంటారు. జాతరలు చేస్తుంటారు. వీటి గురించి ఓ ప్రాజెక్ట్ చేయాలనుకున్నా. తెలంగాణ కల్చర్ బయటి ప్రపంచానికి తెలియాలని ఈ ప్రయత్నం చేశా. 2014లో మేడారం జాతరకు వెళ్ళాను అప్పట్లో ఇలాంటి ఆలోచన ఏమీ లేదు. తర్వాత జంపన్న వాగు వెళ్ళాను. అక్కడ ప్రజలు జాతరలో ఏడుస్తూ కనిపించారు. అది నన్ను బాగా ఆలోచింప జేసింది. తర్వాత ఐనవోలు, కొమరెల్లి ఇలా మొత్తం 12 ప్రాంతాల్లో జరిగే జాతరలకు తిరిగాను. సహకరించే వారు లేక నిస్సహాయతతో గుండెల్లో ఉన్న బాధనంతా ఇలా ఏడ్చి తీర్చుకుంటారు. వాళ్ళ గుండెల్లో ఎంత బాధ దాగి వుందే అర్థమయింది. వాళ్ళ పరిస్థితిని చూస్తే ఒక్కోసారి నా కండ్ల నుండి నీళ్ళు వచ్చేవి. నిస్సహాయత నుండే మూఢనమ్మకాల వైపు వెళ్ళారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక వెనుకబాటు నుండే ఈ జాతర్లు వచ్చాయనిపించింది. ఇలా జాతర్లలో తీసిన ఫొటోలతో ఓ ప్రాజెక్ట్ చేశా. దీన్నే ఇప్పుడు మాదాపూర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లో పెట్టాను. మంచి స్పందన వస్తుంది.

### ప్రతీది సమాజహితం కావాలి

డిజిటల్ కెమెరాతో ఎన్ని ఫొటోలైనా తీసుకోవచ్చు. ఏమీ ఆలోచించకుండా టకటకా తీసుకోవచ్చు. కానీ నేను ఆ కెమెరా వాడను. ఇన్‌స్టాక్ కెమెరా అని ఉంటుంది. 8 వందల రూపాయలకు 10 ఫొటోలు వస్తాయి. అదే వాడుతున్నా. ఎందుకంటే నేను తీసే ప్రతి ఫొటో ఆలోచించేదిగా ఉండాలి. ఊరికే ఫొటోలు తీయడం కాదు వాళ్ళతో మాట్లాడాలని దీన్ని ఎంచుకున్న. తీసిన ప్రతి ఫొటో సమాజానికి ఉపయోగపడాలి. గతంలో ఫ్లోరైడ్ సమస్య పైన కూడా వర్క్ చేశా. అయితే అది అంత సీరియస్‌గా చేయలేదు. వాళ్ళకు న్యాయం చేయలేదనిపించింది. అందుకే ఇప్పుడు మళ్ళీ ఫ్లోరైడ్ సమస్యపై ఓ ప్రాజెక్ట్ చేయాలనుకుంటున్నా.

### అంతర్జాతీయ స్థాయికి

ప్రస్తుతం ఇంటర్నేషనల్ మీడియాలో ఫ్రీలాన్స్ చేస్తున్నా. ఒకప్పుడు నత్తి వల్ల మాట్లాడటానికి భయపడిన నేను ఇప్పుడు మూడు గంటల పాటు టీచింగ్ వర్క్‌షాప్‌లు తీసుకుంటున్నా. నేను ఫొటోగ్రఫీ ఎక్కడా నేర్చుకోలేదు. అందుకే నా లాంటి వాళ్ళకు నేర్పించాలనే ఈ వర్క్ షాపులు. ఏడాది కిందట రెండు అవార్డులు వచ్చాయి. 'టోటో' వారి అవార్డు వచ్చింది. ఇది ఇండియాలో ఒకరికే ఇస్తారు. ఆ అవార్డు 30 ఏండ్ల లోపు వాళ్లకే ఇస్తారు. నాకు 29 ఏండ్లకే వచ్చింది. అది రావడం అంతర్జాతీయ రచయితలో పరిచయాలు పెరిగాయి. అలాగే ఐ అండ్ పీఆర్ అవార్డు, వరల్డ్ ఫొటోగ్రఫీ అవార్డు కూడా వచ్చాయి. ఈ మధ్య బెస్ట్ స్ట్రీట్ ఫొటోగ్రఫీకి జడ్జిగా ఉన్నా. ఈ ఆదాయాన్ని వీధి బాలల కోసం ఉపయోగిస్తున్నాం.









### స్కూల్ పెట్టాలనుంది

భవిష్యత్‌లో స్కూల్ పెట్టాలని ఉంది. అయితే మన దగ్గర ఫొటోగ్రఫీపై అంత అవగాహన లేదు. పైగా ఇక్కడ ప్రతి దాన్ని కమర్షియల్‌గా ఆలోచిస్తారు. అందుకే మన దగ్గర స్కూల్ పెడితే నేను అనుకున్నది చేయలేను. నాకు పెండ్లయి ఏడాది అవుతుంది. నా భార్యది బొంబయి. తను కూడా ఫొటోగ్రాఫర్. ఓ వర్క్ షాప్‌లోనే ఇద్దరికీ పరిచయం. తను ప్రస్తుతం 'మదర్ అండ్ చైల్డ్'పై పెద్ద ప్రాజెక్ట్ చేస్తుంది. బొంబయి వాళ్ళు ఫొటోగ్రఫీ గురించి కాస్త డిఫరెంట్‌గా ఆలోచిస్తారు. అందుకే ఇద్దరం కలిసి బొంబయిలో స్కూల్ పెట్టాలని ఆలోచిస్తున్నాం. అక్కడ స్కూల్ పెట్టినా ఇక్కడ ప్రాజెక్టులు మాత్రం కొనసాగిస్తా.

### మహిళా రైతులపై...

భవిష్యత్‌లో మహిళల సమస్యలపైన ఓ ప్రాజెక్ట్ చేయాలి. అలాగే మన దగ్గర 170 మంది మహిళా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మన వాళ్ళు మహిళలను అసలు రైతులుగానే గుర్తించరు. వాళ్ళ మరణాలను గృహహింస మరణాలుగా చిత్రీకరించారు. వాళ్ళ గురించి అసలు నిజాలు బయటకే రాలేదు. అందుకే వాళ్ల జీవితాల గురించి ఓ ప్రాజెక్ట్ చేయాలి. ఇలా చాలా ఆలోచనలు ఉన్నాయి. మెల్లమెల్లగా వీటన్నింటినీ చేస్తాను.

సలీమ

## జాబ్ చేస్తున్నారా?

నిజాయితీగా ఉండండి. దీర్ఘకాలంలో ఇది మీకు ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. మీ వర్క్ గురించి అబద్ధాలు చెప్పడం, క్లయింట్ ఇన్ఫర్మేషన్ గురించి మోసం చేయడం వంటివి మిమ్మల్ని అన్‌ప్రొఫెషనల్‌గా నిలుపుతాయి.

- మీ బాస్ ముందు ఈ పని నా వల్ల కాదు అని ఎప్పుడూ చెప్పకండి. ట్రై చేస్తానని చెప్పండి. ప్రయత్నించకుండానే నా వల్ల కాదని చెప్పడం వల్ల అన్‌ప్రొఫెషనల్ ముద్రపడే అవకాశం ఉంటుంది.
- మీ వల్ల ఏదైనా తప్పు జరిగి ఉంటే దాన్ని ఒప్పుకోండి. సరిదిద్దుకోడానికి ప్రయత్నించండి. అంతేకానీ సబార్డినేట్‌లను బ్లేమ్ చయడానికి ప్రయత్నించకండి. ఒకవేళ అలా చేస్తే అన్‌ప్రొషెషనల్‌గా మిగిలిపోతారు.
- ఆఫీస్‌కు మీ బాస్ చేరుకున్న తరువాత మీరు చేరుకోవడం అన్‌ప్రొఫెషనల్‌గా కనిపించేలా చేస్తుంది. కాబట్టి సమయానికి ఆఫీస్‌కు చేరుకోండి. బాస్ కన్నా ముందే ఆఫీస్‌లో ఉండేలా చూసుకోండి.
- గాసిప్‌లకు దూరంగా ఉండండి. గాసిప్‌లను మోసేవారు అన్‌ప్రొఫెషనల్ గొడుగు కిందే చేరుతారు. కాబట్టి వాటికి దూరంగా ఉండండి.
- ఇతరులతో మాట్లాడేటప్పుడు మంచి భాషను ఉపయోగించండి. మీరు ఉపయోగించే పదాలు మిమ్మల్ని ఏ కేటగిరీకి చెందిన వారో తెలియజేస్తాయి. కాబట్టి కమ్యునికేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వండి.
- మీ వల్ల కాని పనిని చేస్తానని ప్రామిస్ చేయకండి. మీ సామర్థ్యానికి మించిన పని అయినపుడు 'నో' చెప్పడానికి వెనుకంజ వేయకండి. ఓవర్ ప్రామిసింగ్ వల్ల కూడా అనర్థాలు తలెత్తుతాయి.
- కొలీగ్స్‌తో అతి స్నేహం చేయకండి. కొంతమందితో చేసే అతి స్నేహం వల్ల అన్‌ప్రొఫెషనల్ లుక్ కనిపిస్తుంది. కాబట్టి అందరితోనూ సాధారణ స్నేహం కొనసాగించండి.
- మీకు అప్పగించిన పనిని సకాలంలో పూర్తి చేయండి. గడువులోగా పని పూర్తి చేయకపోతే అన్‌ప్రొఫెషనల్ ముద్రపడే అవకాశం ఉంటుంది.



ఫన్.కాం

## పరిగెత్తుతున్నారు

తన భర్త రామారావుకు నిద్రలో నడిచే అలవాటుందని హాస్పిటల్‌కు తీసుకెళ్లింది సరోజ.
డాక్టర్ పరీక్షించి మందులు రాసిచ్చాడు..
వారం రోజుల తర్వాత సరోజ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్‌ను కలిసింది.
'డాక్టర్.. నిద్రలో నడుస్తున్నాడని చెబితే మా ఆయనకు మెడిసిన్ ఇచ్చారు కదా' అడిగింది...
'నేనిచ్చిన మందు బాగా పనిచేస్తుంది కదమ్మా' డాక్టర్ గర్వంగా చూశారు.
'మా కొంప ముంచేలా పనిచేస్తోంది. ఇప్పుడు మా ఆయన నిద్రలో నడవటం మానేసి పరిగెత్తుతున్నారు డాక్టర్' ఆవేశంగా సరోజ సమాధానం..



## గొప్పవాళ్ళు ఎవరూ పుట్టలేదు

విదేశాలకు వెళ్లి అక్కడి టూరిస్ట్ ప్రదేశాలను చూడాలని ఆశపడ్డ భారతీయ జంట అమెరికాకు వెళ్లింది.
ఇండియా టూరిస్టులు అమెరికాలో ఓ క్యాబ్‌లో ప్రయాణిస్తూ డ్రైవర్‌తో మాట్లాడుతున్నారు.
సుభాష్ చంద్రబోస్, మహాత్మ గాంధీ లాంటి గొప్ప గొప్పవాళ్లు పుట్టిన దేశం మా భారత్. మీ దేశంలో గొప్పవాళ్లు ఎవరైనా పుట్టారా అని టాక్సీ డ్రైవర్‌ను అడిగారు.
లేదండీ.. ఇక్కడ గొప్పవాళ్లు ఎవరూ పుట్టలేదు. అందరూ చిన్న పిల్లలే పుడుతున్నారు.. తాపీగా బదులిచ్చాడు టాక్సీ డ్రైవర్



మనసా..మనసా

## నువ్వో చోట.. నేనో చోట..

విశాలమైన నీ నదీప్రవాహపు కళ్ళల్లోకి
ఎన్ని సార్లు పచ్చనాకులా
తేలియాడానో ఇప్పుడా కళ్ళులేని చీకటిని
నీ కళ్ళిప్పుడు నారాక కోసం రెప్పలను
తోరణాలుగా వేలాడదీసి
నేననే వెలుతురును కాటుకగా
పెట్టుకుందామని ఆశపడుతుంటాయి..
ఒకరికి ఒకరంలేని
నువ్వోచోట, నేనోచోట
స్థబ్దంగా పాతుకుపోయి
నీ నుండి దూరంగా విసిరేసిన
కాలకర్కషత్వపు ఈ క్షణాలకు కూడా
ఇంత ప్రేమపూత పూసి
కొన్ని సాయంత్రాల్లో,కొన్ని రాత్రుల్లలో
కొన్ని పొద్దుటివేళల్లో చుట్టి
ఆ వైపు వీస్తున్న గాలికిస్తున్నాను
ఆ గాలి నీ ముంగురులను తాకి
కొన్ని ఊసులను మోసుకొస్తుందని
ఇంకేం చేయగలను
కనిపించే పూలల్లో పరిమళాన్ని
వినిపించే శబ్దాల్లో స్వరాన్ని
కురుస్తున్న చినుకుల్లో ప్రతిబింబాన్ని..
నీవు నాదనుకొని
నేను నీదనుకొని వెతుకుతుంటాం
ఇప్పుడు తెలుస్తుంది
అందులో నువ్వు,నేను ఉండమని..
నువ్వు నా ఊపిరిలో నేను నీ ఊపిరిలో
నీకు నాకు ఊపిరే వంతెన
నువ్వు గుర్తుకొచ్చినప్పుడల్లా
ఒక్కసారి గట్టిగా ఊపిరి పీలుస్తున్నా
నువ్వు అలాగే చేస్తున్నావేమో
గుండె కలుక్కుమంటుంది..

– తండ హరీష్ గౌడ్,8978439551



## ఊగిసలాట

ఒక్క అడుగే కదాని నీరసించి
నిష్క్రమించకు
అడుగు వెనుక అడుగుతో
ఖగోళమంతా
కౌగలించుకోవచ్చు
ఒక్క నీటి చుక్కే కదా అని
చులకనగా చూడకు
ఆ వర్షపు బింధువులే అఖండ
సింధువవును ఆవిష్కరిస్తాయి.
వెలిగించాలనుకునే దీపం
ఒక్కటే అని వెనకడుగు వేయకు
అది లక్షల చీకటి జీవితాల్లో వెలుగు
నింపే జీవనజ్యోతి
నా ఒక్క చెయ్యే చేయూత
ఏమిస్తుందని అనుకోకు
నీ చేయి వెంట వేల చేతులు
చైతన్య దివిటీలై వెలుగులు
నింపుతాయి. సమాజం పట్ల...
నాకేం పట్టిందని నిస్పృహతో
నిర్లక్ష్యం వహిస్తే
పుచ్చిన సమాజం నిన్ను
నిలువునా దహించివేస్తుంది జాగ్రత్త!

– కొప్పోలు యాదయ్య



## వలపు రాగం

వద్దన్న కొద్దీ మోసుకొస్తున్నాయి
తెమ్మెరలన్నీ నీ పరిమళాలను...!
మనసందుకేనేమో ఎపుడూ పాడని
కోయిల పాటను పాడుతోంది...
శ్రావణ చినుకుల్తో తడిసిన
పూలవనంలా మురిసిపోతూ...!
మబ్బు వంగి నేలను ముద్దాడినట్లు
ఓ చల్లని అనుభూతి...
బుగ్గల మందారాలకు
రంగుల ముగ్గులేస్తూ...!
నువ్వే చెప్పాలిపుడు
నా కన్నుల్లో మెరిసే నవ్వుల్లో
సవ్వడించే తలపులు నీవేనని...!
నేనో గీతమై కాగితంపై
పరచుకునే వేళ
అక్షరమై ఆర్తిగా హత్తుకుంటావు...
అల్లుకు పోయిన బంధనాల లాహిరిలో....
తనువో గోదావరిలా పరవశించేలా...!
అంతరంగంలో వెల్లి విరిసే
అద్వైత భావాలకు
అపురూప లిపి ఏ భాషదో మరి....
రచిస్తూనే ఉంటోంది గాఢంగా
రమ్యమైన మన జ్ఞాపకాల జావళీలను...!
నువ్వొచ్చే దారుల్లో
వేచి ఉన్న మనసు పుస్తకంలో
తీపి సంతకాలు నీవైనప్పుడు...
మనసు చేసే కోలాహలంలో
మధుర వీణనై నే మిగిలి పోతుంటాను...
ఎప్పటికీ నిను విడువని వలపు రాగమై...!!

– శాంతి కృష్ణ, 9502236670



## ఒలింపిక్స్‌కు అవినాష్

• జాతీయ రికార్డు మెరుగు

దోహా (ఖతార్) : మూడు రోజుల వ్యవధిలో రెండు సార్లు జాతీయ రికార్డు బద్దలు కొట్టిన స్టీపుల్‌ఛేజ్ అథ్లెట్ అవినాష్ సబ్లె 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. 3000 మీటి స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ ఫైనల్లో పోటీపడిన అవినాష్ పతకం సాధించకపోయినా.. 1952 నుంచి భారత్‌కు అందని ద్రాక్షలా మిగిలిన ఒలింపిక్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. ' 2020 టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించటం పట్ల ఎంతో సంతోషంగా ఉంది. ఒలింపిక్స్ అర్హత కోసమే ప్రపంచ చాంపియన్‌షిప్స్‌కు వచ్చాను. కోచ్‌తో కలిసి ఎంతగానో కష్టపడ్డాను' అని అవినాష్ ఆనందం వ్యక్తం చేశాడు. స్టీపుల్‌ఛేజ్ 3000 మీ విభాగంలో 1952 తర్వాత ఓ భారత అథ్లెట్ పోటీపడటం ఇదే తొలిసారి. ఒలింపిక్స్ అర్హత టైమింగ్ 8.22.00ను అవినాష్ ఫైనల్లో 8.21.37తో అధిగమించాడు.

# మిగిలింది.. 9 వికెట్ల వేట

- దక్షిణాఫ్రికా లక్ష్యం 395, ప్రస్తుతం 11/1
- విశాఖలో విజయంపై కోహ్లిసేన గురి
- ఓపెనర్‌గా రోహిత్ రికార్డు శతకం
- భారత్ రెండో ఇన్నింగ్స్ 323/4 డిక్లేర్డ్
- ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు నాల్గో రోజు

**విశాఖ టెస్టుపై టీమ్ ఇండియా పట్టు బిగించింది. రోహిత్ శర్మ (127) హీరోయిక్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాకు 395 పరుగుల రికార్డు లక్ష్యాన్ని నిర్దేశించింది. 7 ఓవర్లలో ఆటలో కీలక బ్యాట్స్‌మన్ డీన్ ఎల్గార్ (2)ను పెవిలియన్‌కు పంపించింది. ఫ్రీడం సిరీస్‌లో తొలి టెస్టు సొంతం చేసుకునేందుకు కోహ్లిసేన మరో 9 వికెట్ల దూరంలో నిలిచింది. నాల్గో రోజు ఓ వికెట్ తీసిన భారత్.. నేడు 9 వికెట్ల వేటను కొనసాగించనున్నారు. ఓపెనర్‌గా రాణించగలడా అని ఎన్నో ప్రశ్నలు ఎదుర్కొన్న రోహిత్ శర్మ తొలి ప్రయత్నంలోనే వరుసగా రెండో సెంచరీతో చెలరేగాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అరంగేట్ర ఓపెనర్‌గా శతకాలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా చరిత్ర సృష్టించాడు. పుజార (81) ఆకట్టుకునే అర్ధ సెంచరీ సాధించగా.. స్పిన్నర్ అశ్విన్ (7/145) ఏడు వికెట్లతో మెరిశాడు. నేడు వికెట్ల వేటలో స్పిన్ ద్వయం అశ్విన్, జడేజా మాయాజాలంపైనే కోహ్లిసేన విజయం ఆధారపడి ఉంది. మాయగాళ్ల వేట ఎలా ఉంటుందో చూడాలి.**

విశాఖపట్నం నుంచి
శ్రీనివాస్ దాస్ మంతటి

హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ (127, 149 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సులు) అమ్మమ్మ ఊరులో రికార్డు శతకం కొట్టాడు. కెరీర్ 28వ టెస్టులో ఓపెనర్‌గా నయా అవతారం దాల్చిన రోహిత్ శర్మ తొలి ఇన్నింగ్స్‌లో 176 పరుగుల భారీ శతకం సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లతో విశ్వరూపం చూపించిన రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌లో ఓపెనర్‌గా తొలి మ్యాచ్‌లోనే రెండు సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు. రోహిత్ శర్మ వీర విహారానికి తోడు చతేశ్వర్ పుజార (81, 148 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. పుజార, రోహిత్ రెండో వికెట్‌కు 169 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. రవీంద్ర జడేజా (40, 32 బంతుల్లో 3 సిక్సులు), విరాట్ కోహ్లి (31 నాటౌట్, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అజింక్య రహానె (27 నాటౌట్, 17 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ మెరుపులతో భారత్ వేగంగా పరుగులు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌ను 323/4 వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. అంతకముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో 71 పరుగుల ఆధిక్యం కోహ్లిసేన సొంతమైంది. నాల్గో రోజు చివర్లో డిక్లరేషన్ ఇచ్చిన కోహ్లి దక్షిణాఫ్రికాను 395 పరుగుల ఛేదనకు ఆహ్వానించాడు. కఠిన ఛేదనలో దక్షిణాఫ్రికా 7 ఓవర్లలో ఓ వికెట్ కోల్పోయి 11 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ హీరో డీన్ ఎల్గార్ (2) జడ్డూ వలలో చిక్కాడు. ఓపెనర్ ఎడెన్ మార్క్‌రం (3 బ్యాటింగ్), డీ బ్రూయిన్ (5 బ్యాటింగ్) అజేయంగా నిలిచారు. దక్షిణాఫ్రికా మరో 384 పరుగుల వెనుకంజలో కొనసాగుతుండగా.. టీమ్ ఇండియా విజయానికి మరో 9 వికెట్ల దూరంలో నిలిచింది.

**తొలి సెషన్ : దక్షిణాఫ్రికా 431 ఆలౌట్**

ఓవర్‌నైట్ స్కోరు 385/8తో నాల్గో రోజు బ్యాటింగ్ కొనసాగించిన దక్షిణాఫ్రికా విలువైన పరుగులు జోడించింది. కేశవ్ మహరాజ్ (9)ను అశ్విన్‌ను త్వరగానే వెనక్కి పంపినా పదో వికెట్‌కు సఫారీ 35 పరుగులు చేసింది. సెనురన్ ముతుసామి (33 నాటౌట్, 106 బంతుల్లో 4 ఫోర్లు), కగిసో రబాడ (15, 17 బంతుల్లో 3 ఫోర్లు) భారత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని వంద దిగువకు కుదించారు. ఉదయం సెషన్లో 13.2 ఓవర్లు ఆడిన దక్షిణాఫ్రికా మరో 46 పరుగులు జత చేసింది. భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆశించిన భారత్ 71 పరుగుల ఆధిక్యంతో సరిపెట్టుకుంది. సఫారీ చివరి రెండు వికెట్లనూ అశ్వినే పడగొట్టాడు. 7/145తో తిరుగులేని ప్రదర్శన చేశాడు.

**మయాంక్ అవుట్, భారత్ 35/1**

తొలి ఇన్నింగ్స్‌లో రికార్డు భాగస్వామ్యం నమోదు చేసిన ఓపెనింగ్, రెండో ఇన్నింగ్స్‌లో 21 పరుగులకే విడిపోయింది. ఇన్నింగ్స్ 11వ బంతికి ఫోర్‌తో రోహిత్ పరుగులు ఖాతా తెరిచాడు. మహరాజ్ ఓవర్లో స్వీప్ షాట్‌తో స్క్వేర్ లెగ్‌లో సూపర్ సిక్సర్ బాది ఊపందుకున్నాడు. 31 బంతుల్లో 7 పరుగులే చేసిన అగర్వాల్ స్పిన్నర్ మహరాజ్ బంతికి స్లిప్స్‌లో క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. మహరాజ్‌పై మరో సిక్సర్ బాదిన రోహిత్ శర్మ లంచ్ సమయానికి 25 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో ఎండ్‌లో పుజార (2) తోడుగా నిలిచాడు.

**రెండో సెషన్ : భారత్ 175/1 :** రోహిత్, పుజార దూకుడు

ధనాధన్ బ్యాటింగ్ చేసిన రోహిత్ శర్మ మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 72 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఓ వైపు రోహిత్ దూకుడు మీద ఉండగా.. పుజార పరుగులు చేయటంలో ఇబ్బంది పడ్డాడు. పుజార ఎదుర్కొన్న తొలి 61 బంతుల్లో 8 పరుగులే చేశాడు. కానీ డ్రింక్స్ విరామం తర్వాత పుజార గేర్ మార్చాడు. డేన్ పీట్‌పై వరుస బంతుల్లో బౌండరీలు బాదిన పుజార.. తర్వాతి ఓవర్లో మహరాజ్‌పైనా వరుస బంతుల్లో ఫోర్లు కొట్టాడు. అక్కడ్నుంచి పుజార వెనక్కి తగ్గలేదు. రోహిత్ 48 పరుగుల వద్ద ఉండగా పుజార 8 పరుగులతో ఉన్నాడు. 9 ఫోర్లు, ఓ సిక్సర్‌తో పుజార తర్వాతి 45 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. రోహిత్, పుజార రెండో వికెట్‌కు చేసిన 150 పరుగుల్లో పుజార చేసిన రన్స్ 75 కాగా, రోహిత్ 70 జోడించాడు. పుజార, రోహిత్ ధనాధన్ వేగంతో పరుగులు రాబట్టారు. దీంతో లంచ్ తర్వాత టీమ్ ఇండియా వికెట్ కోల్పోకుండా 140 పరుగులు చేసింది.



ఆరంభ శతక వీరుడు : రోహిత్ శర్మ 127 (149 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సులు)

**మూడో సెషన్ : భారత్ 323/4 డిక్లేర్డ్ :** రోహిత్ వీరంగం

చివరి సెషన్‌లో రోహిత్ శర్మ ఉగ్రరూపం దాల్చాడు!. 9 ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 133 బంతుల్లోనే రోహిత్ శర్మ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఓపెనర్‌గా తొలి టెస్టులోనే రోహిత్ శర్మ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో చెలరేగాడు. పుజార స్పిన్నర్ మహరాజ్ వరుస ఓవర్లలో నాలుగు ఫోర్లు బాది ఔరా అనిపించాడు. ఫిలాండర్ బంతికి పుజార ఎల్బీగా అవుటయ్యాడు. కానీ మరో ఎండ్‌లో రోహిత్ శర్మ విశ్వరూపం మరో స్థాయికి వెళ్లింది. శతకం తర్వాత రోహిత్‌ను ఆపటం సఫారీ తరం కాలేదు. డేన్ పీట్ ఓవర్లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదిన రోహిత్ ఇన్నింగ్స్‌కు ఊపు తీసుకొచ్చాడు. లాంగ్ లెగ్, మిడ్ వికెట్, లాంగ్ ఆఫ్‌లో భారీ సిక్సర్లతో సఫారీ బౌలర్లను భయపెట్టాడు. ఇన్నింగ్స్‌లో ఏడు సిక్సర్లు కొట్టిన రోహిత్.. మ్యాచ్‌లో 13వ సిక్సర్‌తో టెస్టుల్లో సిక్సర్లు బాదటంలో కొత్త రికార్డును నెలకొల్పాడు. ఓపెనర్‌గా తొలి టెస్టులోనే రెండు శతకాలు బాదిన రోహిత్.. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఒకే శైలిలో అవుటయ్యాడు. క్రీజు వదలి బయటకు వచ్చి స్టంపౌట్‌గా వికెట్ కోల్పోయాడు. అప్పటికే బ్యాటింగ్ లైనప్‌లో ముందుకొచ్చిన రవీంద్ర జడేజా ఎడాపెడా బాదటం మొదలెట్టాడు. ముతుసామిపై కార్నర్‌లో సిక్సర్ కొట్టిన జడేజా.. పీట్ ఓవర్లో రెండు సిక్సర్లు బాది దూకుడు కొనసాగించాడు. కెప్టెన్ కోహ్లి వస్తూనే మహరాజ్‌ను లక్ష్యంగా చేసుకుని కొట్టాడు. అతడి వరుస ఓవర్లలో కోహ్లి రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో కదం తొక్కాడు. రబాడ ఓవర్లో జడేజా క్లీన్‌బౌల్డ్ కాగా.. వచ్చీ రాగానే అజింక్య రహానె (31 నాటౌట్) బౌండరీలపై పడ్డాడు. మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో రహనె కొత్త తరహా ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ కోహ్లి మరో ఫోర్ బాది ఇన్నింగ్స్ డిక్లరేషన్ ప్రకటించాడు. అప్పటికి భారత్ స్కోరు 323/4. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి 394.

**దక్షిణాఫ్రికా :**

395 పరుగుల లక్ష్యంతో ఛేదనకు వచ్చిన దక్షిణాఫ్రికాకు స్పిన్ ద్వయం అశ్విన్, జడేజా మాయా స్వాగతం పలికింది. అశ్విన్ తొలి ఓవర్లోనే ఎల్గార్‌ను క్లీన్‌బౌల్డ్ చేసినంత పని చేయగా.. జడేజా తన రెండో ఓవర్లో ఆ పని పూర్తి చేశాడు. లైన్ లండ్ లెంగ్త్ బంతితో ఎల్గార్‌ను ఎల్బీగా అవుట్ చేశాడు. 4 పరుగులకే దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ హీరో డీన్ ఎల్గార్ (2) కోల్పోయింది. దక్షిణాఫ్రికా చివరి సెషన్లో 13 ఓవర్ల ఆట ఆడాల్సి ఉన్నా.. వెలుతురు లేమి సమస్యతో మరో నాలుగు ఓవర్లు ఉండగానే.. 7 ఓవర్లకే ఆటను నిలిపివేశారు. నేడు ఆఖరు రోజు 98 ఓవర్ల ఆట సాగనుంది.

**స్కోరు వివరాలు :**

**భారత్ తొలి ఇన్నింగ్స్ : 502/7 డిక్లేర్డ్**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ :** ఎల్గార్ (సి) పుజార (బి) జడేజా 160, మార్క్‌రం (బి) అశ్విన్ 5, డీ బ్రూయిన్ (సి) సాహా (బి) అశ్విన్ 4, డేన్ పీట్ (బి) జడేజా 0, బవుమా (ఎల్బీ) ఇషాంత్ 18, డుప్లెసిస్ (సి) పుజార (బి) అశ్విన్ 55, డికాక్ (బి) అశ్విన్ 111, ముతుసామి నాటౌట్ 33, ఫిలాండర్ (బి) అశ్విన్ 0, మహరాజ్ (సి) మయాంక్ (బి) అశ్విన్ 9, రబాడ (ఎల్బీ) అశ్విన్ 15, ఎక్స్‌ట్రాలు : 21, **మొత్తం :(131.2 ఓవర్లలో ఆలౌట్) 431.**

**వికెట్ల పతనం :** 1-14, 2-31, 3-34, 4-63, 5-178, 6-342, 7-370, 8-376, 9-396, 10-431.

**బౌలింగ్ :** ఇషాంత్ శర్మ 16-2-54-1, మహ్మద్ షమి 18-4-47-0, అశ్విన్ 46.2-11-145-7, జడేజా 40-0-5-124-2, విహారి 9-1-38-0, రోహిత్ శర్మ 2-1-7-0.

**భారత్ రెండో ఇన్నింగ్స్ :** మయాంక్ అగర్వాల్ (సి) డుప్లెసిస్ (బి) మహరాజ్ 7, రోహిత్ శర్మ (స్టంప్డ్)డికాక్ (బి) మహరాజ్ 127, పుజార (ఎల్బీ) ఫిలాండర్ 81, జడేజా (బి) రబాడ 40, కోహ్లి నాటౌట్ 40, రహానె నాటౌట్ 31, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం :(67 ఓవర్లలో 4 వికెట్లకు) 323.**

**వికెట్ల పతనం :** 1-21, 2-190, 3-239, 4-286.

**బౌలింగ్ :** ఫిలాండర్ 12-5-21-1, మహరాజ్ 22-0-129-2, రబాడ 13-3-41-1, డేన్ పీట్ 17-3-102-0, ముతుసామి 3-0-20-0.

**దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ :** ఎల్గార్ (ఎల్బీ) జడేజా 2, ఎడెన్ మార్క్‌రం బ్యాటింగ్ 3, డీ బ్రూయిన్ బ్యాటింగ్ 5, ఎక్స్‌ట్రాలు : 01, **మొత్తం : (8 ఓవర్లలో ఓ వికెట్) 11.**

**వికెట్ల పతనం :** 1-4.

**బౌలింగ్ :** అశ్విన్ 4-1-7-0, జడేజా 4-2-3-1.

**1** టెస్టు ఓపెనర్‌గా తొలి మ్యాచ్‌లోనే రెండు సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ. విశాఖ టెస్టులో రోహిత్ 176, 127 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా ఒకే మ్యాచ్‌లో రెండు శతకాలు సాధించిన భారత ఓపెనర్‌గా దిగ్గజ సునీల్ గవాస్కర్ సరసన రోహిత్ శర్మ నిలిచాడు.

**13** ఓ టెస్టు మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ సొంతమైంది. వసీం అక్రమ్ (12) రికార్డును రోహిత్ శర్మ (13) విశాఖలో అధిగమించాడు. వన్డే, టీ20ల్లోనూ అత్యధిక సిక్సర్ల రికార్డు రోహిత్ పేరిటే ఉన్నాయి.

**308** దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ విశాఖ టెస్టులో ట్రిపుల్ సెంచరీ కొట్టాడు. 75.5 ఓవర్లు వేసిన కేశవ్ ఐదు వికెట్లు తీసినా.. ధారాళంగా (308) పరుగులిచ్చి చెత్త రికార్డును సొంతం చేసుకున్నాడు.



# రసపట్టులో విశాఖ టెస్టు

- పొంచి ఉన్న వర్షం ముప్పు
- సఫారీ ఎదురుదాడి యోచన!

ఫ్రీడం సిరీస్ తొలి టెస్టులో నాలుగు రోజులు ముగిశాయి. ఊహించినట్టుగానే ఆఖరు రోజు ఆట ఆసక్తికరంగా మారింది. తొలి నాలుగు రోజుల్లో మూడు రోజులు ఆతిథ్య భారత్ ఆధిపత్యం చెలాయించింది. ఓ రోజు ఆటను శాసించిన దక్షిణాఫ్రికా ఇప్పటికీ డ్రా అవకాశాలను సజీవంగా నిలుపుకుంది!. సొంతగడ్డపై స్పిన్ ఎదుర్కొవటంలో బలహీన జట్టు దక్షిణాఫ్రికాకు 395 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఉపఖండంలో ఆఖరు రోజు 395 పరుగులు కొట్టాలనే ఆలోచన రావటం సాహసోపేతం. అదే సమయంలో రోజంతా 9 వికెట్లు కాచుకోవటం అసాధ్యమని చెప్పినా ఆశ్చర్యం లేదు. ఈ లెక్కన విశాఖ టెస్టు టీమ్ ఇండియా గుప్పిట్లో ఉందని సంతోషం వ్యక్తం చేయవచ్చు. కానీ విశాఖ టెస్టు తొలి నాలుగు రోజుల ఆట అందుకు భిన్నంగా ఉంది. ఇక్కడ జరిగిన వన్డేలు, టీ20ల్లోనూ పరుగులు చేసేందుకు బ్యాట్స్‌మెన్ ఆపసోపాలు పడిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఈ టెస్టులో పరుగుల వరద పారింది. బ్యాట్స్‌మన్ అలవోకగా స్ట్రయిక్ రొటేట్ చేయటమే కాదు ఎడాపెడా బౌండరీలూ బాదుతున్నారు. రెండో రోజు నుంచి స్పిన్ ప్రభావం కనిపించే విశాఖలో విచిత్రంగా 3, 4వ రోజుల్లో 350పైలుకు పరుగులు నమోదయ్యాయి. ఈ గణాంకాలు ఐదో రోజు కోహ్లిసేన కలవరపాటుకు కారణం అవుతున్నాయి.

మూడో రోజు దక్షిణాఫ్రికా 98 ఓవర్ల పాలు బ్యాటింగ్ చేసింది. 343 పరుగులు సాధించింది. ఉపఖండంలో అశ్విన్, జడేజా వంటి ప్రపంచ స్థాయి స్పిన్నర్లను ఎదుర్కొని ఇన్ని పరుగులు చేయటం దక్షిణాఫ్రికా సాధించిన అరుదైన ఘనత అని చెప్పాలి. నాల్గో రోజు మరింత టర్న్ ఉంటుందని అనుకున్నా.. ఓవరాల్‌గా 94 ఓవర్లలో 369 పరుగులు నమోదయ్యాయి. దక్షిణాఫ్రికా 46 పరుగులు చేయగా.. భారత్ 323 పరుగులు కొట్టింది. స్పిన్ పిచ్‌పై నాల్గో రోజు 369 పరుగులు చేసినప్పుడు.. నాల్గో రోజు సైతం ఆ అవకాశం ఎందుకుండదు? అనే అనుమానం వ్యక్తమవుతోంది. దక్షిణాఫ్రికాకు ఇప్పుడు మరో 384 పరుగులు అవసరం. రెండో ఇన్నింగ్స్‌లో విపరీత ఒత్తిడిని జయించి సఫారీ దూకుడుగా ఆడుతుందని ఆశించలేం. కచ్చితంగా రక్షణాత్మకంగా ఆడేందుకు మొగ్గు చూపుతుంది. తొలి ఇన్నింగ్స్‌లో డిఫెన్స్‌తో దెబ్బతిన్నామని, ఎదురుదాడి చేసిన సఫారీ.. రెండో ఇన్నింగ్స్‌లో సైతం ఆ సాహసానికి సిద్ధపడితే విశాఖ టెస్టు రసకందాయంలో పడనుంది. తొలి ఇన్నింగ్స్‌లో అశ్విన్ ఏడు వికెట్లు కూల్చినా.. 145 పరుగులు ఇచ్చాడు. జడేజా సైతం 2 వికెట్లకు 124 పరుగులు సమర్పించుకున్నాడు. దీంతో ఎదురుదాడి చేస్తే కోహ్లిసేన చేయగల్గిందేమీ లేదు!.

ఇన్నింగ్స్ డిక్లరేషన్ సమయంపైనా కాస్త చర్చ జరుగుతోంది. టీ సమయానికే భారీ స్కోరు సాధించి.. బౌలర్లకు 10 వికెట్ల వేటలో 120 ఓవర్లు అందుబాటులో ఉంచితే బాగుండేది. రోహిత్ శర్మ, పుజార చెలరేగినా టీ సమయానికి భారత్ ఆధిక్యం 250 పరుగుల లోపే ఉంది. దీంతో టీ విరామం తర్వాత సైతం భారత్ బ్యాటింగ్ కొనసాగించింది. 400 చేరువ లక్ష్యంలో దక్షిణాఫ్రికాను ఛేదనకు పిలిచింది. డిక్లరేషన్ టైమింగ్, అందుబాటులోని ఓవర్లు, పిచ్ స్వభావానికి తోడు నేడు వర్ష సూచనలు కనిపిస్తున్నాయి. తొలి రెండు సెషన్లకు పాక్షికంగా వర్షం అంతరాయం కలిగించే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో విశాఖ టెస్టు ఐదో రోజు ఆసక్తి రేపుతోంది. గెలుపు దారిపై ఎన్ని ప్రశ్నలు ఉన్నా.. నేడు కోహ్లిసేన ప్రదర్శనే అన్నింటికి సమాధానం కానుంది.

- నవతెలంగాణ-క్రీడావిభాగం

# బీసీసీఐ బరిలో అజహరుద్దీన్

- రేసులో గంగూలీ, జై షా, అరుణ్
- ఆసక్తిరేపుతున్న బీసీసీఐ ఎన్నికలు

నవతెలంగాణ-ముంబయి



రాజకీయ, క్రికెట్ నేపథ్యం కలిగిన బలమైన అభ్యర్థులు బీసీసీఐ అధ్యక్ష బరిలో నిలిచే అవకాశం కనిపిస్తోంది. బీసీసీఐ సంస్కరణల పర్వం ముగింపు క్రతువుగా అక్టోబర్ 23న జరిగే వార్షిక సర్వ సభ్య సమావేశంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి నూతన ఆఫీస్ బేరర్లను ఎన్నుకోనుంది. ఈ మేరకు ఏజీఎంలో పాల్గొనేందుకు అర్హులైన రాష్ట్ర క్రికెట్ సంఘాల ప్రతినిధులతో కూడిన ఓటర్ల జాబితాను బీసీసీఐ ఎన్నికల అధికారి ఎన్. గోపాలస్వామి శుక్రవారం విడుదల చేశారు. ఈ జాబితాలో బారత క్రికెట్ మాజీ కెప్టెన్లు మహ్మద్ అజహరుద్దీన్ (హైదరాబాద్), సౌరవ్ గంగూలీ (బెంగాల్) సహా కర్నాటక క్రికెటర్ బ్రిజేశ్ పటేల్ ఉన్నారు. బలమైన రాజకీయ నేపథ్యం కలిగిన జై షా (గుజరాత్), అరుణ్ ధుమాల్ (హిమాచల్ ప్రదేశ్)లు సైతం జాబితాలో ఉన్నారు.

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కుమారుడు జై షా గుజరాత్ క్రికెట్ సంఘం (జీసీఏ) నుంచి బీసీసీఐ ఎన్నికల్లో పాల్గొననున్నాడు. కేంద్ర సహాయ మంత్రి, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ సొదరుడు అరుణ్ ధుమాల్ హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం తరఫున హాజరు కానున్నాడు. అరుణ్ తండ్రి ప్రేమ్ కుమార్ ధుమాల్ హిమాచల్ ప్రదేశ్‌కు రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. నరేంద్ర మోడీ (2014కు ముందు), అమిత్ షా (2014-2019) వరకు గుజరాత్ క్రికెట్ సంఘం అధ్యక్షులుగా కొనసాగారు. కానీ బీసీసీఐ వ్యవహారాలపై వీరు పెద్దగా దృష్టి సారించలేదు. భాజపా సీనియర్ నాయకులు, దివంగత అరుణ్ జైట్లీ బీసీసీఐలో క్రియాశీలక పాత్ర పోషించేవారు. ఇప్పుడు అమిత్ షా తన దృష్టిని బీసీసీఐపై సారిస్తే.. కుమారుడు జై షా బీసీసీఐ తదుపరి అధ్యక్షుడు కావటం లాంఛనమే అవుతుంది. జై షా ఎన్నికల్లో పోటీ చేస్తారా? లేదా అనేది ఇంకా తెలియరాలేదు. అనురాగ్ ఠాకూర్ సొదరుడు అరుణ్ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఠాకూర్‌కు బీసీసీఐ వర్గాల్లో బలమైన పరిచయాలు ఉన్నాయి. పాత స్నేహంతో తమ్ముడికి ఆఫీస్ బేరర్ పదవి కట్టబెట్టేందుకు ఠాకూర్ పావులు కదిపే అవకాశం కనిపిస్తోంది.

**కెప్టెన్స్‌కు అవకాశాలు ఉన్నాయా? :** హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా ఎన్నికైన మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ అధికారికంగా బీసీసీఐ రాజకీయాల్లోకి ప్రవేశించారు. హెచ్‌సీఏ తరఫున అజహర్ బీసీసీఐ ఏజీఎంలో పాల్గొననున్నాడు. అధ్యక్ష పదవిపై అజహరుద్దీన్ ఆసక్తిగా ఉన్నట్టు సమాచారం. బీసీసీఐ మాజీ బాస్ ఎన్. శ్రీనివాసన్ మద్దతు లభిస్తే అజహరుద్దీన్‌కు లైన్ క్లియర్ కానుంది!. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఆరేండ్ల పదవి తర్వాత మూడేండ్ల విరామం తీసుకోవాలి. 2015 నుంచి గంగూలీ బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. విరామ సమయానికి గంగూలీ మరో పది మాసాల దూరంలోనే ఉన్నాడు. ఈ సమయంలో బీసీసీఐ అధ్యక్ష రేసులో నిలిచే అవకాశం లేదు. కర్నాటక క్రికెట్ సంఘం ప్రతినిధి, మాజీ క్రికెటర్ బ్రిజేష్ పటేల్ అపెక్స్ కౌన్సిల్ మెంబర్ కోసం పోటీచేసే అవకాశం కనిపిస్తోంది. ఆఫీస్ బేరర్ నామినేషన్‌కు అక్టోబర్ 9 ఆఖరు తేది. అక్టోబర్ 10న ఎన్నికల అధికారి తుది జాబితాను విడుదల చేయనున్నారు. ఐపీఎల్ మాజీ చైర్మన్ రాజీవ్ శుక్లా, డీడీసీఏ అధ్యక్షుడు రజత్ శర్మ, బీసీసీఐ మాజీ కార్యదర్శి నిరంజన్ షా కుమారుడు జైదేవ్ షా (సౌరాష్ట్ర) సైతం ఆఫీస్ బేరర్ పదవి రేసులో ఉన్నారు.



# సెమీఫైనల్లో సుమిత్ నాగల్

కాంపినాస్ (బ్రెజిల్) : భారత టెన్నిస్ వర్ధమాన ఆటగాడు సుమిత్ నాగల్ స్ఫూర్తిదాయక ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం జరిగిన క్వార్టర్స్‌లో అర్జెంటీనా ఆటగాడు ఏ.ానిస్సోక్కెప్ప 7(6)-6(2), 7-5తో వరుస సెట్లలో నాగల్ విజయం సాధించాడు. సుమిత్‌కు ఇది వరుసగా రెండో సెమీఫైనల్స్ కావటం విశేషం. నేడు సెమీ సమరంలో అర్జెంటీనాకే చెందిన జువాన్‌తో నాగల్ పోటీపడనున్నాడు. గత వారం 6-4, 6-2తో అర్జెంటీనా ఆటగాడిపై విజయంతో నాగల్ కెరీర్ రెండో ఏటీపీ టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. యుఎస్ ఓపెన్‌లో దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెదరర్‌పై నాగల్ ఓ సెట్ గెలుపొంది ఆకట్టుకున్నాడు.

# పుజారపై రోహిత్ ఫైర్!



భారత క్రికెట్‌లో ఎం.ఎస్ ధోని తర్వాత కూల్ క్రికెటర్‌గా రోహిత్ శర్మకు పేరు. అంతర్జాతీయ క్రికెట్‌లోనే కాదు ఐపీఎల్‌లోనూ రోహిత్ శర్మ మిస్టర్ కూల్ 2 పేరు నిలుపుకున్నాడు. విశాఖ టెస్టు నాల్గో రోజు రోహిత్ శర్మ సహనం కోల్పోయాడు. వేగంగా పరుగులు చేసి డిక్లరేషన్ చేయాలనే వ్యూహంలో భాగంగా రోహిత్ ధనాధన్ ఆడుతున్నాడు. అప్పటికి పుజార పరుగుల వేటలో జోరందుకోలేదు. ఈ దశలో సిల్లీ పాయింట్‌లో రోహిత్ సింగిల్‌కు పిలువగా.. పుజార నిరాకరించాడు. దీంతో ఆగ్రహించిన రోహిత్ ' పుజీ భాగ్ బెహన్....' అని అరిచాడు. స్టంప్ మైక్ ఈ మాటలను రికార్డు చేసింది. రోహిత్ కామెంట్‌పై సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పుజార, రోహిత్ రెండో వికెట్‌కు విలువైన 169 పరుగులు జోడించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.

epaper.navatelangana.com